అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 13-07-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 194 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

సుస్థిర అభివృద్ధిలో కేరళ అగ్రగామి

రెండూ మూడు స్థానాల్లో తమిళనాడు, గోవా

ఆరో స్థానంలో తెలంగాణ, ఏపీ

అత్యంత దిగువన బీహార్



నివేదిక విడుదల చేస్తున్న నిటి ఆయోగ్ సభ్యులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సుస్థిర అభివృద్ధిలో కేరళ అగ్రగామిగా నిలిచింది. బీహార్ అత్యంత దిగువకు చేరింది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ, పేదరికం నిర్మూలన, విద్య, ఆకలి, వైద్యం వంటి ...6లో



కేజ్రీవాల్‌కు

మధ్యంతర బెయిల్

ఈడీ కేసులో సుప్రీం తీర్పు


సీబీఐ కేసులో తీహార్ జైల్లోనే ...15లో



దళితుడిపై దాష్టీకం

యువకుడ్ని కొట్టి..మూత్రం తాపించి..

యోగి పాలనలో మైనార్టీలపై అంతులేని అరాచకాలు ...15లో



జూన్ 25

రాజ్యాంగ హత్యాదినం

ట్విట్టర్‌లో హోంశాఖమంత్రి అమిత్ షా వెల్లడి

1975 ఎమర్జెన్సీలో అమానవీయమైన బాధలు ...15లో

బలమైన వ్యవస్థగా హైడ్రా

గ్రేటర్ విపత్తు నిర్వహణ పరిధి పెంపు

- ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరణ
- పెనాల్టీ వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయింపు : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా)ను బలమైన వ్యవస్థగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. హైడ్రా ఏర్పాటు, విధివిధానాలపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జీహెచ్ఎంసీతో పాటు, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డ్, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా పని చేసేలా చర్యలు చేపట్టాలని ...15లో



హైడ్రా విధివిధానాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష, సీఎస్ శాంతకుమారి

ఆపరేషన్ హస్తం

కాంగ్రెస్ గూటికి గ్రేటర్ గులాబీలు

తాజాగా కండువా కప్పుకున్న ప్రకాశ్‌గౌడ్

తర్వాత లైన్లో ఉమ్మడి మెదక్

అసెంబ్లీ సమావేశాల్లోపే పూర్తికానున్న తతంగం



8లో..

సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రకాశ్ గౌడ్

నైనీకి సహకరించండి

ఒడిశా సీఎంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఒడిశాలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభించేందుకు సింగరేణి కాలరీస్‌కు సహకారం అందించాలని డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ...15లో



ఒడిశా సీఎంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

'మాది మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని పాల్వంచ గ్రామంలోని నిరుపేద దళిత కుటుంబం. మాకు ఇద్దరు కుమారులున్నారు. వాళ్లు చిన్న వాళ్లు. మాకు ఊర్లో 1.20 ఎకరాల భూమి ఉంది. కొద్దిపాటి పొలంతో పాటు కూలినాలి చేసి బతుకుతున్నం. ఈ ఏడాది మే నెలలో నా భర్త అన్నారం గోపాల్ (40) అనారోగ్యంతో మరణించాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి రైతు బీమా పథకం కింద జూన్ మాసంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందింది. బీమా కింద వచ్చిన డబ్బులు మా కుటుంబానికి ఎంతో సాయంగా ఉపయోగపడ్డాయి. ఇలాంటి పథకం ఉండడం రైతులకు భరోసాగా నిలుస్తుంది' ఇది రైతు బీమా పొందిన మహిళ అన్నారం మల్లమ్మ మాట. ఆమే కాదు.. రాష్ట్రంలో రైతు బీమా పథకం ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం పొందిన కుటుంబాలు లక్షకు పైగా ఉన్నాయి. అయితే ఆగస్టు 13తో 2023-24 ప్రీమియం గడువు ముగియ నుండటం, జులై 10 నుంచి చేపట్టాల్సిన కొత్త దరఖాస్తుల స్వీకరణ మొదలు కాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

రైతుబీమాపై డైలమా..!

రైతుబీమా RYTHU BIMA FARMER'S INSURANCE

- ఏటా జులై 10 నుంచే దరఖాస్తుల స్వీకరణ
- ఈయేడు ఇంకా నమోదు ప్రక్రియ చేపట్టని అధికారులు
- ఆగస్టు 13తో పాలసీ గడువు ముగింపు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వంలో అమలైన కొన్ని రైతు సంక్షేమ పథకాల్లో రైతు బీమా ఒకటి. రైతు సమూహ జీవిత బీమా పథకం ద్వారా రైతుకు ఎంత భూమి ఉన్నదనే దానితో నిమిత్తం లేకుండా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతు ఏదైన కారణం చేత మరణిస్తే అతని నామినికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. తద్వారా రైతు కుటుంబానికి సకాలంలో ఆర్థిక భద్రత, ఉపశమనం కలుగుతుంది. దీనికోసం ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసీతో గత ప్రభుత్వం రైతుల కోసం బీమా పథకాన్ని 2018-19 సంవత్సరంలో ప్రారంభించింది. ఒక్కో రైతు పేరిట ప్రీమియం మొత్తాన్ని రూ.3437ను ప్రభుత్వమే ఎల్ఐసీకి చెల్లిస్తుంది. అనుకోకుండా రైతు మరణిస్తే అతని కుటుంబానికి పది రోజుల్లోనే రైతు బీమా పేరిట రూ.5 లక్షలు అందిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైతు బీమా కోసం రూ.1500 కోట్లు మొదట్లో కేటాయించినప్పటికి ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో కొనసాగింపుపై సందిగ్ధం నెలకొంది.

ఇప్పటి వరకూ లక్ష కుటుంబాలకు రూ.5402 కోట్ల ఆర్థిక సాయం

రైతు బీమా.. ఎంతో ధీమా

రైతు బీమా పథకానికి ఎంతో ధీమా కల్పించేదిగా పేరుంది. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాలు కలిగిన రైతులు అర్హులవుతారు. రాష్ట్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 41.02 లక్షల మంది రైతులను అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి బీమా కోసం ఎల్ఐసీకి ప్రీమియం మొత్తంగా రూ.1477 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. అధికారిక లెక్కల ప్రకారం.. రాష్ట్రంలో 2018 నుంచి 2024 వరకు 1,08,051 మంది రైతులు వివిధ కారణాల చేత చనిపోగా వీరికి రూ.5 లక్షల ఆర్థిక సాయం కింద రూ.5402.55 కోట్లు అందజేయబడ్డాయి. రైతు బీమా పథకం కోసం ప్రతి ఏటా జులై 10 నుంచి ఆగస్టు 5 వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు, గతంలో రైతు బీమాలో నమోదు కాని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తుల్ని స్వీకరిస్తారు. వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి రైతు బీమా పథకంలో నమోదు చేస్తారు.

కొత్త పేర్ల నమోదు జరగట్లే

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంకా రైతు బీమా పథకం కింద నమోదు ప్రక్రియ మొదలవ్వలేదు. ప్రతి ఏటా జులై 10 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు మండల కేంద్రాల్లోని వ్యవసాయ అధికారులు రైతుల నుంచి ...5లో

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి

రైతు బీమా పథకం అమలు గురించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బీమా పథకం అమలు చేయబడుతుంది. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. జులై చివరి లేదా ఆగస్టు మొదటి వారంలో గైడ్‌లైన్స్ వచ్చే అవకాశం ఉంది.

-అంబికా సోనీ, జిల్లా వ్యవసాయ అధికారి

పాతా కొత్తా లేదు..అంతా మనోళ్లే

ఈటల పార్టీకి పాతైపోయారు

- కలిసికట్టుగా పనిచేయండి
- 1500 రోజుల ప్రణాళికతో ముందుకెళ్లండి : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి : రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/శంషాబాద్

బీజేపీలో పాతాకొత్తా లేదనీ, పార్టీలో చేరిన వారంతా పాతవారేనని కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ పార్టీకి కొత్తవారు కాదని పాతవారై పోయారని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారీగా పార్టీ బలోపేతానికి నేతలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు తమ వద్ద 1500 రోజుల ప్రణాళిక ఉందని చెప్పారు. తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యం నేతల పదవుల కోసం కాదనీ, రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమని చెప్పారు. శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో ప్రతి సమస్యపైనా కార్యకర్తలు దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో సామాన్య ...15లో



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

నో బెయిల్

ఫోన్‌ట్యాపింగ్ కేసులో నలుగురు అధికారులకు మళ్లీ నిరాశే

నాంపల్లి కోర్టు ఆదేశాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కలకలం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో తిరిగి నలుగురు అధికారులకు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో నిందితులైన డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీజీపీ రాధాకిషన్‌రావులకు న్యాయమూర్తి బెయిలివ్వటానికి నిరాకరిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయ్యాక ఈ నలుగురు నిందితులు బెయిల్ కోసం ప్రయత్నించటం ఇది నాలుగోసారి. కాగా, వీరికి బెయిల్ లభిస్తే, వెలుపలికి వచ్చి కీలకమైన ఆధారాలను తారుమారు చేయడంతో పాటు సాక్షులను ...6లో



ఈఎస్ఐలో నిధుల దుర్వినియోగం

అవసరం లేకున్నా ప్రయివేటు ఆస్పత్రులకు రోగుల రెఫర్

ఆస్పత్రులు, డిస్పెన్సరీలు పెంచాలి : సీఐటీయూ ధర్నాలో భూపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్మికుల కోసం వినియోగించాల్సిన ఈఎస్ఐ నిధులు దుర్వినియోగమవుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ విమర్శించారు. ఈఎస్ఐలో బెడ్ల కొరత పేరుతో ప్రయివేటు ఆస్పత్రులకు రోగులను రెఫర్ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్మికులు, నాయకులు గంటకుపైగా బైఠాయించి నిరసన తెలిపారు. డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ఈఎస్ఐ లబ్దిదారుల సంఖ్యకు తగినట్టు ఆస్పత్రులు, డిస్పెన్సరీల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెద్ద ఎత్తున వచ్చాయనీ, అనేక ...6లో

హైదరాబాద్‌లో...



కేరళ ప్రజల కల సాకారమైన వేళ..!

విజింజం ఓడరేవు ట్రయల్ రన్ ప్రారంభం

మొదటి మదర్‌షిప్ శాన్ ఫెర్నాండో రాక



జ్యోతిప్రజ్వల చేస్తున్న కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం : కేరళ సముద్ర జలాల చరిత్రలోనే అద్భుతమైన క్షణం ఆవిర్భవించింది. తిరువనంతపురం సమీపంలోని విజింజం అంతర్జాతీయ ఓడరేవుకు మొట్టమొదటి కంటెయినర్ ఓడ వచ్చింది. సహజసిద్ధమైన ఈ ఓడరేవు అభివృద్ధిని, రాష్ట్ర అభివృద్ధి పట్ల వామపక్ష ప్రజాతంత్ర ...6లో

మిర్చి ధరల రెపరెపలు లేవు. ఏసీ మిర్చి ధరలు పడిపోతుండటంతో పంటపెట్టుబ డుల సమయంలోనూ కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచిన సరుకు తీసేందుకు రైతులు సంకోచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలయ్యి రెండునెలలు కావస్తున్నా ప్రభుత్వం వైపు నుంచి పంటపెట్టుబడి సహాయం అందకపోవడం తో ప్రయివేటు వడ్డీకి తెచ్చిన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది మిర్చి దిగుబడులు ఆరంభం నాటి నుంచి ఏ సందర్భంలోనూ ఆశించిన ధరలు లేకపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు పేరుకుపోయాయి.

పడిపోతున్న మిర్చి ధరలు

కోల్డ్‌స్టోరేజీల్లో భారీగా నిల్వలు | పెట్టుబడి కోసం రైతుల అవస్థలు

సరుకు కొనుగోళ్లలో వ్యత్యాసాలు

రైతుకన్నా వ్యాపారి సరుకుకే రేటెక్కువ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

. రాష్ట్రంలోనే పేరెన్నికగన్న మిర్చి మార్కెట్లలో వరంగల్ తర్వాత ఖమ్మం ప్రాచుర్యం పొందింది. అటువంటి చోట మిర్చి ధరలు గణనీయంగా పడిపోతుండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. తమ మిర్చి కన్నా సిండికేట్ అయిన వ్యాపారుల సరుకుకు అధిక రేటు పెట్టి కొనుగోలు చేస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. సరైన రేటు లేకపోవడంతో ఫిబ్రవరి నాటి నుంచి మిర్చి నిల్వ చేస్తున్న రైతులు అనేక మంది ఉన్నారు. ధరలు ఆశాజనకంగా లేకపోవడం ఈ ఏడాది మిర్చి సాగుపైనా ప్రభావం చూపుతోంది. గతం కన్నా గణనీయంగా మిర్చి విత్తనాల కొనుగోళ్లు తగ్గినట్టు సీడ్స్ డీలర్లు చెబుతున్నారు.



భారీగా నిల్వలు..

ఖమ్మం మార్కెట్‌కు ఇక్కడి నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మిర్చి వస్తుంది. సరైన రేటు లేని సమయంలో జిల్లాలోని 48 కోల్డ్ స్టోరేజీల్లో ఆయా ప్రాంతాల రైతులు నిల్వ చేసుకుంటారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు అనేక జిల్లాల నుంచి వచ్చి నిల్వ చేసుకున్నారు. ఫిబ్రవరి, మార్చి నాటి నుంచి ఆశించిన ధరలు లభించకపోవడంతో పలువురు రైతులు స్టోరేజీల్లో నిల్వ చేశారు. ఖమ్మంలో స్టోరేజీల సామర్థ్యం 46,98,500 బస్తాలు కాగా ప్రస్తుతం వీటిలో 38 లక్షలకు పైగా నిల్వలు ఉన్నాయి. దీనిలో వ్యాపారుల సరుకు 10.94 లక్షల వరకు ఉండగా రైతులకు చెందినది 27.22 లక్షల బస్తాలకు పైగా ఉన్నాయి. క్రితం ఏడాది ఈ సమయానికి ఇందులో సగం సరుకు కూడా లేకపోవడం గమనార్హం. సరైన నిర్వహణ లేక కొన్ని ...5లో

ప్రభుత్వ, స్థానిక సంస్థల టీచర్లు సమానమే

- ఎంఈవో, డిప్యూటీఈవో ఇతర పోస్టులకు పదోన్నతులివ్వాలి :

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులు, స్థానిక సంస్థలు (లోకల్ బాడీ) ఉపాధ్యాయులను కూడా లోకల్ క్యాడర్‌గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. 2015 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉపాధ్యాయులు సమానమేనని పేర్కొన్నారు. మండల విద్యాధికారులు (ఎంఈవో), ఉప విద్యాధికారులు (డిప్యూటీఈవో), డైట్ లెక్చరర్లు, బీఈడీ కాలేజీల లెక్చరర్లు, ఎస్‌సీఈఆర్టీలో బోధనా పోస్టుల్లో వెంటనే పదోన్నతులను కల్పించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. ఆ పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి తగు ఆదేశాలివ్వాలని కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-1975 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులను లోకల్ క్యాడర్‌గా ప్రకటించారని తెలిపారు. కానీ స్థానిక సంస్థల ఉపాధ్యాయుల సర్వీసులను లోకల్ క్యాడర్‌గా ప్రకటించలేదని పేర్కొన్నారు. దీంతో ఆ పోస్టుల్లో స్థానిక సంస్థల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడానికి ప్రధాన ఆటంకంగా ఉందంటూ 2015, సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు చెప్పిందని వివరించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉపాధ్యాయులు లోకల్‌క్యాడర్‌గా ప్రకటించారని తెలిపారు. దీంతో రెండు యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల ఉమ్మడి జాబితా ద్వారా ఆయా పోస్టుల్లో పదోన్నతులను అమలు చేయాలని కోరారు. పదోన్నతులిచ్చే విధంగా విద్యాశాఖ అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.



న్యాయ విచారణ జరిపించాలి

- డీజీపీకి ఆప్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాలోతు సురేష్‌ను తొర్రూరు సీఐ చితకబాదిన ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో నాయకులు శుక్రవారం డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కనీసం ఫోన్లో కూడా మాట్లాడకుండా సదరు సీఐ సెల్‌ఫోన్ కూడా లాక్కున్నారని ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డీజీపీని కలిసిన వారిలో కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహమ్మద్ మాజీద్ తదితరులున్నారు.

104 ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

- వైద్యారోగ్యశాఖ కమిషనర్‌కు టీయుఎంహెచ్ఇయు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని 104 ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ -సీఐటీయూ అనుబంధం), హెచ్ 1 యూనియన్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు టీయుఎంహెచ్ఇయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, హెచ్ 1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి నేతృత్వంలో నాయకులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు. గుర్తింపు సంఘం పేరుతో కొంత మంది చేసే పైరవీలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, బదిలీలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటాననీ, 104 ఉద్యోగుల సమస్యలు, బదిలీల విషయం పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

స్పెషల్ ట్రైన్ పేరుతో అధిక చార్జీల వసూలు

- ప్రొఫెసర్ కోదండరాంకు ముంబైకర్ల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్-సీఎస్ఎంటీల మధ్య స్పెషల్ ఫేర్ రైలు పేరుతో అధిక చార్జీలను వసూలు చేస్తున్నారని పలువురు ముంబైకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ముంబై, భీవండి వలస వెళ్లిన తెలంగాణీయులు హైదరాబాద్‌లో కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పెషల్ రైలులో వికలాంగుల రాయితీని అనుమతించడం లేదని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. స్పెషల్ రైలును రెగ్యులర్ రైలుగా మార్చాలనీ, అజంతా ఎక్స్‌ప్రెస్‌ను ముంబై వరకు, నాందేడ్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, పన్వెల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కరీంనగర్ వరకు పొడిగించాలని అభ్యర్థించారు. తమ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డితో పాటు రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర చిరునామాతో ఆధార్ కార్డులు కలిగి ఉన్న తెలుగు ముంబైకర్లకు తెలంగాణలో కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడం లేదని తెలిపారు.

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హెూసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఏదేని లావాదేవీలు జరుపదలచినవారు ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి జరుపుకోవచ్చును.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	మహ్మద్ వసీమ్ పరేజ్/నఫీజ్ బిన్ ఒమర్/ TBBNG00006540486	షెడ్యూల్ "ఎ" :- స్థిరాస్తి యొక్క మొత్తం మరియు భాగం, ఖాతా నెం. 711/82/44 కలిగియున్న పడమర పోర్షన్, కొత్త బిబిఎంపి ఖాతా నెం : 312/711/44, హెూరమావు అగరా గ్రామం వద్ద ఉన్నది, కె.ఆర్.పురం హెూబ్లీ, బెంగళూర్ ఈస్ట్ తాలూకా, ప్రస్తుతం బృహత్ బెంగళూర్ మహానగర పాలిక(బిబిఎంపి) లిమిట్స్ జ్యూరిస్‌డిక్షన్ క్రిందకు వస్తుంది, బెంగళూర్, కొలత:- తూర్పు నుండి పడమరకు: 33-0 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణానికి : 75-0 అడుగులు, మొత్తం: 2475 చ.అడుగులు,, మరియు సరిహద్దులు:- తూర్పు : ఆస్తి నెం.711/82/44 (జ్వాలా కుమార్ తివారీ), పడమర: మునిస్వామప్ప ఆస్తి నెం.711/82/44, ఉత్తరం: ఈశ్వరప్పకు చెందిన ఇల్లు, దక్షిణం : రోడ్డు., / భౌతిక స్వాధీనతా తేది : 09/07/2024.	07.03.2024 Rs. 1,03,96,207.00/-	బెంగళూర్

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది : జులై 12, 2024
ప్రదేశం : హైదరాబాద్

నిజాయితీగా, అధీకృత సంతకందారు,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్

(పూర్వం ఐడిఎఫ్‌సి ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో విలీనమైనది)

IDFC FIRST Bank

CIN : L65110TN2014PLC097792
రిజిస్టర్డ్ ఆఫీస్: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్‌పేట్, చెన్నై-600031.
TEL: +91 44 4564 4000 | FAX: +91 44 4564 4022.

బహిరంగ ప్రకటన
బంగారం వేలం మరియు ఆహ్వాన ప్రకటన

దిగువ పేర్కొన్న రుణగ్రహీత, బంగారు ఆభరణాలకుగాను ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సౌకర్యం పొందినందున బకాయి మొత్తాన్ని చెల్లించాల్సిందిగా అతనికి నోటీసులు జారీ చేయబడినవి. దిగువ పేర్కొన్న సౌకర్యానికి బకాయిలను చెల్లించడంలో రుణగ్రహీత విఫలమయ్యారు. తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలకు 23/07/2024న వేలం నిర్వహించాలని మేము నిర్ణయించాం. వేలం ద్వారా ఏదైనా అదనపు మొత్తం సమకూరినట్టయితే, సంబంధిత రుణగ్రహీతకు తిరిగి ఇవ్వబడును మరియు వేలం తర్వాత ఒకవేళ ఏదైనా లోటు ఏర్పడితే, మిగతా బకాయి మొత్తాన్ని రుణగ్రహీత నుండి తగిన చట్టబద్ధ విధానాల ద్వారా రికవర్ చేయబడును. ఏవిధమైన ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేలం నుండి ఇక్కడ పేర్కొంటున్న ఖాతాను తొలగించే అధికారాన్ని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కలిగియున్నది. ఏవిధమైన ముందస్తు నోటీసు లేకుండా తదుపరి వేలం తేదీని మార్చే హక్కును ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ కలిగియున్నది.

రుణ ఖాతా సంఖ్య	వినియోగదారుని పేరు	బ్రాంచ్ పేరు
139273561	చీదెరాల సాయి శశాంక్	ఎస్ ఆర్ నగర్, హైదరాబాద్

23/07/2024న మ. 12:00 గం. నుండి సా. 3:00 గం. వరకు https://egold.auctiontiger.net **ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును.** ఈ యొక్క ప్రచురణ ద్వారా సంబంధిత రుణగ్రహీతకు ఇందుమూలంగా చివరి నోటీసు ఇస్తున్నాం మరియు వేలం షెడ్యూల్ తేదీకన్నా ముందే మొత్తం వడ్డీ మరియు చార్జీలతోపాటు తిరిగి పిలుపునిచ్చిన మొత్తంను చెల్లించుటకు చివరి అవకాశం కల్పిస్తున్నాం. విఫలం చెందినట్టయితే ఆభరణాలు వేలం వేయబడును. దయచేసి గమనించాల్సిందేమనగా, ఒకవేళ అదే రోజున నిర్దేశిత కాలవ్యవధిలో వేలం పూర్తి కానట్టయితే, తాకట్టు పెట్టిన ఆభరణాలకు తదుపరి 7 రోజుల్లోగా అవే నిబంధనలు మరియు షరతులతో బ్యాంక్ తిరిగి వేలం నిర్వహిస్తుంది. ఒకవేళ వినియోగదారుడు మరణించినట్టయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని చట్టబద్ధ వారసులకు వర్తిస్తాయి.

తేది: 13/07/2024, ప్రదేశం: ఎస్ ఆర్ నగర్, హైదరాబాద్.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హెూసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఏదేని లావాదేవీలు జరుపదలచినవారు ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి జరుపుకోవచ్చును.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/లాంఛనప్రాయంగా స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	వోమిన్ ఏజెన్సీస్, శివకోటి బాబు & శివకోటి శాంతి/ ప్లాట్ నెం. 32/ఎ & 32/బి, తాతానగర్, భోనగిరి, రఘునాథపాలెం, నల్గొండ-508116/ 380105500084.	(లోన్ డాక్యుమెంట్‌లో వివరించిన విధంగా/ ఆస్తి డాక్యుమెంట్‌లో కవరైనది :-నెంబర్లు : 32/ఎ & 32/బి కలిగియున్న ఓపెన్ ప్లాట్ మొత్తం (రెసిడెన్షియల్ జోన్), సర్వే నెం. 930లో, విస్తీర్ణం: 179.25 చ.గజాలు లేదా 149.85 చ.మీటర్లకు సమానమైనది, తాతానగర్ వద్ద ఉన్నది, భోనగిరి పట్టణం మరియు మండలం, నల్గొండ జిల్లా, రిజిస్ట్రేషన్ ఉపజిల్లా : భోనగిరి, రిజిస్ట్రేషన్ జిల్లా : నల్గొండ, భోనగిరి మున్సిపాలిటీ పరిధిలోనిది, మున్సిపల్ వార్డు నెం. 1 మరియు బ్లాక్ నెం. 4లో, ప్లాట్ నెం. 32/ఎ, 88.75 చ.గజాలు కలిగియున్నది, మరియు ప్లాట్ నెం. 32/బి, 90.50 చ.గజాలు కలిగియున్నది., సరిహద్దులు:- ఉత్తరం: ప్లాట్ నెం.31, దక్షిణం : ప్లాట్ నెం.33, తూర్పు : పొరుగువారి ఇండ్లు, పడమర: 30" వెడల్పు రోడ్డు../ లాంఛనప్రాయ స్వాధీనత తేది : 09, జులై, 2024.	06-04-2024 Rs. 36,29,477/-	నల్గొండ

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది : జులై 12, 2024
ప్రదేశం : నల్గొండ & సికింద్రాబాద్

నిజాయితీగా, అధీకృత సంతకందారు,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్స్, బొమ్మహల్లి హెూసూర్ మెయిన్ రోడ్, బెంగుళూరు-560068.

ఏదైతే, క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలను, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. [illegible]

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరాలు/ లాంఛనప్రాయ స్వాధీనం తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తం (రూ)	బ్రాంచి పేరు
1.	[illegible] 502103/ 069105500478.	[illegible] సిద్దిపేట [illegible]	మార్చి 07, 2024 రూ. 1,27,19,768/-	సిద్దిపేట

[illegible]

తేది: జులై 12, 2024
ప్రదేశం: జహీరాబాద్ & కరీంనగర్ & సికింద్రాబాద్ & సిద్దిపేట

సం/-అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్స్, బొమ్మహల్లి హెూసూర్ మెయిన్ రోడ్, బెంగుళూరు-560068.

[illegible]

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరాలు/ లాంఛనప్రాయ స్వాధీనం తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తం (రూ)	బ్రాంచి పేరు
1.	వసుధ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, [illegible] 416605000131.	మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, హైదరాబాద్ [illegible] లాంఛనప్రాయ స్వాధీనత తేది: 9 జులై 2024.	మార్చి 07, 2024 రూ. 2,62,63,150/-	హైదరాబాద్

[illegible]

తేది: జులై 12, 2024
ప్రదేశం: సికింద్రాబాద్ & హైదరాబాద్

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

ఐబిసి, 2016 క్రింద అమ్మకపు ప్రకటన

సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)

లిక్విడేటర్ వారిచిరునామా: 6-3-249/6, 402, 4వ అంతస్తు, 'అల్జూర్ ప్లాజా & టవర్స్", రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. ఇమెయిల్: cirp.sbil@gmail.com

ఇ-వేలం

ఇందుమూలంగా ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ 2016 మరియు అందులో పేర్కొన్న రెగ్యులేషన్స్ క్రింద సాధారణ ప్రజానీకానికి ప్రకటన ఇవ్వడమేమనగా తేది.01 మార్చ్, 2024నాటి ఉత్తర్వు ఆధారంగా గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-2 చే నియమించిన లిక్విడేటర్‌చే గోయింగ్ కన్‌సర్న్‌గా మెసర్స్ సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో) CIN - U27100TG2007PLC056809, దీని రిజిస్టర్డ్ ఆఫీసు: ప్లాట్ నెం.73, లేన్ నెం.5, రోడ్ నెం.72, ప్రశాసన్ నగర్, ఆంధ్రాబ్యాంక్ దగ్గర, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500086 ఇండియా యొక్క ఆస్తుల అమ్మకం కొరకు బిడ్లను ఆహ్వానిస్తున్నారు.

వివరణ	వేలం తేది& సమయం	రిజర్వు ధర	ఈఎండి (రీఫండబుల్)	బిడ్ పెంపుదల మొత్తం
మొత్తంగా కార్పొరేట్ డేటార్ (గోయింగ్ కన్‌సర్న్ ప్రతిపాదికన)	08.08.2024 గురువారం ఉ.11.00గం.ల నుండి మ.01.00గం.ల వరకు	రూ.7.50 కోట్లు	రూ. 0.75 కోట్లు	రూ.0.10 కోట్లు

1) ఇ-వేలం ప్లాట్ ఫారమ్ www.auctionbazaar.com ద్వారా దిగువ సంతకందారు వారిచే విక్రయం చేయబడుతుంది (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)
2) అమ్మకం అనునది 'ఎక్కడ ఎలా ఉన్నది & ఎక్కడ అలాగే, ఏదేని రికోర్స్ లేకుండా అనే ప్రతిపాదికన నిర్వహించబడును.
3) ఇ-వేలం విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నియమ నిబంధనల కొరకు www.auctionbazaar.com లేదా www. sai bhaskarironslimited.in లో అందుబాటులో ఉన్నపూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రాన్ని చూడండి లేదా లిక్విడేటర్, cirp.sbil@gmail.comకు ఇమెయిల్ పంపడం ద్వారా కూడా పొందవచ్చు ఫోన్ నెం.9959223615 లేదా శ్రీ ఎస్ ఉపేంద్ర రెడ్డి, ఇమెయిల్: supendrareddys @gmail.com కి ఇమెయిల్ పంపడం ద్వారా కూడా పొందవచ్చు, ఫోన్‌నెం. 7799278523.
4) ఇ-వేలం వివరాలు & పాల్గొనడం కోసం, శ్రీ రామ్ చంద్రా రావు, ఫోన్ నెం.8978377228, శ్రీ శివ, ఫోన్ నెం.8886667111, మెయిల్: contact@ auctionbazaar.com వారిని సంప్రదించండి.
5) ఆసక్తిగల బిడ్డరుదారులు ఆసక్తి వ్యక్తీకరణ (ఇఒఐ) సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: 27.07.2024న సా.5:00 గం.ల వరకు.
6) తనిఖీ తేదీ & సమయం: 13 జూలై, 2024 నుండి 27 జూలై, 2024 వరకు పనివేళల్లో.
7) అర్హత కలిగిన బిడ్డర్లు మాత్రమే ఇఎండి& ఇతర ఫారమ్‌లను చెల్లించడానికి చివరి తేదీ మరియు సమయం: 06.08.2024న సా.5:00గం.ల వరకు.
8) ఆసక్తిగల బిడ్డర్లు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లను సందర్శించి, బిడ్‌ను సమర్పించవలసిందిగా అభ్యర్థించారు.
9) ఇ-వేలం యొక్క ఏవైనా నిబంధనలు మరియు షరతులను ఆమోదించడానికి లేదా రద్దు చేయడానికి లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి లిక్విడేటర్‌కు హక్కు ఉంది.
10) ఇ-వేలం నోటీసులో ఏదైనా అనుబంధం / వ్యక్తీకరణలు & సవరణలు లేదా ఈ ఇ-వేలం నోటీసుకు సంబంధించిన ప్రక్రియ పత్రం కార్పొరేట్ డేటార్ వెబ్‌సైట్ (www.saibhaskarironslimited.in)లో అప్‌లోడ్ చేయబడుతుంది. పబ్లిక్ ప్రకటన లేదా పేపర్ ప్రచురణ లేదా ఏదేని ఇతర విధానంలో ఉండదు.

డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్
Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
లిక్విడేటర్, సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్
ఇమెయిల్: cirp.sbil@gmail.coms

ప్రదేశం: హైదరాబాద్
తేది: 13-07-2024

ఫారం A
బహిరంగ ప్రకటన

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద)
"ట్రైడెంట్ సుగర్స్ లిమిటెడ్"
యొక్క రుణదాతలు శ్రద్ధ వహించుటకు

సంబంధిత వివరాలు		
1	కార్పొరేట్ డెటార్ పేరు	ట్రైడెంట్ సుగర్స్ లిమిటెడ్
2	కార్పొరేట్ డెటార్ యొక్క ఇన్‌కార్పొరేషన్ తేది	22/08/2002
3	ఇన్‌కార్పొరేటెడ్ చేసిన/ రిజిస్టర్డు చేసిన కార్పొరేట్ డెటార్ క్రింది అథారిటీ	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ - హైదరాబాద్
4	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు నెంబరు	U15424TG2002PLC119553
5	కార్పొరేట్ డెటార్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు మరియు ప్రిన్సిపల్ ఆఫీసు (ఏదైనఉన్నచో) చిరునామా	రిజిస్టర్డు ఆఫీసు: కొత్తూరు (డి) గ్రామం, మధురానగర్ పోస్ట్, మెదక్, జహీరాబాద్, తెలంగాణ, ఇండియా-502228. కార్పొరేట్ ఆఫీసు: హౌస్ ఆఫ్ పాలోమ్, ప్లాట్ నెం.13, సర్వే నెం.90/1, 2వ అంతస్తు, గ్రీన్ ల్యాండ్ కాలనీ, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ, ఇండియా-500032
6	కార్పొరేట్ డెటార్‌కు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	09.07.2024, ఎన్‌సిఎల్‌టి, హైదరాబాద్ ద్వారా ఉత్తర్వు ప్రకటన తేది (ఉత్తర్వు కాపీ ఎన్‌సిఎల్‌టి వెబ్‌సైట్‌లో 12.07.2024న అప్‌లోడ్ చేయబడినది)
7	ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ ముగింపు అంచనా తేది	05.01.2025 (09.07.2024 నుండి 180 రోజులు)
8	ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	పేరు: మంజీత్ బచ్చ IP Registration No.: IBBI/IPA-002/IP-N00808/2019-2020/12551
9	బోర్డుతో నమోదుచేసుకొన్నట్లు ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	చిరునామా: 5-9-91 &93, డోర్ నెం.204, 2వ అంతస్తు, శక్తిసాయి కాంప్లెక్స్, ఉదాయ్ క్లినిక్ దగ్గర, చాపెల్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్, తెలంగాణ-500001 E-mail: manjeetbucha@gmail.com Telephone No.: +919346955001
10	ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదింపుల కొరకు ఉపయోగించవలసిన చిరునామా మరియు ఇ-మెయిల్	మంజీత్ బచ్చ కంపెనీ సెక్రటరీ 5-9-91 &93, డోర్ నెం.204, 2వ అంతస్తు, శక్తిసాయి కాంప్లెక్స్, ఉదాయ్ క్లినిక్ దగ్గర, చాపెల్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్, తెలంగాణ-500001 E-mail: cirp.tsl@gmail.com Telephone No.: +919346955001
11	క్లెయిములు దాఖలు చేయుటకు చివరి తేది	26/07/2024
12	ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌చే నిర్ధారించిన సెక్షన్ 21లోని సబ్-సెక్షన్ (6ఎ) యొక్క నిబంధన (బి) లో క్రెడిటార్ల తరగతులు, ఏవైనా ఉన్నచో	నిర్ధారించలేదు
13	తరగతిలోని క్రెడిటార్స్ యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించుటకు గుర్తించిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ యొక్క పేర్లు (ప్రతి తరగతికి మూడు పేర్లు)	నిర్ధారించలేదు
14	(ఎ) సంబంధిత ఫారాలు మరియు (బి) అధీకృత ప్రతినిధుల వివరములు ఇక్కడ లభించును.	ఎ) ఫారాలను ఇక్కడ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. https://ibbi.gov.in/home/downloads

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా 09-07-2024న మెసర్స్ ట్రైడెంట్ సుగర్స్ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ప్రారంభమైనదిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ ఆదేశించింది. (ఉత్తర్వు కాపీ ఎన్‌సిఎల్‌టి వెబ్‌సైట్‌లో 12.07.2024న అప్‌లోడ్ చేయబడినది)

ట్రైడెంట్ సుగర్స్ లిమిటెడ్ యొక్క క్రెడిటర్లను రుజువులతో వారి క్లెయిములను 26.07.2024న లేదా ముందుగా ఎంట్రీ నెం.10లో పేర్కొన్న చిరునామాలో ఇంటెరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల్ వారికి దాఖలు చేయాలి.

ఫైనాన్షియల్ క్రెడిటర్లు రుజువులతో వారిక్లెయిమ్సునుఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే దాఖలుచేయాలి. అందరు ఇతర క్రెడిటర్లు రుజువులతో వారి క్లెయిములను నేరుగా, పోస్టుద్వారా లేదాఎలక్ట్రానిక్ విధానం ద్వారా దాఖలుచేయాలి.

ఎంట్రీ నెం.12 ఎదురుగా పేర్కొన్న లిస్ట్‌చేసినట్లుగా తరగతికి చెందిన ఫైనాన్షియల్ క్రెడిటర్, ఫారం సిఎలో (పేర్కొన్న తరగతి) తరగతి యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించడానికి ఎంట్రీ నెం.13కు ఎదురుగా లిస్ట్‌చేసిన ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుండి అధీకృత ప్రతినిధి యొక్క ఎంపికను సూచిస్తుంది.

తప్పుడు లేదా తప్పుత్రోవపట్టించు క్లెయిం దాఖలుచేయుట జరిమానాలు విధించబడతాయి.

మంజీత్ బచ్చ
IBBI/IPA-002/IP-N00808/2019-2020/12551
ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
ట్రైడెంట్ సుగర్స్ లిమిటెడ్ విషయంలో

తేది: 12 జులై, 2024
ప్రదేశం: హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం
మిషన్ భగీరథ శాఖ

టెండర్ నోటీసు నెం: AE/DEE/MB/RR/Tenders/01/2024-25, తేది : 10/07/2024.

పని యొక్క పేరు: మల్లి చెట్టు రీట్రీట్ మరియు బిటిఆర్ గ్రీన్స్ & ప్రశాంతత కొరకు బల్క్ వాటర్ కనెక్షన్లు సమకూర్చుటకు సమగ్ర పైప్‌లైన్ వేయడం, తుమ్మలూరు (గ్రా.), మహేశ్వరం (మం.), రంగారెడ్డి జిల్లాలో, శ్రీశైలం సెగ్మెంట్ (క్వాలిటీలీ డివిజన్ తర్వాత బ్యాలెన్స్ పని). **అంచనా వ్యయం (రూ. లక్షలలో)** 77.00 **టెండర్ డాక్యుమెంట్లు లభించు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ :** tender.telangana.gov.in 18/07/2024 నుండి 02/08/2024 సా. 3.00 గం. వరకు **టెండర్ స్వీకరించు గడువు** 02/08/2024 సా. 3.30 గం. వరకు **టెక్నికల్ బిడ్ తెరిచే తేది** 02/08/2024 సా. 4.00 గం.కు **ఫైనాన్షియల్ బిడ్ తెరిచే తేది** 06/08/2024 ఉ. 11.30 గం.కు **సంప్రదించు నెం :** 9032390340/7 995660531 తదుపరి వివరాల కొరకు tender.telangana.gov.in వద్ద చూడగలరు.

DIPR R.O.No.297-DP/CL/ADVT/1/2024-25, Dt: 12.07.2024

సం/- చీఫ్ ఇంజనీర్-IX,
మిషన్ భగీరథ, హైదరాబాద్.

కెనఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd

బ్రాంచ్: ప్లాట్ నెం. 1, బిందు ఎలిగెన్స్, సర్వే నెం. 12,24, పేట్ బషీర్‌బాగ్, కొంపల్లి, హైదరాబాద్-500067, టెలి నెం.040-27164210.
ఇ-మెయిల్: kompally@canfinhomes.com, CIN No: L85110KA1987PLC008699

స్వాధీనత నోటీసు [రూల్ 8(1)] [స్థిరాస్తి కొరకు]

ఏదైతే, దిగువ సంతకందారుడు అయిన కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సదరు చట్టం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూర్డ్ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగిస్తూ **03-05-2024 తేదీన డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది. పిలువబడిన రుణగ్రహీతలు: **శ్రీ యెద్ల పర్వతాలు & శ్రీమతి తెల్లబోయిన వళిని కుమారిలను** నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని **రూ.36,80,835/- రూపాయలు ముప్పై ఆరు లక్షల ఎనభై వేల ఎనిమిది వందల ముప్పై ఐదు మాత్రమే)** రియలైజేషన్ తేది వరకు ఒప్పందం రేటు వద్ద తదుపరి వడ్డీతో సదరు నోటీసు తేదీ నుండి **60 రోజులలోపు** మొత్తాన్ని తిరిగి చెల్లించాలని తెలపడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా అధీకృత అధికారి అతనికి అందించిన అధికారాలను అధ్యయనం చేస్తూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002లోని రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తిని **10 జులై 2024వ తేదీన** దిగువ సంతకందారుడు **స్వాధీనపరుచుకున్నాడు.**

రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం [illegible] సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) [illegible]

[illegible]

స్థిరాస్తి యొక్క వివరణ:

తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, బాచుపల్లి గ్రామం & మండలం వద్దనున్న సర్వే నెం.లు 7,8,11,13,14&33లలో ప్లాట్ నెం.151,152,153 మరియు 154పై 20 చ.గజాల అవిభాజ్య వాటాగాగల భూమి (888.88 చ.గజాలలోనిది)లో కైవ రెసిడెన్సీలో బ్లాక్-సిలో 1150 చ.అడుగులు (80 చ.అ.ల కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్ ఏరియా కలుపుకొని) 2వ అంతస్తులో ప్లాట్ నెం. 205 యావదాస్తి. సరిహద్దులు: ప్లాట్ సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ ప్రదేశం, దక్షిణం: ఖాళీ ప్రదేశం, తూర్పు: కారిడార్, పడమర: ఖాళీ ప్రదేశం. ప్లాట్ సరిహద్దులు: ఉత్తరం: 30-0 వెడల్పు రోడ్డు, దక్షిణం: 40-0 వెడల్పు రోడ్డు, తూర్పు: 40-0 వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.లు 150 & 155.

తేది: 12.07.2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

HDFC BANK

We understand your world

హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్: హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్: హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు) (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, రిజిస్టర్డ్ కార్యాలయం బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి-400013 మరియు కార్యాలయం / రీజనల్ కార్యాలయం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, # 50-96-5, ప్లాట్ నెం.175, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013, ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 3వ నిబంధనతో చదివే 13(12)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం **తేది.30.10.2023 నాటికి రూ.24,44,659.89 పై (అక్షరాల ఇరవై నాలుగు లక్షల నలభై నాలుగు వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో సహా చెల్లించమని కోరుతూ **ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ స్టైల్ ఎన్ స్టైల్ (ఋణగ్రహీత)** (ఫార్మాస్యూటికల్ మరియు మెడికల్ గూడ్స్, కాస్మెటిక్ మరియు టాయిలెట్ ఆర్టికల్స్ టెక్స్‌టైల్స్, క్లాతింగ్, ఫుట్‌వేర్ మరియు లెదర్ గూడ్స్ ప్రోడక్ట్స్ యొక్క స్పెషలైజ్డ్ స్టోర్‌లోని రిటైల్ విక్రయం), డోర్ నెం.12-13/60, మెయిన్ రోడ్డు, తార్నక, హైదరాబాద్, తెలంగాణ, ఆం.ప్ర-500007. **ప్రస్తుతం : మెస్సర్స్ స్టైల్ ఎన్ స్టైల్ (ఋణగ్రహీత)** ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్ట్‌నర్ **శ్రీ పేరకం వెంకట సుబ్బారావు**, డోర్ నెం.37-1-58, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర-523001. **2) శ్రీ పేరకం వెంకట సుబ్బారావు (పార్ట్‌నర్ / హామీదారు)**, తండ్రి. **శ్రీ పి. చెంచయ్య**, డి.నెం.12-13-1157/202, వీధి నెం.11, నారాయణ కాన్సెప్ట్ స్కూల్, తార్నక, హైదరాబాద్, తెలంగాణ, ఆం.ప్ర-500007. **3) శ్రీ పాటి బండ్ల శ్రీరాములు (పార్ట్‌నర్ / హామీదారు)**, తండ్రి. **శ్రీ పాటి బండ్ల వీర స్వామి**, డి.నెం.12-13-1157/202, వీధి నెం.11, నారాయణ కాన్సెప్ట్ స్కూల్, తార్నక, హైదరాబాద్, తెలంగాణ, ఆం.ప్ర-500007. **4) శ్రీమతి పేరకం శ్రీ లక్ష్మీ (పార్ట్‌నర్ / హామీదారు)**, భర్త. **శ్రీ పేరకం వెంకట సుబ్బారావు**, డి.నెం.12-13-1157/202, వీధి నెం.11, నారాయణ కాన్సెప్ట్ స్కూల్, తార్నక, హైదరాబాద్, తెలంగాణ, ఆం.ప్ర-500007. **5) శ్రీ దుడిముక్కల శ్రీకృష్ణ ప్రసాద్ (పార్ట్‌నర్ / హామీదారు)**, తండ్రి. గోపాల కృష్ణయ్య, డి.నెం.48-1-35సి, మరాఠిపాలెం, వార్డు-14, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్-523001. **6) శ్రీ గొల్ల ప్రసాద్ బాబు (పార్ట్‌నర్ / హామీదారు)**, **తండ్రి. కుప్పుస్వామి**, డి.నెం.26-23-25, గాంధీనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520003 వారిని కోరుతూ **తేది.30.10.2023 న డిమాండ్ నోటీసు జారీచేసినారు.**

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు) విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తులను దిగువ సంతకందారు **హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., వారు తేది.08.07.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఛార్జీకి పైన తెలిపిన బకాయి మొత్తానికి దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తులను తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత, హామీదారులు(లు) మరియు తనఖాదారు(లు) సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తుల వివరములు

కృష్ణా జిల్లా-520004, విజయవాడ, రిలయన్స్ ఫ్రెష్ ప్రక్కన, సుందరమ్మ ఎస్‌టి, సీతన్నపేట, గాంధీనగర్, భరద్‌నాజా వీధి, పాత డోర్ నెం.26-24-1, కొత్త డోర్ నెం.26-24-2ఎ, రెవెన్యూ వార్డు నెం.8, అసెస్‌మెంట్ నెం.14861, ఎన్.టి.ఎస్.నెం.8/757 వద్ద గల నివాసయోగ్యమైన ఆస్తి. విస్తీర్ణం 136.25 చ॥గ॥లు లేదా 113.92 చ॥మీ॥లులోని గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తులతో గల భవనం శ్రీ గొల్ల ప్రసాద్ బాబు గారి పేరున కలదు. **(దస్తావేజు నెం.653/1993 తేది.05.02.1993, ఎస్.ఆర్.ఓ విజయవాడ), దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం :** అమ్మకందారుల ఆస్తి, **దక్షిణం :** అమ్మకందారులు సోమిశెట్టి గణేష్ గారికి అమ్మిన ఆస్తి, **తూర్పు :** అమ్మకందారుల ఆస్తి, **పడమర :** మున్సిపల్ రోడ్డు.

తేది : 08.07.2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

---

homefirst

We'll take you home

Home First Finance Company India Limited,
CIN:L65990MH2010PLC240703,
Website: homefirstindia.com
Phone No.: 180030008425
Email ID: loanfirst@homefirstindia.com

స్వాధీనతా ప్రకటన
రెఫరెన్స్: ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 లోని రూల్ 8 యొక్క సబ్-రూల్ (1) క్రింద స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (చట్టం నెం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇచ్చినట్లుగా దీని సంబంధిత తేదీలపై జారీచేసిన డిమాండ్ నోటీసు అనుసరించి, సదరు నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజుల్లో బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా మిమ్మల్ని/ రుణగ్రహీతలను కోరబడుచున్నది. మీరు/ రుణగ్రహీతలందరూ, నిర్దేశిత సమయంలోగా సదరు బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినందున, SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) నియమాల క్రింద దాని రూల్స్‌తో చదువబడే హక్కులను సంక్రమించిన అధికారాలను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** కలిగియుంది మరియు వినియోగిస్తుంది. దిగువ పేర్కొన్నట్లు సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనం చేసుకుంది.

క్ర. సం.	రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు/ హామీదారుల పేరు	తాకట్టుపెట్టిన యొక్క ఆస్తి వివరణ	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది	డిమాండ్ నోటీసు తేదినాటికి పూర్తి బాకీపడిన మొత్తం (రూ.లో)	స్వాధీనతా తేది
1.	అనుమాన శ్రీకాంత్, బాల్క స్వప్న	ఫ్లాట్ నెం.101, ఎఫ్‌గ్‌బ్లాక్, మొదటి అంతస్తు, సర్వే నెం.లు 44, 45, 46 మరియు 47 (పార్ట్), టీమా ప్రైడ్, పేట్‌బషీరాబాద్, జిహెచ్ఎంసి పరిధిలో, కుత్బుల్లాపూర్ సర్కిల్ మరియు మండలం, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ, హైదరాబాద్, తెలంగాణ-500067	05-05-2024	20,41,625	09-07-2024
2.	లేట్ సుధాకర్ పి (మరణించారు), పి.ధన రేఖ, లేట్ సుధాకర్ పి (మరణించిన) యొక్క ఇతర చట్టపరమైన ప్రతినిధులు	ఇంటి నెం.5-42/1, నార్త్ ఈస్ట్ పార్ట్ (అసెస్‌మెంట్ నెంబరు 972), తుర్కాయంజల్ గ్రామం యొక్క గ్రామకంఠం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-501510	05-05-2024	13,68,966	09-07-2024
3.	సయ్యద్ ఇఫ్తేకర్, రైసా బేగం,	ఇ.నెం.12-1-1119/2, శాంతినగర్, నార్త్ లాలాగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500017.	05-05-2024	12,45,148	09-07-2024
4.	గుమ్మళ్ల శ్రీనివాస్ రెడ్డి, జి అనురాధ,	ఇంటి నెం.7-184, కొంగర ఖుర్దు-ఎ రెవెన్యూ గ్రామం, నాల్గవ వార్డ్ రావిర్యాల్, తుక్కుగూడ మునిసిపాలిటీ కింద, మహేశ్వరం మండలం, జిల్లా రంగారెడ్డి, తెలంగాణ-501359.	05-05-2024	24,60,326	09-07-2024
5.	మహ్మద్ నవాజ్, షాహీన్ బేగం,	ఫ్లాట్ నెం.17&18, ఫ్లాట్ నెం.105, ఎస్ ఎస్ మంజిల్, ఇంటి నెం.3-110/8/3/డి/1పై నిర్మించబడినది, సర్వే నెం.92/ఇఇ మరియు 93/ఇఇ, యర్రకుంట, కొత్తపేట గ్రామం మరియు గ్రామపంచాయతీ, సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ-500005	05-05-2024	21,51,232	09-07-2024
6.	ఓర్సోల్లు మధు, ఓర్సు శారద, ఓర్సోల్లు రాములు, అచ్చమ్మ అచ్చమ్మ,	ఇంటి నెం.10-305, గ్రామకంఠం, ప్రశాంత్ నగర్, మీర్‌పేట్ గ్రామం, బాలాపూర్ మండలం, హైదరాబాద్, తెలంగాణ-500058	05-05-2024	19,83,155	09-07-2024
7	దండోటికర్ శ్రీకాంత్, డి గీత,	ఇంటి నెం.12-2-551 నుండి 12-2-553 (పిటిఐ నెం.1121202732) (పాత నెం.ఇ-7-551 నుండి ఇ-7-553), గుడిమల్కాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500028	05-05-2024	7,02,680	09-07-2024
8	పఠేరా బేగం, షేక్ ఖూసియా బేగం	ఫ్లాట్-బి-101, ఫ్లాట్ నెం.17& 18, ఎస్.ఎస్.మంజిల్, ఇంటి నెం.3-110/8/3/డి/1పై నిర్మించబడినది, సర్వే నెం.92/ఇఇ మరియు 93/ఇఇ, యర్రకుంట, కొత్తపేట గ్రామం మరియు గ్రామపంచాయతీ, సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ-500005	05-05-2024	21,18,667	09-07-2024
9	ఆకుల వీర స్వామి-ఆకుల భారతి,	ఇల్లు-నివాసిత ఇంటి నెం.2-51/పార్ట్, గ్రామకంఠం, చీర్యాల్ గ్రామం& జిపి, కీసర మండలం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ- 501301	05-05-2024	16,65,852	09-07-2024
10	కుంచాల శ్రీను, కుంచాల శ్రీలక్ష్మి,	ప్లాట్ నెం.1447 ఈస్ట్‌పార్ట్ (పశ్చిమ వైపు), సర్వే నెం.195, లక్ష్మీప్రియ నగర్ ఫేజ్-2, గండిచెరువు హెచ్/ఓ. కోహెడ రెవెన్యూ గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, (గతంలో హయత్‌నగర్ రెవెన్యూ మండలం), గండిచెరువు గ్రామ పంచాయతీ, రంగారెడ్డి, తెలంగాణ-501505	05-05-2024	14,60,749	09-07-2024

రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, రుణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, పై పేర్కొన్న తేదీన సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు స్వాధీనంలోకి తీసుకున్నారు.

రుణగ్రహీతలు/హామీదారులు మరియు **సాధారణ** ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, పై పేర్కొన్న ఆస్తులు/ సెక్యూర్డ్ ఆస్తులు లేదా అందులోని ఏదేని భాగంతో లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తులు/ సెక్యూర్డ్ అసెట్స్‌తో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది పూర్తిగా చెల్లించు వరకు దానిపై తదుపరి వడ్డీతో చెల్లింపుల ఆస్తులు/ సెక్యూర్డ్ అసెట్లపై ఎగువ పేర్కొన్న మొత్తాలను హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్ విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 13-07-2024

సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్

అదానీ పవర్ ప్లాంట్‌తో తీవ్ర నష్టం



అంచనాలకు మించి అడవి నాశనం

- వన్యప్రాణులకూ ప్రమాదమే
- యూపీలో పర్యావరణ నిపుణులు, కార్యకర్తల ఆందోళన

న్యూఢిల్లీ : యూపీలోని మీర్జాపూర్ అటవీ ప్రాంతం అనేక రకాలైన చెట్లు, ఔషధ మొక్కలు, వన్య ప్రాణులకు కేంద్రం. ఈ డివిజన్‌లోని దాద్రీ ఖుర్ద్ ప్రాంతంలో.. మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీ(యూపీ) అనే సంస్థ 1,600 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించటానికి పర్యావరణ అనుమతిని పొందే దిశగా మొదటి అడుగులు వేసింది. ఈ కంపెనీ అదానీ గ్రూపునకు కొత్త అనుబంధ సంస్థ. జూన్ 28న నిపుణుల అంచనాల కమిటీ ముందు సదరు కంపెనీ సమర్పించిన సమాచారం ప్రకారం.. అక్కడ దాని స్వంత భూమిలో 365.19 హెక్టార్లలో ప్లాంట్‌ను నిర్మించాలని కంపెనీ ప్రతిపాదన. ఈ కమిటీ పర్యావరణ మంత్రిత్వ శాఖ కింద పని చేస్తుంది. అడవులు, వాతావరణ మార్పు, ప్రతిపాదిత అభివృద్ధి ప్రాజెక్టులకు గ్రీన్ క్లియరెన్స్‌పై ప్రభుత్వానికి సలహా ఇస్తుంది.

ఇక్కడున్న 365.19 హెక్టార్లలో.. కంపెనీ దాదాపు 12 హెక్టార్ల అటవీ భూమికి 'అనుమతులు' కోరుతున్నది. ఇది ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలనుకుంటున్న భూమిలో కేవలం 12 హెక్టార్లు మాత్రమే అటవీ భూమి అని చెప్తున్నది. అయితే ఇది తప్పుదోవ పట్టించేలా ఉన్నదని పర్యావరణ నిపుణులు, కార్యకర్తలు అంటున్నారు. "దాద్రీ ఖుర్ద్‌లోని 665 హెక్టార్ల భూమి ప్రాజెక్ట్ సైట్ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ రికార్డులలో ప్రత్యేకంగా 1952 రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో అటవీ ప్రాంతంగా నమోదు చేయబడింది" అని వారు ఎత్తి చూపారు. సుప్రీం కోర్టు 1996 గోదావర్మన్ తీర్పు ప్రకారం యాజమాన్యంతో సంబంధం లేకుండా ప్రభుత్వ రికార్డులో అటవీ ప్రాంతంగా నమోదు చేయబడిన ఏదైనా ప్రాంతాన్ని అటవీ భూమిగా పరిగణించాలి.

రాష్ట్రవ్యాప్తంగా ఇంకా నోటిఫై చేయని అటవీ భూమి సర్వసాధారణం. యూపీలో అటవీ శాఖకు కేటాయించిన భూమిలో 27 శాతం ఇంకా అధికారికంగా అటవిగా ప్రకటించాల్సి ఉన్నదని సిన్హా తన లేఖలో పేర్కొన్నారు. ఒక్క మీర్జాపూర్ ఫారెస్ట్ డివిజన్‌లోనే రాష్ట్ర రికార్డుల్లో అటవీ భూమిగా వర్గీకరించబడిన 7,300 హెక్టార్లకు పైగా అటవీ భూమిగా ప్రకటించడానికి ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదు.

ఇదే దాద్రీ ఖుర్ద్ స్థలంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రతిపాదించటం ఇది రెండోసారి కావటం గమనార్హం. 2014లో పర్యావరణ మంత్రిత్వ శాఖ అదే స్థలంలో 1,320-మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించటానికి వెల్సున్ ఎనర్జీకి పర్యావరణ అనుమతిని మంజూరు చేసింది. అయితే, సిన్హా మరో ఇద్దరు పిటిషనర్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో కేసు వేశారు. దీనిలో వారు ప్రాజెక్ట్ కోసం పర్యావరణ ప్రభావ అంచనాలో ఈ ప్రాంతంలోని అడవులు, వన్యప్రాణుల గురించి తప్పుడు, అసంపూర్ణ సమాచారం ఉన్నదని వాదించారు. 2016లో ఎన్జీటీ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రాజెక్ట్ సైట్‌ను దాని "అసలు స్థితికి" పునరుద్ధరించాలని కంపెనీని ఆదేశించింది.

ప్రస్తుతం, అదానీ గ్రూప్‌తో పాటు రాష్ట్ర రెవెన్యూ, అటవీ శాఖలు సైట్ ఫారెస్ట్ ల్యాండ్ హోదా గురించి, ప్రాజెక్ట్ వల్ల కలిగే నష్టం గురించి స్పందించాల్సి ఉన్నది.

పర్యావరణ మంత్రిత్వ శాఖకు జూన్ 28న రాసిన లేఖలో మిర్జాపూర్‌లోని వింధ్యన్ ఎకాలజీ అండ్ నేషనల్ హిస్టరీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పర్యావరణవేత్త దేబాదిత్యో సిన్హా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 1952 నోటిఫికేషన్ ఆధారంగా ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ 1927లోని సెక్షన్ 20 కింద 665 హెక్టార్లను అడవిగా ప్రకటించాల్సి ఉన్నదని వివరించారు. 106 హెక్టార్లు నోటిఫై చేయగా, 558 హెక్టార్లు ఇంకా నోటిఫై చేయాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ప్రతిపాదిత పవర్ ప్లాంట్ స్థలం ఈ 665 హెక్టార్ల పరిధిలో ఉన్నదని ఒక మాజీ అటవీ అధికారి ధృవీకరించటం గమనార్హం.

సైట్ అడవి ఎలా అంటే..


అటవీ సంరక్షణ చట్టం, 1980లోని అడవుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు, దానికి సంబంధించిన విషయాలు అన్ని అడవులకు స్పష్టంగా వర్తింపజేయాలని గోదావర్మన్ తీర్పు పేర్కొన్నది. ఈ వాదన ప్రకారం.. దాద్రీ ఖుర్ద్ అటవీ భూమి అని అనటంలో ఎటువంటి సందేహమూ లేదని నిపుణులు చెప్పారు. "దాద్రీ ఖుర్ద్‌లో దట్టమైన అడవి ఉన్నది. ఇక్కడ అటవీ శాఖ పని చేస్తున్నది. తోటల పెంపకాన్ని చేస్తూ, వృక్ష-జంతుజాలాన్ని సంరక్షిస్తున్నది" అని ఒక మాజీ అటవీ శాఖాధికారి తెలిపారు. స్లాత్ ఎలుగుబంట్ల నివాసానికి మద్దతు ఇచ్చే భారతదేశంలోని కొన్ని ప్రదేశాలలో ఇది కూడా ఒకటన్నారు.అయితే, ఎన్జీటీ గత తీర్పు ఉన్నప్పటికీ.. అదానీ గ్రూప్ పర్యావరణ అనుమతులు, అటవీ క్లియరెన్స్‌ను పొందగలదని పర్యావరణ నిపుణులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. అదాని పవర్ ప్రాజెక్టుతో నష్టం 12 హెక్టార్లు మాత్రమేనని సదరు కంపెనీ పేర్కొంటున్నప్పటికీ.. ఇది 660కి పైగా హెక్టార్ల మొత్తంలో ఉన్న అటవి, జంతు సంపదకు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని వారు వాదిస్తున్నారు.

—| టీనేజ్ ప్రెగ్నెన్సీపై |—

డబ్ల్యూహెచ్‌వో ఆందోళన

ఏడాదికి 60 లక్షల మంది టీనేజీ బాలికలు ప్రసవం

- భారత్‌తో సహా ఆగ్నేయాసియా ప్రాంతంలో పరిస్థితులపై హెచ్చరిక



న్యూఢిల్లీ: భారత్‌తో సహా ఆగ్నేయాసియా ప్రాంతంలో టీనేజీలో బాలికలు గర్భందాల్చి, శిశువులకు జన్మనివ్వటం పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఇక్కడ ఏటా 15 నుంచి 19 ఏండ్ల మధ్య వయసున్న బాలికలు దాదాపు 60 లక్షల మంది టీనేజ్ బాలికలు జన్మనిస్తారని వివరించింది. కౌమారదశలో ఉన్న గర్భందాల్చటం బాల్య వివాహాలకు దగ్గరి సంబంధం కలిగి ఉన్నదని డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొన్నది.

డబ్ల్యూహెచ్‌ఓ ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్ సైమా వాజెద్ మాట్లాడుతూ.. "బాల్య వివాహాలు బాలికల ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించటమే. ఇది వారి ఎంపికలు, శారీరక, మానసిక ఆరోగ్య ఉన్నత ప్రమాణాలను ఆస్వాదించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది వారి చదువుకు ఆటంకం కలిగిస్తుంది. కౌమారదశలో ఉన్న తల్లులు పాఠశాలకు వెళ్లడం చాలా తక్కువగా ఉంటుంది. ఇది నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించుకోకుండా అడ్డుకుంటుంది. దీంతో వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించకుండా అడ్డుకుంటుంది" అని చెప్పారు. సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజినల్ కోఆపరేషన్(సార్క్), డబ్ల్యూహెచ్‌ఓ, యూనిసెఫ్, యూఎన్‌ఎఫ్‌పీఏ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పై విధంగా స్పందించారు. కౌమారదశలో గర్భం దాల్చటం భవిష్యత్తు తరాలను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. 20 నుంచి 30 ఏండ్లలోపు మహిళలతో పోలిస్తే.. యుక్తవయసులోని తల్లులు కూడా ప్రసూతి కారణాలతో చనిపోయే ప్రమాదం చాలా ఎక్కువ అని ఆమె అన్నారు. తల్లి వయస్సు తగ్గటంతో ఈ ప్రమాదాలు పెరుగుతాయనీ, 16 ఏండ్లలోపు యుక్తవయస్కులు 20 ఏండ్లు పైబడిన మహిళలతో పోలిస్తే ప్రసూతి మరణానికి నాలుగు రెట్లు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంతేకాకుండా, వృద్ధ మహిళలకు జన్మించిన పిల్లలతో పోలిస్తే యుక్తవయసువారికి జన్మించిన పిల్లలు కూడా మరణానికి సంబంధించి చాలా ఎక్కువ ప్రమాదాన్ని ఎదుర్కొంటారని ఆమె వివరించారు.

మహిళలకు అండ

- 16 శాతం మందికి ఆర్థిక మద్దతు
- రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యత

న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఆర్థిక మద్దతును అందించడానికి ప్రాధాన్యతను ఇస్తున్నాయని యాక్సిస్ బ్యాంక్ తన రీసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొంది. మహిళల కోసం చేపడుతున్న సంక్షేమ చర్యలు, ముఖ్యంగా ఆదాయ బదిలీ పథకాలతో దేశంలోని 16 శాతం మంది మహిళలకు ఆర్థిక మద్దతు లభిస్తుందని తెలిపింది. 10 రాష్ట్రాల్లోని బడ్జెట్‌లో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వగా ఇందులో.. మహారాష్ట్ర టాప్‌లో ఉందని పేర్కొంది. యాక్సిస్ రిపోర్ట్ ప్రకారం.. మహిళలకు ఆదాయ బదిలీలు ఇప్పుడు సంవత్సరానికి రూ.1.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది రాష్ట్రాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో 0.8 శాతంగా, దేశ జీడీపీలో 0.6 శాతంగా ఉంది.




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ నివేదిక ప్రకారం.. మహిళల కోసం పలు పథకాలతో రాష్ట్రాలు మద్దతును అందిస్తున్నాయి. అనేక పెద్ద రాష్ట్రాలు ఇప్పుడు తమ ఆదాయ రాబడిలో పెద్దమొత్తంలో సంక్షేమ పథకాలకు వ్యయం చేస్తున్నాయి. "పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రాష్ట్ర ఎన్నికలకు ముందు పలు సంక్షేమ పథకాలను ప్రారంభించగా, తెలంగాణ, కర్నాటక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు మద్దతును ఇచ్చేలా పలు పథకాలను రూపొందించాయి." అని యాక్సిస్ నివేదిక పేర్కొంది. ఇలాంటి పథకాలకు అధిక మొత్తంలో కేటాయించడం ద్వారా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు ఎలాంటి హాని జరగదని పేర్కొంది. ఆ మొత్తం తిరిగి మార్కెట్‌లోకి వస్తుందని విశ్లేషించింది.

'మోడీ'నామిక్స్

బీజేపీ పాలనలో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

- గరిష్టస్థాయికి నిరుద్యోగం
- భారత్‌లో తగ్గిన పెట్టుబడులు
- ఆర్థిక నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : పదేండ్ల మోడీ పాలన దేశ ఆర్థిక వ్యవస్థను తిరోగమనంలోకి తీసుకెళ్లిందని దేశంలోని కొందరు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మోడీనామిక్స్‌గా మారిందనీ, మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. కొన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని అంటున్నారు. అయితే, ఆర్థిక వ్యవస్థ నష్టానికి మాత్రం కరోనాను కారణంగా చూపుతూ పలు సందర్భాల్లో బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పుకుంటూ వస్తున్నదని తెలిపారు.

మోడీ పాలనలో భారత్‌లో నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకున్నదని ఆర్థిక నిపుణులు, మేధావులు, విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. "భారత్‌లో యువతకు నాణ్యమైన ఉద్యోగాలు లేవు. మోడీ హయాంలో పదేండ్లలో గతంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం కనిపించింది. చాలా ప్రభుత్వ గణాంకాలు దీనినే వెల్లడిస్తున్నాయి. గుజరాత్, యూపీ, హర్యానా, రాజస్థాన్‌లకు చెందిన యువత ఇజ్రాయెల్, రష్యాలో ఆ దేశాలు చేస్తున్న ఘోరమైన యుద్ధాల నడుమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యోగాలు చేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది" అని వారు తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో యూపీ, బీహార్‌లలో యువతనుద్దేశిస్తూ మోడీ చేసిన ప్రసంగం ఇప్పుడు గుర్తు తెచ్చుకోవాలన్నారు. "మీరు నాకు 10 సంవత్సరాలు సమయమివ్వండి. నేను మీ జీవితాలను మారుస్తాను" అని మోడీ అన్నారు. అయితే, భారత్ ఇప్పటికే పదేండ్ల మోడీ పాలనను చూసింది. అయినప్పటికీ, యువత జీవితాలు మారలేదని మేధావులు అంటున్నారు. "భారత్‌లో ఉద్యోగాలు లేవు. దీంతో ఉద్యోగాల కోసం యువత విదేశాలకు వెళుతున్నది. 1991లో సంస్కరణలు ప్రారంభమైనప్పటి నుంచి 45 ఏండ్లలో అత్యధిక నిరుద్యోగిత స్థాయికి, అత్యల్ప సగటు జీడీపీ పెరుగుదల, తలసరి ఆదాయ వృద్ధికి భారత్ పడిపోయింది" అని చెప్తున్నారు.


మోడీ అధికారంలో ఉన్న దశాబ్ద కాలంలో పెట్టుబడుల్లో అత్యల్ప వృద్ధి నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానమని మోడీ సర్కారు చెప్తున్నప్పటికీ.. దానిని పెట్టుబడిదారులెవరూ నమ్మకపోవటం కారణంగానే ఈ పరిస్థితి ఎదురైందని విశ్లేషకులు చెప్తున్నారు. " వినియోగ డిమాండ్ చాలా తక్కువగా ఉన్నప్పుడు కొత్త పెట్టుబడులు ఎలా వస్తాయి? ఇది నేటికీ చాలా ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే, భారత జీడీపీ వృద్ధిలో దాదాపు 60 శాతం ప్రయివేటు వినియోగం. కొంతకాలం క్రితం ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత దశాబ్దంలో సగటు ప్రయివేట్ వినియోగ వృద్ధి వార్షికంగా కేవలం 3 శాతం మాత్రమే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త ప్రయివేట్ పెట్టుబడులు ఎలా ఫలిస్తాయి?" అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

అంతేకాకుండా, 2017-18 నుంచి 2022-23 వరకు ఐదేండ్లలో భారతదేశంలో వేతన వృద్ధిలో స్తబ్ధత నెలకొన్నదని సాక్షాత్తూ ప్రభుత్వ గణాంకాలే సూచిస్తున్నాయని అంటున్నారు. ఇన్‌కార్పొరేటెడ్ ఎంటర్‌ప్రైజెస్ విడుదల చేసిన వార్షిక సర్వే ప్రకారం..2011-12తో పోలిస్తే 2022-23లో యువత నిరుద్యోగం (15 నుంచి 29 ఏండ్ల మధ్యవారు) రెండింతలు పెరిగి 12 శాతానికి చేరుకున్నది. ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం వంటి విషయంలో మోడీ సర్కారు ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని నిపుణులు అంటున్నారు.

కూరగాయల మంట


5.08 శాతానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : దేశంలో ధరలు ఎగిసిపడుతున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణానికి కూరగాయలు, పప్పుల ధరలు రెండంకెల స్థాయిలో పెరుగుతూ భారీగా ఆజ్యం పోస్తున్నాయి. ఆహారోత్పత్తుల ధరలు ఎగిసిపడటంతో ప్రస్తుత ఏడాది జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.9 శాతానికి చేరింది. ఇంతక్రితం నెలలో ఇది 5.4 శాతంగా చోటు చేసుకుంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్‌ఎస్‌ఓ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం..గత ఐదు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. రిటైల్ ద్రవ్యోల్బణంలో దాదాపు సగం వాటా కలిగిన ఆహార ద్రవ్యోల్బణం సూచీ ఏకంగా 8.69 శాతానికి ఎగిసింది. ఇది గతేడాది జూన్ నెలలో 4.55 శాతంగా ఉంది. గడిచిన జూన్ నెలలో కూరగాయల ధరలు ఏకంగా 27.33 శాతం పెరిగాయి. తృణధాన్యాలు 8.75 శాతం, పళ్లు 7.15 శాతం, పప్పులు 16.07 శాతం చొప్పున భారం అయ్యాయి. గతేడాదితో పోలిస్తే జూన్ నెలలో గ్రామీణ ద్రవ్యోల్బణం 4.78 శాతం నుంచి 5.67 శాతానికి పెరిగింది. పట్టణ ద్రవ్యోల్బణం గతేడాది జూన్‌లో 4.96 శాతంగా ఉంటే.. గత నెలలో 4.39 శాతంగా చోటు చేసుకుంది. ఇటీవల దేశంలో టమాటాలు, ఉల్లిగడ్డలు, బంగళాదుంపల ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వీటి ధరలు అమాంతం పెరగడంతో కుటుంబాలపై తీవ్ర భారం పడుతోంది. దేశంలో ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం ఎగువన ఉన్నందున వడ్డీ రేట్లు తగ్గింపుపై ఇప్పుడే మాట్లాడటం అర్థంలేని చర్య అవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం పేర్కొన్నారు.



'నీట్' లీక్‌కు బీహార్‌లో లింకులు

రెచ్చిపోతున్న పాట్నా, నలంద గ్యాంగులు



- క్లయింట్లను మాట్లాడటం నుంచి పరీక్షా కేంద్రాలకు చేర్చే వరకూ.. ప్రతీదీ అత్యంత రహస్యంగానే..
- అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు
- ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి విచారిస్తున్న సీబీఐ
- సంజీవ్ ముఖియా పాత్రను బయటకు తెచ్చిన దర్యాప్తు అధికారులు

న్యూఢిల్లీ : లీక్‌లకు సంబంధించిన లింకులు బీహార్‌లో కనిపిస్తున్నాయి. ఇప్పటికే బీహార్, జార్ఖండ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి పలు అరెస్టులు నమోదయ్యాయి. అనుమానితులను సీబీఐ విచారిస్తున్నది. ముఖ్యంగా, ఆ రాష్ట్ర రాజధాని పాట్నా నలందల నుంచి గ్యాంగ్‌లు పేపర్ లీక్‌లలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాయని పలు దర్యాప్తులు చెప్తున్నాయి. బీహార్ పోలీసు వర్గాలు, ఆర్థిక నేరాల విభాగం (ఈఓయూ) దర్యాప్తునకు సంబంధించిన సమాచారం ప్రకారం.. ఇప్పుడు రాష్ట్రంలో రాకెట్‌కు కింగ్‌పిన్, ప్రభుత్వ ఉద్యోగి సంజీవ్ ముఖియా నాయకత్వం వహించారనీ, ఆయన సొంత జిల్లా నలంద కేంద్రంగా ఉన్నదని సూచిస్తున్నాయి. పేపర్‌లను లీక్ చేయటం, వాటిని సర్క్యులేట్ చేయటం నుంచి అభ్యర్థులను చేరుకోవటం, డబ్బును రూట్ చేయటం, వేదికలు, వాహనాలు వంటి లాజిస్టిక్‌లను ఏర్పాటు చేయటం వంటి వివిధ విధులకు వివిధ సభ్యుల బాధ్యతతో ఇది బహుళస్థాయి ఆపరేషన్‌గా అనుమానించబడింది. ఈ కేసును తొలుత ఈఓయూకు, మిగతాది సీబీఐకి అప్పగించిన తర్వాత 18 మందితో సహా బీహార్‌లో అరెస్టుల సంఖ్య కనీసం 25కి పెరగటం గమనార్హం.

నీట్-యూజీ 2024 పేపర్ లీక్ వ్యవహారం తీవ్ర దుమారమే రేపింది. లీక్ జరిగిందన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు నమోదయ్యాయి. దీనిపై న్యాయస్థానం విచారణ జరుపుతున్నది. కేంద్రం, నీట్‌ను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ), ఈ కేసును దర్యాప్తు జరుపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐలు విచారణలో భాగంగా తమ వాదనలను వినిపిస్తున్నాయి. అయితే, గురువారం జరిగిన విచారణలో భాగంగా సర్వోన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

లీక్ ఇస్తామంటూ దందా..

సికిందర్ యాదవెందు.. నీట్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేస్తానని నలుగురు అభ్యర్థుల నుంచి డబ్బులు కూడగట్టాడని ఆరోపణ ఉన్నది. వారిలో ఒకరు ఆయన మేనల్లుడు అనురాగ్ యాదవ్(21). సమస్తిపూర్‌కు చెందిన అనురాగ్ 2022, 2023లో నీట్ పరీక్షకు హాజరై సఫలం కాలేకపోయాడు. యాదవెందు అభ్యర్థుల్లో మరొకరు రాంచీకి చెందిన అభిషేక్ కుమార్(21). ఆయన కూడా 2022, 2023లో నీట్‌కు హాజరై విజయం సాధించలేదు. అభిషేక్ తండ్రి అవధేష్ కుమార్. యాదవెందుకి రాంచీలో కాంట్రాక్టర్‌గా ఉన్న రోజుల నుంచి పాత పరిచయం. రాంచీలో నివసిస్తున్న సమయంలోనే అభిషేక్ తన పరీక్షకు పాట్నాను కేంద్రంగా ఎంచుకున్నాడు. అయితే, దీనిని పేపర్ లీక్‌కు సంబంధించిన ప్రణాళికకు సూచనగా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అభిషేక్ నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేలా ఏర్పాటు చేస్తానని 2023లో యాదవెందు తనకు ఆఫర్ ఇచ్చాడని అవధేష్ దర్యాప్తు అధికారులకు చెప్పాడు. ఇందుకోసం యాదవెందు ఇతరుల నుంచి దాదాపు రూ. 40 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు ఉండగా, అభిషేక్ కేసులో ఆయన కేవలం రూ. 30 లక్షలతో సరిపెట్టుకున్నాడు. నీట్ వ్యవహారం 2023లో కాకపోతే ఈ ఏడాది పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన యాదవెందుకు.. అవధేష్ రెండు ఖాళీ ఎస్‌బీఐ చెక్కులను ఇచ్చాడు. ఈ ఏడాది మే 3న అభిషేక్‌తో కలిసి అవధేష్ పాట్నాకు వచ్చి యాదవెందులకు అప్పగించాడు.

యాదవెందు మూడో క్లయింట్ ఆయుష్ కుమార్(19). ఈయన దానాపూర్ నివాసి. ఆయుష్ కూడా 2023లో నీట్ పరీక్షలో విఫలమయ్యాడు. గోకుల్ బ్రిక్స్ అనే ఇటుక బట్టీని నడుపుతున్న ఆయుష్ తండ్రి అఖిలేష్ కుమార్.. తాను మ్యాప్ అప్రూవల్ కోసం దానాపూర్ మున్సిపల్ కౌన్సిల్‌కు వెళ్లాననీ, అక్కడ యాదవెందును కలిశానని ఈఓయూకు చెప్పాడు. అయితే, 40 లక్షలకు డీల్ జరిగిందనీ, అఖిలేశ్.. యాదవెందులకు ఐడీబీఐ బ్యాంక్ బ్లాంక్ చెక్ ఇచ్చారని దర్యాప్తు అధికారులు వివరించారు. నాలుగో క్లయింట్ బీహార్‌లోని గయాకు చెందిన శివానందన్ కుమార్(18). ఆయన తండ్రి రామస్వరూప్ యాదవ్.. యాదవెందుకు సుపరిచితుడు.

ఈ పేపర్ లీక్ చైన్‌లో మరొక కీలక వ్యక్తి పేరు.. అమిత్ ఆనంద్(29). బీటెక్ చదివిన ఈయన.. పేపర్ లీక్ అయిన సమయంలో ఆనంద్ "జాబ్ కన్సల్టెన్సీ" నడుపుతున్నాడు.



ఆయనకు 2022లో యాదవెందు కార్యాలయాన్ని సందర్శించినప్పుడు వారిద్దరికి పరిచయం ఏర్పడింది. ఆనంద్‌కు సంజీవ్ ముఖియా గ్యాంగ్ (తర్వాత మరింత)తో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కానీ నేర చరిత్ర లేదు.

మే 4 సాయంత్రం, యాదవెందు తన నలుగురు క్లయింట్లను ఆనంద్‌కు అప్పగించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇది తర్వాత దర్యాప్తులో కీలకంగా మారింది. ఈ రాకెట్ సహాయంతో పాట్నాలో నీట్‌ను క్లియర్ చేసిన మొత్తం అభ్యర్థుల సంఖ్య 15. మొత్తం దాదాపు 100 మంది అనుమానాస్పదంగా ఉన్నారు. ఈ 15 మందిలో నలుగురిని యాదవెందు, ఆరుగురిని నితీష్, నలుగురిని ఆనంద్, ఒకరిని రోషన్, అశుతోష్ తీసుకొచ్చాడు.

లీక్ గ్యాంగ్..

పేపర్ లీక్ గ్యాంగ్.. తమ నీట్ అభ్యర్థులందరినీ మే 4 రాత్రి ఖేమ్నిచక్ ప్రాంతంలోని రామకృష్ణ నగర్‌లో గల పాట్నాలోని లెర్న్ బాయ్స్ స్కూల్‌కు తీసుకెళ్లినట్టు ఆరోపణలు వచ్చాయి. నగరంలోని ఖేమ్నిచక్ ప్రాంతంలోని ఈ పాఠశాలను కనిపెట్టటం చాలా కష్టం. పేపర్-లీక్ దర్యాప్తుతో సంబంధం ఉన్న ఒక అధికారి ఈ పాఠశాలలో అభ్యర్థులను ఉంచటం.. ముఠా కార్యకలాపాల గురించి ఎవరికీ క్లూ లభించకుండా చూసుకోవటమేనని దర్యాప్తు అధికారులు వివరించారు. పోలీసులు వచ్చిన తర్వాతే భవనంలో జరుగుతున్న విషయాలు తమకు తెలిసిపోయాయని స్థానికులు కొందరు తెలపటం గమనార్హం. ఈ ముఠా అశుతోష్ ద్వారా పాఠశాలను భారీ మొత్తానికి బుక్ చేసిందని ఆరోపించారు.

మే 4న రాత్రి అభ్యర్థులను వేర్వేరు వాహనాల్లో పాఠశాలకు తీసుకెళ్లారనీ, ఆ సమయంలో చింటూ కుమార్ అలియాస్ బల్దేవ్ కుమార్, పింటూ కుమార్, నితీష్ కుమార్ ఉన్నారని సమాచారం. నీట్ పేపర్‌కు సంబంధించిన సమాధానాలు మే 5న ఉదయం 9 గంటలకు చింటూ ఫోన్‌కు రావటంతో అభ్యర్థులకు కంఠస్థం చేసుకోవటానికి ఇచ్చారు. యాదవెందు తదితరుల నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు మే 5న లెర్న్ బాయ్స్ స్కూల్‌కు చేరుకోగా.. అక్కడ సగం కాలిపోయిన పేపర్లు కనిపించాయి. అందులో పేపర్ బుక్‌లెట్ నంబర్ 6136488 ఉన్నది. ఈ బుక్‌లెట్ నంబర్ ద్వారానే పేపర్ లీకైన హజారీబాగ్ కనెక్షన్ గురించి ఈఓయూకి తెలిసింది. బుక్‌లెట్ నంబర్ 6136488 హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్‌లో ఒక బాలికకు కేటాయించబడటం గమనార్హం. కాగా, ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రభాత్ ఖబర్ వార్తాపత్రిక స్థానిక కార్యాలయంలో ప్రకటనల పనిని చూస్తున్న జమాలుద్దీన్‌ను కూడా అరెస్టు చేసింది. బీహార్‌లో పేపర్ లీకైనప్పుడల్లా పేపర్ లీకేజీలకు నలందలో మూలాలుంటాయనీ, దీనితో దర్యాప్తు బృందం చురుగ్గా వ్యవహరిస్తుందని ఈఓయూ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 'రంజిత్ డాన్ కోటా' ఎలా ఉన్నదో అలాగే బీహార్‌లో ఇప్పుడు 'సంజీవ్ ముఖియా కోటా' ఉన్నదని సదరు అధికారి చెప్పటం గమనార్హం. గతంలో పేపర్ లీక్‌లలో రంజిత్ డాన్ పేరు ముఖ్యంగా వినబడేది.

ఈ దర్యాప్తులో బీహార్ పోలీసులు, ఈఓయూ తీవ్రంగా శ్రమించి కీలక విషయాలు రాబట్టాయనీ, అయితే తదుపరి దర్యాప్తు జరుపుతున్న సీబీఐ ఇందులో మరిన్ని విషయాలను వెలికి తీసి, నష్టపోయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని సామాజిక, విద్యావేత్తలు సూచిస్తున్నారు.



పాట్నా పోలీసులు ఐబీకి ఏం చెప్పారంటే..

నీట్-యూజీ పరీక్ష జరిగే రోజు ఇంటెలిజెన్స్ సమాచారంతో జార్ఖండ్‌లో ఒక కార్ ఛేజింగ్ జరిగింది. మే 5న నీట్ పరీక్ష మధ్యలో పేపర్‌ను లీక్ చేసిన ముఠా గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) పాట్నా పోలీసులకు చెప్పినట్టు సమాచారం. జార్ఖండ్ నంబర్ ప్లేట్‌తో కూడిన తెల్లటి రెనాల్ట్ డస్టర్‌ను ఇందు కోసం ఉపయోగిస్తున్నట్టు వివరించింది. దీంతో పాట్నా పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. బైలీ రోడ్డులోని రాజవంశీ నగర్ మలుపు వైపు గస్తీ తిరుగుతున్న శాస్త్రి నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అమర్ కుమార్ సదరు వాహనం రావటం చూశాడు. దాఖలైన ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఆ కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. వారు పోలీసులను చూడగానే పారిపోయారు. ఈ ముగ్గురే సికందర్ యాదవెందు, అఖిలేష్ కుమార్, బిట్టు కుమార్(డ్రైవర్). అనంతరం, ఇతర పోలీసుల సహాయంతో వీరిని పట్టుకున్నారు. కారులో నలుగురు నీట్ అభ్యర్థుల అడ్మిట్ కార్డుల ఫొటో కాపీలు లభించినట్టు తెలుస్తున్నది. పోలీసులు ఈ నలుగురిని విచారించడం ప్రారంభించారు. వారి కుటుంబ సభ్యుల్లో కొందరిని కూడా అరెస్టు చేశారు. ఆ కాసేపట్లోనే పేపర్ లీక్ ముఠా రహస్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావటం మొదలయ్యాయి.


సంపాదకీయం

అయినా...తీరు మారుతుందా?

ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సేకరించటం, ప్రచురించటం, ప్రసారం చేయడం మీడియా బాధ్యత. ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛకు, గోప్యతకు భంగం వాటిల్లకుండా ఎక్కడ, ఏం జరుగుతుందో తెలుసుకోవడం ప్రజల హక్కు. పౌరులకు ఉన్న సమాచార హక్కును, దాన్ని నెరవేర్చేందుకు దోహదపడే మీడియా స్వేచ్ఛను తగిన విధంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ, పాలక యంత్రాంగాలది. కానీ, అందుకు భిన్నంగా వ్యవహరించే ప్రభుత్వాల నుంచి, నిజాలను మాట్లాడితే సహించలేని పాలకుల నుంచి సహకారాన్ని కాక, పచ్చి నిరంకుశ ధోరణులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మోడీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో పత్రికా స్వేచ్ఛ మంటగలిసిందని అంతర్జాతీయ ప్రెస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ) బుధవారం చేసిన వ్యాఖ్యలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

బీజేపీని విమర్శించే మీడియా సంస్థలు, జర్నలిస్టులను న్యాయ చిక్కుల్లో పడవేస్తున్నారు. జర్నలిస్టులను బెదిరించే పరంపర ఇలాగే కొనసాగితే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుంది. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించే విధంగా మీడియాను మోడీ ప్రభుత్వం లొంగదీసుకుంటోంది. సామాజిక, ఆర్థిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగం, పిల్లల్లో పౌష్టికాహార లోపం, రైతాంగం వెతలు, ఆరోగ్యభద్రత, నాణ్యమైన విద్య తదితర సమస్యలు అత్యధిక మీడియాలో కనిపించడం లేదు. ప్యాషన్, పెరేడ్లు, క్రికెట్, సినిమాల వార్తలకే విశేష ప్రాధాన్యతనిస్తూ తమ ఉనికిని కాపాడుకుంటున్న పరిస్థితి నెలకొంది.

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కలానికి సంకెళ్లు వేస్తూ భావస్వేచ్ఛను నిర్వీర్యం చేస్తోంది. అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మీడియా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపుతున్నది. జర్నలిస్టులపై దాడుల విషయంలో 12వ వరస్ట్ కంట్రీగా భారత్ నిలిచిందని ఇంప్యూనిటీ సూచీ-2023 గుర్తుచేసింది. పాత్రికేయులకు రక్షణ కల్పించడంలో గత రెండు పాలనా కాలాల్లోనూ విఫలమైన మోడీ ప్రభుత్వం.. కనీసం ఈసారైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రాధాన్యతివ్వాలని ఐపీఐ కోరింది. జర్నలిస్టులపై దాడులు, హత్యల కేసుల్లో విచారణను సమగ్రంగా, విశ్వసనీయంగా, పారదర్శకంగా జరిపించాలని విజ్ఞప్తి చేసింది.




ఒక సమాచారం ఇవ్వడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందా? లేక ఆ సమాచారాన్ని వెల్లడించే హక్కును నిషేధించటం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానాన్ని వివేకంతో, విచక్షణతో బేరీజు వేసిన తరువాతనే మీడియాపై చర్యలకు పూనుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం గతంలోనే వ్యాఖ్యానించింది. మీడియాపై కత్తి కట్టి, పత్రికాస్వేచ్ఛను కర్కశంగా అణచివేస్తున్న పాలకులు ఆ వ్యాఖ్యలనెప్పుడూ పట్టించుకున్న పాపాన పోలేదు. తమకు వ్యతిరేకంగా ఒక్క గొంతూ వినిపించకూడదనుకోవడం, బలవంతాన నొక్కేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని 'ఐపీఐ' ఆందోళన వ్యక్తం చేసింది.

హత్రాస్ ఘోరాన్ని కవర్ చేయటానికి వెళ్లబోతుంటే జర్నలిస్టు కప్పన్‌పై ఉపా కేసు బనాయించి రెండేళ్ల పాటు జైల్లో ఉంచిందీ ప్రభుత్వం. అన్నదాతల ఆందోళనకు మద్దతుగా మాట్లాడిందని సామాజిక కార్యకర్త దిశా రవిని తీవ్రంగా వేధించింది. రైతు ఉద్యమ వార్తలను రాసినందుకు న్యూస్‌క్లిక్ సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్త తదితరులపై దేశద్రోహ కేసులు బనాయించి, జైల్లో పెట్టింది. ప్రజల పక్షాన రాసిన, మాట్లాడిన అనేకమంది జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను వెంటాడి వేధించటం, దాడులు చేయించటం, తీవ్రమైన కేసులు మోపటం వంటి కక్షపూరిత చర్యలతో భయోత్పాతం సృష్టించటం ఒక విధానంగా కొనసాగిస్తోంది. మోడీ పాలనలో మీడియా స్వేచ్ఛ గణనీయంగా క్షీణించిందంటానికి ఇంతకంటే ఉదాహరణలు ఇంకేం కావాలి. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ చర్యలను ఏడాది క్రితమే సిఫార్సు చేసినప్పటికీ ఆ దిశగా పురోగతి శూన్యం అని ఐపీఐ విచారాన్ని వెలిబుచ్చింది.

బీజేపీని విమర్శించే మీడియా సంస్థలు, జర్నలిస్టులను న్యాయ చిక్కుల్లో పడవేస్తున్నారు. జర్నలిస్టులను బెదిరించే పరంపర ఇలాగే కొనసాగితే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుంది. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలించే విధంగా మీడియాను మోడీ ప్రభుత్వం లొంగదీసుకుంటోంది. సామాజిక, ఆర్థిక సమస్యలు, పేదరికం, నిరుద్యోగం, పిల్లల్లో పౌష్టికాహార లోపం, రైతాంగం వెతలు, ఆరోగ్యభద్రత, నాణ్యమైన విద్య తదితర సమస్యలు అత్యధిక మీడియాలో కనిపించడం లేదు. ప్యాషన్, పెరేడ్లు, క్రికెట్, సినిమాల వార్తలకే విశేష ప్రాధాన్యతనిస్తూ తమ ఉనికిని కాపాడుకుంటున్న పరిస్థితి నెలకొంది.

దేశంలో మీడియా స్వేచ్ఛ ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాలి. అది యాజమాన్యాలకు స్వేచ్ఛగా కాకుండా.. అంతిమంగా సమాజానికి మేలు చేయాలని ఐపీఐ అభిప్రాయపడింది. భావప్రకటన, పత్రికాస్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కులు. వాటిని తొక్కిపెట్టాలనుకోవడం నియంతృత్వానికి దారితీస్తుంది. హిట్లర్ వంటి నియంతలు ఇలాంటి చర్యలకే పాల్పడి, చరిత్ర హీనులుగా మిగిలిపోయారు. కేంద్ర పాలకులు కూడా ఆ దిశగానే పరుగులు పెడుతున్నారు. పత్రికా స్వేచ్ఛ ద్వారానే ప్రజాస్వామ్యం సమర్థంగా పనిచేయగలదని మోడీ ప్రభుత్వం తెలుసుకోవాలి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఇది కేవలం పత్రికలకు, పాత్రికేయులకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల భావాలకు అద్దం పట్టే పత్రికల స్వేచ్ఛ ప్రజలందరిదీ. దీనిని కాపాడుకోవటం మనందరి బాధ్యత.

ఆరెస్సెస్ హిందుత్వ విద్వేషపూరితం



రామ్ పునియానీ



పాలక పార్టీ ప్రాధాన్యత మసకబారడం, ప్రతిపక్షం బలం పుంజుకోవడం లాంటి కారణాల రీత్యా నూతన పార్లమెంట్‌లో ప్రతిపక్షం తన స్వరాన్ని పెంచింది. ప్రారంభసభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన తరువాత జరిగిన చర్చలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని తన ప్రసంగంలో లేవనెత్తడం ద్వారా స్పందించాడు. తన ప్రసంగంలోని (బహుశా తొలగించబడిన) భాగం హిందూ మతం స్వభావానికి సంబంధించినది. ఆయన చెప్పే దాని ప్రకారం, హిందూ మతం సత్యం, అహింసపై ఆధారపడి ఉంటుంది."భారతదేశం అహింసా మార్గాన్ని అనుసరించే దేశం, భయానికి సంబంధించిన దేశం కాదు. మన మహాపురుషులు అహింస గురించి, భయాన్ని అధిగమించే విషయం గురించి మాట్లాడినారు.""హిందువులమని చెప్పుకునే వారు రోజంతా హింస, ద్వేషం, అసత్యాల గురించే మాట్లాడుతున్నారని," రాహుల్ గాంధీ భారతీయ జనతాపార్టీకి చెందిన ఎంపీల వైపు చూపిస్తూ మాట్లాడినాడు.

చాలామంది సాధువులు రాహుల్ గాంధీ ప్రకటనలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. రాహుల్‌గాంధీ, హిందువులందర్నీ హింసావాదులని అన్నాడని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనుబంధ సంస్థలు పట్టణాలకు వెళుతున్నాయి. మరోవైపు హిందూ మతం అంటే సత్యం, అహింస, ప్రేమలపై ఆధారపడుతుందని రాహుల్ గాంధీ వివరణ ఇచ్చాడు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తలు, రాహుల్ గాంధీ, అతని కుటుంబ సభ్యులు అంటే మనదేశానికి ప్రధానమంత్రులుగా సేవలందించిన జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలపై విమర్శలు చేస్తూ, వీరి భావజాలం సత్యానికి దూరంగా ఉంటుందని అంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ చెప్పేదాని ప్రకారం కాంగ్రెస్ పార్టీ మొదటితరం కేవలం మైనార్టీలు, వారి ఓటు బ్యాంకును కాపాడే విషయం గురించే ఆందోళన చెందుతూ వచ్చింది.

రాజకీయపరంగా 'హిందుత్వ' అనే పదాన్ని 1923లో సావర్కర్ తన "ఎసెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ" రచనలో సృష్టించి, నిర్వచించాడు. ఈయన హిందుత్వ ఆర్యన్ జాతి, ఈ పవిత్ర భూమి (సింధూ నుండి సముద్రాల వరకు), బ్రాహ్మణ సంస్కృతిపై ఆధారపడి ఉంది. సావర్కర్ బౌద్ధమతం బోధించే అహింసను చాలా తీవ్రంగా విమర్శిస్తూ, భారతదేశ బలహీనతకు బౌద్ధమతం ప్రచారం చేసిన అహింసే ప్రధాన కారణం అని అన్నాడు. ఇది పూర్తిగా మన చరిత్ర అవగాహనకు వక్రీకరణ. ఆధునిక భావంలో దేశం అనేది లేదు. ఒకవేళ మనం దేశంతో సమానమైన సామ్రాజ్యాలను ఆమోదించాలంటే, అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ప్రాచీన భారతదేశంలో ఆయన సామ్రాజ్యమే అతి పెద్దదనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

హిందూ మతం మానవీయ కోణాన్ని వివరించిన రాహుల్ గాంధీకి ఇండియా కూటమి నుండి చాలామంది మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం హిందూ మతం, హిందుత్వ పదాల ప్రయోగం మధ్య కొంత సందిగ్ధత ఉంది. హిందుత్వ గురించి తన అభిప్రాయాలు కూడా రాహుల్ గాంధీ హిందూమతం గురించి వివరించిన విధంగానే ఉన్నాయని ఉద్ధవ్ థాక్రే అన్నాడు. నెహ్రూ తన సాంప్రదాయికత విరోధి అభియాన్ (మతతత్వానికి వ్యతిరేక ప్రచారం) పనిని ఆరెస్సెస్‌కు వ్యతిరేకంగానే ప్రారంభించాడని ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు విమర్శిస్తున్నారు.

సోమనాథ్ దేవాలయాన్ని నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ప్రారంభించడాన్ని నెహ్రూ వ్యతిరేకించినందుకు కూడా వారు ఆయనను వ్యతిరేకిస్తున్నారు. దయానంద సరస్వతి, స్వామీ వివేకానంద, బంకించంద్ర ఛటర్జీ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీల నుండి ఆరెస్సెస్ హిందుత్వ ఏర్పడిందని వారు వాదిస్తారు. ఆరెస్సెస్ భావజాలానికి, దయానంద సరస్వతి, స్వామీ వివేకానంద భావజాలానికి ఎలాంటి సంబంధమే లేదు. కేవలం వారి భావజాలాన్ని కప్పిపుచ్చేందుకు మాత్రమే వారి పేర్లను ఉపయోగిస్తున్నారు.

హిందూ మతం అనేది ఒక ప్రవక్త ఆధారిత మతం కాదు కాబట్టి హిందూ మతం గురించి అనేక వివరణలను పయోగించారు. హిందూమతానికి చెందిన పవిత్రమైన గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత లేక మనుస్మృతిలలో హిందూ అనే పదమే లేదు. ఈ పదాన్ని సింధూ పశ్చిమ ప్రాంతం నుండి వచ్చిన వారు సృష్టించారు.వారు "స" అనే శబ్దాన్ని "హ" గా పలకడం వలన "సింధూ", "హిందూ"గా మారింది. మొదట్లో ఈ పదం సింధూ నది నుండి సముద్రం వరకు వ్యాపించిన ప్రాంతాన్ని సూచించింది. ఇక్కడ వైదిక మతం (దీనిని బ్రాహ్మణమతం అని కూడా పిలవచ్చు), తంత్ర, అజివికాస్, నాథ్, శైవ, బౌద్ధ, జైన పూర్వ మత ధోరణులు కూడా ప్రధానంగా ఉన్నాయి.

హిందూమతం - హిందుత్వ

హిందూ మతం అనేది ఒక ప్రవక్త ఆధారిత మతం కాదు కాబట్టి హిందూ మతం గురించి అనేక వివరణలను పయోగించారు. హిందూమతానికి చెందిన పవిత్రమైన గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత లేక మనుస్మృతిలలో హిందూ అనే పదమే లేదు. ఈ పదాన్ని సింధూ పశ్చిమ ప్రాంతం నుండి వచ్చిన వారు సృష్టించారు.వారు "స" అనే శబ్దాన్ని "హ" గా పలకడం వలన "సింధూ", "హిందూ" గా మారింది. మొదట్లో ఈ పదం సింధూ నది నుండి సముద్రం వరకు వ్యాపించిన ప్రాంతాన్ని సూచించింది. ఇక్కడ వైదిక మతం (దీనిని బ్రాహ్మణమతం అని కూడా పిలవచ్చు), తంత్ర, అజివికాస్, నాథ్, శైవ, బౌద్ధ, జైన పూర్వ మత ధోరణులు కూడా ప్రధానంగా ఉన్నాయి.

తరువాత కాలంలో "హిందూ" అనే పదం ఇక్కడ ఉన్న విభిన్న ధోరణుల (జైన, బౌద్ధ మతాలను మినహాయిస్తే) సమ్మేళనంగా మారింది. బ్రాహ్మణమతాన్ని మినహాయించి, మిగిలిన ధోరణులను శ్రమణులు అని అన్నారు. బ్రాహ్మణ మతంలో కుల, లింగ శ్రేణీగత వ్యవస్థ ఉండడమే బ్రాహ్మణ మతానికి, శ్రమణులకు మధ్య ఉండే ప్రధానమైన వ్యత్యాసం. "హిందూమతం" అనే పద నిర్మాణం గురించి ప్రముఖ చరిత్రకారుడు డీ.ఎన్.ఝా, 2006లో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో తన అధ్యక్షోపన్యాసంలో చక్కగా వివరించాడు. "హిందూ అనే పదం వలస రాజ్యానికి ముందు భారతదేశంలో వాడుకలో ఉంది, కానీ ఇది 18 వ శతాబ్దం చివరలో, 19వ శతాబ్దం ప్రారంభంలో లేదు. దీనిని బ్రిటిష్ స్కాలర్లు తమ స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని" ఆయన పేర్కొన్నాడు. అప్పటి నుండి ఇది చాలా విస్తృత వినియోగంలో ఉంది. ఈ పదాన్ని ఉపఖండంలో సిక్కులు, జైనులు, బౌద్ధులు, ముస్లింలు, క్రైస్తవులు తప్ప అందరికీ ఉపయోగిస్తున్నారు.

కఠినమైన సరిహద్దులేమీ లేకపోవడం వల్ల బ్రాహ్మణ ప్రవంతి వేదాలను, మనుస్మృతిని పవిత్రమైన గ్రంథాలుగా ముందుకు తెచ్చింది. హిందూమతం యొక్క ప్రధానమైన అవగాహనలు కూడా మారాయి. అంబేద్కర్ దృష్టిలో హిందూమతంపై కుల వ్యవస్థ అయిన బ్రాహ్మణ మతం ఆధిపత్యం చెలాయించింది. అదే, ఆయన మనుస్మృతిని తగులబెట్టడానికి దారితీసింది. మరోవైపు మహాత్మా గాంధీ తనను తాను సనాతన హిందువుగా చెప్పుకున్నాడు. ఆయన అక్టోబర్ 6, 1921 లో 'యంగ్ ఇండియా'లో ఇలా పేర్కొన్నాడు, "ఎవరి స్వంత విశ్వాసం లేదా ధర్మం ప్రకారం వారు దేవుని ఆరాధించాలని హిందూ మతం ప్రతీ ఒక్కరికీ చెపుతుంది. అది అన్ని మతాలతో శాంతియుతంగా జీవిస్తుంది." మతాంతర సంబంధాలు, బహుళత్వానికి ఒక ప్రత్యేకమైన భావన! ఇప్పుడు రాహుల్ గాంధీ హిందూ మతం గురించి మాట్లాడుతూ హిందూ మతానికి సత్యం, అహింస, ప్రేమ ప్రధానమైన లక్షణాలని అదేపనిగా చెపుతున్నాడు.

'హిందుత్వ' అనే పదాన్ని 1892లో చంద్రనాథ్ బసు సృష్టించి, దానిని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించే ఆదర్శానికి అనుసంధానం చేశాడు. రాజకీయపరంగా 'హిందుత్వ' అనే పదాన్ని 1923లో సావర్కర్ తన "ఎసెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ" రచనలో సృష్టించి, నిర్వచించాడు. ఈయన హిందుత్వ ఆర్యన్ జాతి, ఈ పవిత్ర భూమి (సింధూ నుండి సముద్రాల వరకు), బ్రాహ్మణ సంస్కృతిపై ఆధారపడి ఉంది. సావర్కర్ బౌద్ధమతం బోధించే అహింసను చాలా తీవ్రంగా విమర్శిస్తూ, భారతదేశ బలహీనతకు బౌద్ధమతం ప్రచారం చేసిన అహింసే ప్రధాన కారణం అని అన్నాడు. ఇది పూర్తిగా మన చరిత్ర అవగాహనకు వక్రీకరణ. ఆధునిక భావంలో దేశం అనేది లేదు. ఒకవేళ మనం దేశంతో సమానమైన సామ్రాజ్యాలను ఆమోదించాలంటే, అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ప్రాచీన భారతదేశంలో ఆయన సామ్రాజ్యమే అతి పెద్దదనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరైతే ఈ భూమిని తన పితృభూమిగా, పవిత్ర భూమిగా పరిగణించాడో అతడే హిందువు అని సావర్కర్ నిర్వచించాడు.

ఆరెస్సెస్ సావర్కర్‌ను అనుసరించి, ఇస్లాం, క్రైస్తవ మతాలను విదేశీ మతాలుగా పరిగణిస్తూ, ప్రాచీన పవిత్ర మత గ్రంథాలను (ఉదా:- మనుస్మృతి) సమర్థిస్తుంది. ఆరెస్సెస్ తన మతంలో భాగంగా హింసను సృష్టించింది. తన ప్రధాన కార్యాలయం వివిధ ఆయుధాలను ప్రదర్శించి, దసరా పండుగ రోజున వాటికి పూజలు నిర్వహిస్తుంది. ఆరెస్సెస్ శాఖలు ఖిల్జీ, బాబర్, ఔరంగజేబు లాంటి ముస్లిం రాజులను క్రూర పాలకులుగా చిత్రించడం ద్వారా, రాణా ప్రతాప్, శివాజీ, పృథ్వీరాజ్ చౌహాన్ లాంటి హిందూ రాజులను కీర్తించడం ద్వారా ద్వేషాన్ని వ్యాప్తి చేశాయి. అన్ని మతాలకు చెందిన ప్రజలంతా జాతీయోద్యమంలో పాల్గొన్న కారణంగా ఆ ఉద్యమాన్ని కూడా ఆరెస్సెస్ విమర్శించింది. ఇది దేవాలయాల విధ్వంసం, గొడ్డుమాంసం, బలవంతపు మత మార్పిడులు లాంటి భావోద్వేగ సమస్యల్ని చేపట్టింది కాబట్టి తనను తాను హిందువుల ప్రతినిధిగా చెప్పుకుంటుంది. 1948లో ఆరెస్సెస్‌పై నిషేధం విధించిన తరువాత సర్దార్ వల్లభాయ్ పటేల్, అది వ్యాప్తి చేసిన విద్వేషాన్ని ఎత్తి చూపుతూ ఇలా అన్నాడు: "వారి ప్రసంగాలు మొత్తం మతోన్మాద విషంతో నిండి ఉన్నాయి. ఆ విషం యొక్క చివరి ఫలితంగా, దేశం వెలకట్టలేని గాంధీజీ జీవితాన్ని త్యాగం చేయాల్సి వచ్చింది."

మహాత్మాగాంధీ నుండి రాహుల్ గాంధీ లాంటి నాయకులు హిందూ మతం యొక్క మానవీయ కోణాన్ని విస్తరించి, పెంచారు. సావర్కర్-ఆరెస్సెస్‌లు ద్వేషపూరిత మార్గాన్ని అనుసరించిన ఫలితంగా హింసా మార్గంలో ప్రయాణం చేస్తున్నాయి. అంబేద్కర్, హిందూ ఆచరణలో బ్రాహ్మణాధిపత్యానికి వ్యతిరేకంగా నిలబడగా, మహాత్మాగాంధీ, రాహుల్ గాంధీకి, హిందూ మతానికి అందరినీ కలుపుకొనిపోయే, అహింసాయుతమైన అర్థాన్నిచ్చాడు.

("ద వైర్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

ఎంత చదువు చదివితేనేమి?

ఇటీవల నేను(వ్యాస రచయిత) పంటి సమస్యతో నగరంలోని ఒక ప్రముఖ దంత వైద్యశాలకు వెళ్లాను. అక్కడ పనిచేసే వైద్యుల్లో అందరు యువతీ యువకులే.వీరిలో మెజార్టీ అమ్మాయిలే.అయితే విస్మయం కలిగించే విషయమేమంటే అందరు కుర్తా పైజామా డ్రెస్సులే ధరించారు. ఈమధ్య వచ్చిన ట్రెండ్‌లో భాగంగా పొట్టి పైజామాలు కొంచెం కాళ్లకి పైకి ధరించటంతో వాళ్ల మడిమ భాగంలో ఆభరణాలు చూపరులకు కనిపిస్తాయి.ఈ రోజుల్లో స్త్రీలు కాళ్లకి ఆభరణాలకు బదులు ఒక నల్లటి దారాన్ని ధరించటం ప్యాషన్ అయింది. ఈ నల్లటి దారాలను చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ధరించటం పరిపాటిగా మారింది. వీటిని ఎందుకు ధరిస్తున్నారు? అని విచారించగా దిష్టి నివారించేందుకని తెలిసింది.ఈ దిష్టినే ఆంగ్లంలో ఇవిల్ ఐ అని అంటారు. దిష్టి అనేది భారత దేశంలో అనాది కాలం నుండి ప్రచారంలో వుంది. ఇది ఒక్క హిందూమతంలోనే కాకుండా ముస్లిం, క్రిస్టియన్, యూదు మతంలో కూడా విస్తరించింది. ప్రధానంగా కొందరి చూపు మంచిది కాదని, అది వేరేవారిపై పడితే ఆరోగ్య సమస్యలు వస్తాయని, మంత్రాలూ, తంత్రాలు చేస్తారని దానికి విరుగుడుగా తాయత్తులు కట్టుకోవడం, మంత్రాలకు విరుగుడుగా పూజలు చేయటం మనం చూసివుంటాం.మరి నిజంగా దిష్టి, మంత్రాలు ఉంటాయా? మరి చదువుకొని వైద్యం చేస్తున్న డాక్టర్లు నల్లదారం ఎడమ కాలుకు కట్టుకోవడమేంటి? దీన్నిబట్టి చూస్తే మనమెంత అంధకారంలో ఉన్నామో అర్థం చేసుకోవచ్చు.


1976లో భారత రాజ్యాంగానికి 46వ సవరణలో భాగంగా 51ఎ ఆర్టికల్ ప్రకారం పౌరుల్లో సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించటం ప్రతిపౌరుని ఫండమెంటల్ డ్యూటీగా పేర్కొన్నారు. కానీ నేడు చదువుకున్న వారే దిష్టిదారాలు, బాబాల దగ్గరికి పరుగెత్తటం చూస్తుంటే మన విద్యావిధానంలో తేడా వున్నదనే విషయం స్పష్టమవుతున్నది. మనమందరం చదువుకొనే రోజుల్లో న్యూటన్ ద్రవ్య నిత్యత్వ నియమం గురించి హైస్కూల్ స్థాయిలోనే చదువుకున్నాము. దీని ప్రకారం సృష్టిలో పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చేయలేము, కానీ ఒకరూపంలో నుండి మరో రూపంలోకి మారుతున్నదనే విషయాన్ని నేర్చుకున్నాము.మరి ఈనాడు కొందరు బాబాలు తమ దగ్గర అతీంద్రియ శక్తులు ఉన్నాయని హస్తలాఘవం చూపించటం, వాటిని నమ్మి దేవునిగా భావించటం చూస్తూనే ఉన్నాము. అయితే బాబాల బండారం బయటపడ్డప్పుడు కానీ భక్తులకు కనువిప్పు కలగదు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడం బాధాకరం.

ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో బోలేబాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో నూట ఇరవై ఒక్కమంది ప్రాణాలు కోల్పోవటం, వందలాది మంది గాయపడటం టీవీల్లో, వార్తల్లో మనం చూశాం. ఇందులో పాల్గొన్న భక్తులు మెజారిటీ నిమ్న కులాలకు చెందినవారు. ముఖ్యంగా మహిళలు వారికున్న ఆర్థిక, అనారోగ్య సమస్యలకు ఆ బాబా నడిచిన పాదధూళితో విముక్తులమవుతామనే భావనలో ఉండటంతో జరిగిన దారుణమిది.అయితే దేశ ప్రజలు మూఢనమ్మకాల్లో కొట్టుమిట్టాడటానికి ప్రచార సాధనాలతో పాటు పాలిత వర్గాల ప్రోత్సాహం ఇలాంటి దృష్టాంతాలకు కారణం.బోలేబాబాగా అవతారం ఎత్తకముందు అతని పేరు సురజ్‌పాల్. ఈయన పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసి బాబా అవతారమెత్తాడు. గతంలో ఈయన చనిపోయిన బాలికను బతికిస్తానని శ్మశానంలో హడావుడి చేసి జైలు పాలయ్యాడు. తర్వాత కాలంలో ఈయన ప్రభ బాబాగా వెలిగిపోయింది. ఈయనకు వర్జిన్ అమ్మాయిలే సుగంధాలతో కూడిన నీటితో స్నానం చేయిస్తారట! ఇప్పటికే వందలకోట్ల రూపాయల ఆస్తులు సంపాదించాడని సమాచారం. ప్రజల సొమ్ముతో ఆయన అద్దాల మేడలో నివసిస్తాడు, కానీ భక్తి అనే అంధకారంలో మునిగిన భక్తులు ఆయన పాదధూళి కోసం పడి చచ్చిపోతారు. ఎంతటి మూర్ఖత్వమిది, ఇది మూఢనమ్మకాల పర్యవసానం కాదా?

ఇంతమంది అమాయకులు చనిపోయినా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దానికి కారణమైన బోలేబాబాపై కేసు నమోదు చేయలేదు, ఎందుకు? బాబా చేతిలో ఉన్న ఓటుబ్యాంకు వారికి ముఖ్యం. పాలకులకు కావాల్సింది అధికారం తప్ప, ప్రజా శ్రేయస్సు కాదని ఇలాంటి ఘటనలు రుజువు చేస్తున్నాయి. దారి తప్పిన విద్యావిధానం కూడా దీనికి బాధ్యత వహించక తప్పదు! ఇలాంటి మూఢ నమ్మకాలను నమ్మొద్దని ప్రచారం చేసినందుకు డాక్టర్ దభోల్కర్, పన్సారే, గౌరీ లంకేశ్ , కల్బుర్గీ లాంటి యాక్టివిస్టులను హత్య చేసిన ఘటనలు దేశంలో అనేకం. డాక్టర్లు కాళ్లకు నల్ల దిష్టి దారాలను కట్టుకోవటం, చదువుకున్నవారు కూడా బాబాల మోసాలను నమ్మడం, ఇంకా ప్రస్తుత వ్యవస్థ కూడా వీటికి బహుళ ప్రచారం కల్పించటం చూస్తుంటే సగటు మనిషికి ఈ దేశమెటుపోతోందనే ఆందోళన కలగకమానదు.

- డాక్టర్. కె.సుధాకర్‌రెడ్డి, 8985037713

'చెంచు' ఆదివాసీ తెగ అంతరించి పోవాల్సిందేనా?



బండారు రవికుమార్ 9490098090

"చెంచు" ఆదివాసీలు అంతరించిపోయే తెగల జాబితాలో పీవీటీజీలు (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్)గా ఉన్నారు. వీరిని ఇంతకుముందు ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్స్ (పీటీజీ)గా పిలిచేవారు. వీరి జనాభా కనుమరుగైపోతున్నది. దీనిపై వారి ఉనికిని కాపాడే ఎలాంటి చర్యలు ప్రభుత్వాల నుండి లేవు.

గత జూన్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన అత్యంత హేయమైన, పైశాచిక దాడి ఘటన సభ్య సమాజం ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటనకు కొంతకాలం ముందు వారి దగ్గరి బంధువు నాగన్న కూడా హత్యకు గురయ్యాడు. ఈ దాడులు, హత్యాకాండ అంతా వారివద్ద ఉన్న కొద్దిపాటి భూమిని పెత్తందారులు గుంజుకునేందుకు చేసినవే. ఇలాంటి ఘటనల ద్వారా చాలామంది వెట్టిచాకిరీ(బాండెడ్ లేబర్)గా మారుతున్నారు. నామమాత్రపు ధరకు ఆ చెంచు కుటుంబం భూమిని కొట్టేయాలని చూసిన గిరిజనేతర పెత్తందారుల ప్రయత్నాలకు ఈశ్వరమ్మ సంతకం చేయ నిరాకరించింది. దీంతో ఆమె పెత్తందారు అయిన బండి వెంకటేష్ ఆగ్రహానికి గురయ్యింది. చెప్పడానికి, రాయడానికి వీలులేని రీతిలో ఆమెను చిత్రహింసలకు గురిచేసారు. ముగ్గురు పసిపిల్లల తల్లి ఈశ్వరమ్మ చావుబతుకులతో హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రాణాపాయ స్థితి నుండి బయటపడింది. ఇలాంటి దాడులను నివారించాల్సిన పోలీసు, ఫారెస్టు, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ బాధితుల పక్షాన నిలబడక పోవడమే కాకుండా, విచారణాధికారిగా నియమించబడిన డిఎస్‌పి బాధితులను అత్యంత చులకనగా, అవమానించి మాట్లాడాడు. ఈ వివక్షకు కారణం జనాభా రీత్యా చెంచులు అతి చిన్న మైనారిటీ గ్రూపు కావడమే.


నాగర్‌కర్నూల్ జిల్లాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను దున్నుకోకుండా ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. ఫలితంగా పెరిగిన మొక్కలు చూపించి ఇది అడవి అని బెదిరిస్తున్నారు. సాగులో ఉన్న భూములకు కూడా పట్టాలు రాకుండా అడ్డుకుంటున్నారు. ఐటీడీఏ వీరి పక్షాన నిలబడాల్సి ఉన్నది. కానీ అది నిర్వీర్యమైపోయింది. వీరిని బాండెడ్ లేబర్‌గా మార్చకుండా కాపాడేదానికి అత్యంత వెనకబడిన పివిటిజిలకు ప్రత్యేకంగా వర్తించాల్సిన ఉపాధిహామీ చట్టం అమలు చేయడం లేదు. గిరిజనేతరులకు ఇచ్చే పనుల్లోనే చెంచులను కూడా కలిపారు. దీనితో వారిని ఈ పనికి పోకుండా చేసేందుకు పలురకాల ఆంక్షలు తయారు చేసినట్లయింది. ఫలితంగా వీరు ఉపాధి పనులకు దూరమయ్యారు. జీవనోపాధి లేక చెంచులు తీవ్రమైన పేదరికం, పోషకాహార లోపం, రక్తహీనతతో ప్రమాదకరంగా జీవిస్తున్నారు. చాలా మందికి ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుండి పేదలకందే ఎలాంటి సహాయం వీరికి అందడం లేదు.

ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో, నక్సల్స్‌కు అన్నం పెడుతున్నారనే నెపంతో ఎటువంటి విచారణా లేకుండానే అడవిలోని గ్రామాలను ఖాళీ చేయించారు. తర్వాత ఆ ప్రాంతాన్ని "రాజీవ్‌గాంధి టైగర్ రిజర్వ్" ఫారెస్టులో కలిపారు. అడవిలో క్రూర జంతువులు, ఆదివాసీలు కలిసే ఉండేవారు. కానీ తర్వాత క్రూర జంతువులే ఉండాలనే లక్ష్యంతో మనుషులను బయటకు తరిమెయ్యాలనే విధానాన్ని చేపట్టారు. వారిని అక్కడి నుండి ఖాళీ చేయించారు కానీ వారికి ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో పునరావాసం కాదు కదా, సాధారణ స్థాయి పునరావాసం కూడా కల్పించలేదు. దీనితో నీళ్లనుండి ఒడ్డున పడేసిన చేపలా అయింది ఈ పివిటిజిల పరిస్థితి. పట్టాలు ఇచ్చినవారికి భూమి చూపలేదు. భూమి దక్కినా వారికి అది వారి చేతిలో మిగలలేదు, అది అన్యాక్రాంతమైంది. పునరావాసం పేరుతో మైదాన ప్రాంతంలోకి తరలించిన తర్వాత వారికి రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్ ప్రాంత చట్టాలు, హక్కులు ఏ ఒక్కటీ వర్తించకుండా అయిపోయింది.

గిరిజనుల కోసం పనిచేయడానికి వివిధ విభాగాలతో కూడిన ఐటిడిఏ ఉండాలి. ఐఏఎస్ అధికారి ఐటిడిఏకు ప్రాజెక్టు అధికారిగా నియమించాలి. నిధులు కేటాయించాలి. కానీ ఇవేవీ లేకుండా మన్ననూర్‌లో ఐటిడిఏ నామమాత్రంగా ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో సున్నిపెంట (శ్రీశైలం)లో పూర్తిస్థాయి ఐటిడిఏ ఉండేది. రాష్ట్ర విభజనలో అది ఆంధ్రాకి పోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కొత్త జిల్లా నాగర్‌కర్నూల్‌లోని మన్ననూర్‌లో ఏర్పాటు చేశారు.

అటవీశాఖ అడవిబిడ్డలపై అనునిత్యం దాడులు నిర్వహిస్తున్నది. అదే శాఖకు చెందిన అధికారిని ఐటిడిఏకు ఇన్‌ఛార్జి పిఓగా పెట్టారంటే ఐటిడిఏల ఏర్పాటు స్ఫూర్తికి ఎలా తూట్లు పొడిచారో అర్థమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్. ఈ జిల్లాలో ఇప్పటికైనా పూర్తిస్థాయి ఐటిడిఏగా మార్పుచేసి ఐఏఎస్ అధికారిని పిఓగా నియమించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రజాపాలన అధికారిణి (ఐఏఎస్) శ్రీమతి దివ్యాదేవరాజన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఏజిఎస్) తరపున జూన్ 28న పార్లమెంటు మాజీ సభ్యులు డా॥మిడియం బాబూరావు నాయకత్వంలో వినతిపత్రం ఇచ్చి పలు సూచనలు చేసింది. పలు రాష్ట్ర స్థాయి గిరిజన అధికారులను కలిసింది. కొల్లాపూర్ మండలంలో చెంచు ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యల్ని తెలుసుకుంది, వారికి అండగా నిలబడి ధైర్యన్నిచ్చింది.

చెంచులు పివిటిజిల జాబితాలో ఉంటారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దక్కాల్సిన పథకాలు నేరుగా చేరేలా గూడాలి. తగిన నిధులు కేటాయించాలి. సాగులో ఉన్న భూములకు, గతంలో సాగు చేసుకుని బలవంతంగా అటవీశాఖ ద్వారా బయటకు గెంటివేయబడిన భూములకు పట్టాలివ్వాలి. పలురకాల ప్రలోభాలు, బెదిరింపులతో వారివద్ద నుండి గుంజుకున్న భూములను తిరిగి వారికి ఇప్పించాలి. ప్రతి చెంచు కుటుంబానికి కనీసం పదెకరాల భూమి ఉండేలా చూడాలి.



చెంచులు పివిటిజిల జాబితాలో ఉంటారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దక్కాల్సిన పథకాలు నేరుగా చేరేలా గూడాలి. తగిన నిధులు కేటాయించాలి. సాగులో ఉన్న భూములకు, గతంలో సాగు చేసుకుని బలవంతంగా అటవీశాఖ ద్వారా బయటకు గెంటివేయబడిన భూములకు పట్టాలివ్వాలి. పలురకాల ప్రలోభాలు, బెదిరింపులతో వారివద్ద నుండి గుంజుకున్న భూములను తిరిగి వారికి ఇప్పించాలి. ప్రతి చెంచు కుటుంబానికి కనీసం పదెకరాల భూమి ఉండేలా చూడాలి. మంచినీటి బోర్‌వెల్స్, సాగునీటి బోర్లు కూడా వేయకుండా అటవీశాఖ జులుం పెరిగిపోయింది. వారి దురాగతాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలి.

మంచినీటి బోర్‌వెల్స్, సాగునీటి బోర్లు కూడా వేయకుండా అటవీశాఖ జులుం పెరిగిపోయింది. వారి దురాగతాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలి.

చెంచు ఆవాసాలలో అంగన్‌వాడీ సెంటర్లు, హెల్త్ వర్కర్ల వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి. జిసిసి, రేషన్ దుకాణాల ద్వారా అందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ అందుబాటులోకి తేవాలి. అర్హులైన వారందరికీ పివిటిజి నామ్స్ ప్రకారం వృద్ధాప్య పింఛన్లతో పాటు, వితంతు పింఛన్లివ్వాలి. రక్తహీనత, పోషకాహార లోపం పొగొట్టడానికి ప్రత్యేక పోషకాహార ప్రాజెక్టును ఏర్పాటు చేయాలి. ఐదోషెడ్యూల్ ప్రాంతం వర్తించే విధంగా పునరావాసం కల్పించాలి. ఐటిడిఏ చొరవచేసి బ్యాంకుల ద్వారా రుణాలు, విత్తనాలు తదితర సౌకర్యాలు కల్పించాలి. పివిటిజిలకు ప్రత్యేకంగా ఉపాధి హామీ పథకం కింద విడిగా పనులు కేటాయించాలి. పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకునేవారికి కఠిన శిక్షలు వేయాలి. ప్రతి పీవీటీజీ కుటుంబానికి 30 కేజీల బియ్యం, మూడు కేజీల కందిపప్పు, రెండు కేజీల మంచినూనే ప్రతి నెలా ఇవ్వాలి. గృహ నిర్మాణ పథకం కింద వారందికీ పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి.

నాగన్నను చంపినవారిని, ఈశ్వరమ్మ ఘటనతో సంబంధం ఉన్నవారందరినీ కఠినంగా శిక్షించాలి. బెయిల్ మంజూరు కాకుండా చూడాలి. తాగుడు, ఇతర వ్యసనాలకు పురుషులు బానిసలై చనిపోతున్నారు. ఒంటరి మహిళలు, అనాథ పిల్లల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ వ్యసనాలపై ప్రత్యేకంగా ఐటిడిఏ, ఇతర సంస్థలు సీరియస్‌గా దృష్టి పెట్టాలి. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు చేపట్టకపోతే, తర్వాత కాలంలో ఐటిడిఏ ఏర్పాటు చేసిన చెంచులక్ష్మి మ్యూజియాన్ని సందర్శించినవారు 'ఒకప్పుడు చెంచు తెగ ఇలా ఉండేదట' అని ఒక జ్ఞాపకంగా గుర్తుచేసుకునే ప్రమాదముంది.

ఉపకార వేతనాలు రావా..?

తక్షణం ఫీజురీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలి

- సీఎం స్పందించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండో రోజూ కలెక్టరేట్ల ముట్టడి
- పాల్వంచలో పోలీసుల అత్యుత్సాహం
- నూతన చట్టం కింద ఎస్ఎఫ్ఐ నేతలపై కేసులు

నవతెలంగాణ -విలేకరులు

"రాష్ట్రంలో ప్రభుత్వం మారినా విద్యార్థుల జీవితంలో ఎలాంటి మార్పులూ రాలేదు.. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వడం లేదు.. సర్టిఫికెట్స్ కోసం విద్యార్థులు అప్పులు చేసి కాలేజీలకు ఫీజులు కడుతున్నారు.. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలి.. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.." అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, నాగరాజు అన్నారు. రెండో రోజు శుక్రవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో పాల్వంచలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి విద్యార్థులు, విద్యార్థి నాయకులను చెరదగొట్టారు. నాయకులను లాక్కెళ్లి అరెస్టు చేసి అక్రమంగా కేసులు బనాయించారు.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో వందలాది మంది విద్యార్థులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్‌మూర్తి మాట్లాడుతూ.. ఆరేండ్ల నుంచి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు బకాయిలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరికి సంవత్సరానికి 3వేల కోట్లు అవసరం అవుతాయని, కానీ 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. మొత్తం రూ.8214.57 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రావాల్సి ఉందని వివరించారు. ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే విద్యార్థులు అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్స్ తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. నిర్మల్‌లో ఆర్‌డీఓ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులు, విద్యార్థి నాయకులు ర్యాలీగా వెళ్లి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. కలెక్టరేట్ గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో వారు అక్కడే బైటాయించారు. 'మీరు బయటకు వస్తారా..? మమ్మల్ని లోపలికి రమ్మంటారా..?' అంటూ విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ క్రమంలో అక్కడకు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశురామ్‌ను కలెక్టర్ పంపించగా.. విద్యార్థి నాయకులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. జిల్లా డీఆర్వో పవన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి, జనగామ కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు.





పాల్వంచలో అరెస్టులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ధర్నాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ గేట్ వద్ద బైటాయించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకత్వం కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అరెస్టు చేశారు. లాక్కెళ్లారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.రామ్ చరణ్, జిల్లా కమిటీ సభ్యులు జె.యశ్వంత్‌పై నూతన భారత న్యాయ సంహిత చట్టం కింద అక్రమ కేసులు పెట్టి కోర్టులో జడ్జి ముందు హాజరుపర్చారు. అక్రమ అరెస్టులను ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు, ప్రజాసంఘాలు ఖండించాయి. ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. అధికారులు వచ్చే వరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో కలెక్టరేట్‌లోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యార్థులు కళాశాలల తరగతులను బహిష్కరించి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. అనంతరం డీఆర్‌ఓ పద్మజకు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలోనూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేశారు.

గుడిసెల తొలగింపునకు అధికారుల యత్నం



- అడ్డుకున్న గుడిసెవాసులు
- అధికారులతో వాగ్వాదం

నవతెలంగాణ-వాజేడు

ప్రకృతి వనంకు కేటాయించిన భూమిలో ఇండ్లు లేని నిర్వాసితులు గుడిసెలు వేసుకొని నివసిస్తుండగా.. వారిని ఖాళీ చేయాలని శుక్రవారం అధికారులు, పోలీసుల సాయంతో గుడిసెలు తొలగించే ప్రయత్నం చేశారు. వారిని గుడిసెవాసులు అడ్డుకున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక సమీపంలో మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ సమీపంలో నివాస స్థలాలు లేనివారు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. గుడిసెలు వేసిన స్థలం గ్రామపంచాయతీ పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిందని, వెంటనే ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి వచ్చి గుడిసెవాసులకు ఆదేశించారు. గోదావరి వరదలు వచ్చినప్పుడు తాము అంతా ముంపునకు గురయ్యాయని, తమకు ఎలాంటి నివాస స్థలాలు లేవన్నారు. అందుకే ఏడాది కిందట ఇక్కడికి వచ్చి గుడిసెలు వేసుకున్నామని గుడిసెవాసులు తెలిపారు. వేసిన గుడిసెలు తొలగించబోమని వారు అధికారులతో తేల్చిచెప్పారు. దాంతో అధికారులకు గుడిసెవాసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో తహసీల్దార్, ఎస్ఐలు గుడిసెవాసులతో మాట్లాడుతూ.. మంత్రి లేదా కలెక్టర్ నుంచి పర్మిషన్ తెచ్చుకోవాలని, లేకుంటే ఖాళీ చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. అయినప్పటికీ గుడిసెవాసులు వినకపోవడంతో చేసేదేమీలేక అధికారులు అక్కడి వెళ్లిపోయారు.

రైతు బీమాపై డైలమా..!

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తుల్ని స్వీకరిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల్ని స్వీకరించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన తర్వాత దరఖాస్తుల్ని స్వీకరించాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో గత ఆర్థిక సంవత్సరం తర్వాత కొత్తగా పాసుపుస్తకాలు వచ్చిన రైతులు లక్షల్లో ఉంటారు. అయితే 2023-24 సంవత్సరంలో చెల్లించిన ప్రీమియం పాలసీ గడువు ఆగస్టు 13తో ముగియనుంది. అంతలోపు 2024-25 సంవత్సరానికి సంబంధించిన పాలసీ ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తేనే వచ్చే ఆగస్టు 14 నుంచి రైతులకు రైతు బీమా వర్తిస్తుంది. గడువులోపు పాలసీని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు. అయితే దరఖాస్తుల్ని స్వీకరించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

రైతు బీమా పథకం కింద సంగారెడ్డి జిల్లాలో 2,08,503 మంది రైతులు అర్హులుగా ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 2,75,247 మంది రైతులున్నప్పటికీ వీరిలో 1,45,032 మంది మాత్రమే 59 ఏండ్ల వయసు లోపు ఉన్న రైతులు అర్హులుగా తేల్చారు. మెదక్ జిల్లాలో 1,20,504 మంది రైతులు రైతు బీమాకు అర్హులుగా అధికారులు తేల్చారు. రైతు బీమా పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 8038 మంది రైతులు మరణించగా వారి కుటుంబాలకు రూ.401.90 కోట్లు అందాయి. మెదక్ జిల్లాలో 5426 మంది రైతులు మరణించగా వారి నామినీల పేరిట రూ.271.30 కోట్లు, సిద్దిపేట జిల్లాలో 1144 మంది మరణించగా ఇందులో 1050 మంది కుటుంబాలకు రూ.52.50 కోట్ల ఆర్థిక సహాయం అందజేశారు. ఇంకా 94 మందికి సాయం అందాల్సి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కూడా 18 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన వాళ్ల తల్లిదండ్రుల పేరిట ఉన్న భూములకు పౌతీ ద్వారా, గిఫ్ట్ డీడ్ ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. కొందరు భూముల్ని కొనుగోలు చేయడం ద్వారా కూడా పాసుపుస్తకాలు వచ్చాయి. వీరంతా కూడా రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే అవి ఎల్ఐసీ బీమా పథకంలో నమోదు చేయబడతాయి.

రైతు బీమా పథకం కొనసాగాలి

రైతు బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగం. ఇంటి పెద్ద దిక్కుగా ఉండే రైతు మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడేది. మానసికంగా కుంగిపోవడమే కాక ఆర్థికంగా ఇబ్బందులుండేవి. ఐదేండ్లుగా రైతు బీమా పథకం అమల్లో ఉండటంతో చాలా కుటుంబాలకు సాయంగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పథకాన్ని కొనసాగించాలి. గడువు ముగుస్తున్నందున ప్రీమియం చెల్లించాలి.

- రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

పడిపోతున్న మిర్చి ధరలు

(మొదటిపేజీ తరువాయి)

కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకు నల్లబడిన ఉదంతాలు ఉన్నా.. రేటులేక నిస్తేజంలో ఉన్న రైతులు ఇటువైపు తొంగిచూసే పరిస్థితి కూడా లేదు.

అమ్మేది అంతంతే.. ధరల క్షీణత ఎంతెంతో..!

గడిచిన వారం రోజుల్లో ఖమ్మం మార్కెట్లో ఏసీ మిర్చి ధరల్లో ఏ మాత్రం పెరుగుదల లేదు. ఈ కారణంగా రైతులు అత్యవసరమైతే తప్ప మిర్చి అమ్మట్లేదు. ఫలితంగా రోజుకు వందల సంఖ్యల్లోనే బ్యాగ్‌లు అమ్మకానికి వస్తున్నాయి. ఈనెల 8వ తేదీ సోమవారం 37 మందికి చెందిన 1,144 బస్తాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి. ఆ రోజు గరిష్ట క్వింటాల్ మిర్చి ధర రూ.19,550, మోడల్ రూ.15,500, కనిష్టంగా రూ.11,000కు కొనుగోలు చేశారు. తాలు మిర్చిని రూ.9,000కు మాత్రమే కొనుగోలు చేశారు. ఒక్కరే 60 బస్తాల తాలు అమ్మారు. శుక్రవారం 25 మందికి చెందిన 645 బస్తాలను మాత్రమే విక్రయించారు. గరిష్ట ధర క్వింటాల్ రూ.19,300, మోడల్ రూ.17,000, కనిష్టంగా రూ.10,000కు మాత్రమే కొనుగోలు చేశారు. తాలు రూ.9,600 చొప్పున ధర పలికింది. కోల్డ్‌స్టోరేజీల్లో కాకుండా ఇండ్లలో నిల్వ చేసిన మిర్చిని 23 మంది రైతులు 501 బస్తాలు శుక్రవారం మార్కెట్‌కు తెచ్చారు. వీటికి గరిష్టంగా రూ.16,000, కనిష్టం రూ.10,000, మోడల్ ధర రూ.14,700 చొప్పున ధరలకు కొనుగోలు చేశారు. అధిక మొత్తం ఏసీ మిర్చిని రూ.15వేల నుంచి రూ.17వేలకు మధ్యే కొనుగోలు చేశారు.

వ్యాపారుల వైపే మొగ్గు..

కొందరు వ్యాపారులు సిండికేట్ అయినట్టు ఆరోపణలు వస్తున్నాయి. రైతుల సరుకు కన్నా వ్యాపారుల సరుకునే అధికంగా కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. జీరో వ్యాపారానికి సహకరించాల్సిందిగా కొందరు కోరుతున్నారనే చర్చ జరుగుతుంది. ఐదు శాతం జీఎస్టీ, ఒకశాతం మార్కెటింగ్‌శాఖ పన్నును ఎగ్గొట్టేందుకు ఈ రకమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. విదేశాలకు ఆర్డర్లు లేవంటున్న వ్యాపారులు రైతు, వ్యాపారుల సరుకు మధ్య ధరల వ్యత్యాసం చూపుతున్నారు. వ్యాపారుల సరుకును కొనుగోలు చేస్తూ పన్నులు ఎగ్గొట్టేందుకు పూనుకుంటున్నారు. కోల్డ్ స్టోరేజీల నుంచి మామూలు రకాల శాంపిల్స్ తీసుకురావడం ధరలపై ప్రభావం చూపుతోందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ చెబుతున్నారు. ఆర్డర్లు లేకపోవడం కూడా ఓ కారణంగా సూచించారు.

నాలుగు నెలల నుంచి సరైన ధర కోసం చూస్తున్నా..

మార్చినెలలో అమ్ముదామని 20 బస్తాలు తీసుకుని మార్కెట్‌కు వచ్చా. ఎవర్ని అడిగినా క్వింటా రూ.15వేలే పెడతామన్నారు. ఇంకో వెయ్యి పెడితే ఇద్దామనుకున్నా కానీ ఎవరూ ముందుకు రాలేదు. చేసేది లేక ఖమ్మం వెంకటగిరి రోడ్డులోని ఓ కోల్డ్‌స్టోరేజీలో మార్చి నెల నుంచి 20 బస్తాల మిర్చి నిల్వ చేస్తున్నా. అప్పటి నుంచి సరైన ధర కోసం ఎదురుచూస్తున్నా. అప్పటి నుంచీ అదే రేటు. పెట్టుబడులకు ఇబ్బందవుతున్నా ధర పెరుగుద్దేమోనని ఉంచుతున్నా.

వనవాసం రాంరెడ్డి, గుండెపూడి, మహబూబాబాద్ జిల్లా

తొందరపాటుతో పార్టీ మార్పు

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొంత మంది నాయకులు, ఎమ్మెల్యేలు తొందరపాటుతో బీఆర్ఎస్ ను వీడి వెళుతున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అభిప్రాయపడ్డారు. అలాంటి వారు తల్లిలాంటి పార్టీని విమర్శించడం సరికాదని హితవు పలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

పోడుదారులకు పట్టాలిస్తేనే న్యాయం

- గిరిజన హాస్టళ్లను గురుకులాలుగా మార్చాలి
- ప్రవేశ పరీక్షలతో నిమిత్తం లేకుండా ఎస్సీ, ఎస్టీలకు సీట్లు
- ట్రైకార్ పథక లబ్దిదారులు గ్రామసభల ద్వారా ఎంపిక : ఖమ్మంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పోడు సాగు చేస్తున్నా పట్టాలు లేనివారికి న్యాయం చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కోరారు. ట్రైకార్ పథక లబ్దిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి గిరిజనుల కోసం అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు కృషి చేయాలన్నారు. గిరిజన హాస్టళ్లను గురుకులాలుగా మార్చి, సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అడిగిన చోటా ప్రవేశ పరీక్షలతో నిమిత్తం లేకుండా సీట్లు కేటాయించాలన్నారు. డా. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం అమలుపై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. కొన్ని చోట్ల పోడు సాగు చేస్తున్నా పట్టాలు లేవని, పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు, వసతులు కల్పించాలన్నారు. గిరి వికాసంపై గిరిజనుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని చెప్పారు పాఠశాలల్లో పరిశుభ్రంగా ఉంచే స్వీపర్లు లేరని, పరిశుభ్రత, నిర్వహణకై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసార పరీక్షల వివరాలు సమర్పించాలన్నారు. గిరిజనుల కేసులపై వెంటనే స్పందించాలని తెలిపారు. సింగరేణి, ఏన్కూరు మండలాల్లో మిషన్ భగీరథ పనులు చేపట్టిన వారికి బిల్లులు రాలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఎన్ని నిధులు మంజూరు, ఖర్చు, మిగులుపై పూర్తి నివేదిక సమర్పించాలన్నారు. గిరిజన భవన్‌ను వాడుకలోకి తేవాలన్నారు. తండాలు, గ్రామ పంచాయతీగా మారిన చోట భవనాలు నిర్మించి, ఉపాధిహామీ సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఆర్వోఎఫ్ఆర్ కింద 2022లో దరఖాస్తులు స్వీకరించి 6,589 మందికి 13 వేల ఎకరాల భూమికి పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఎకో టూరిజంలో గిరిజనులకే ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. గిరి వికాసం కింద 318 బోర్లు, అవసరమైన చోట్ల విద్యుత్ లైన్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 4,800 మంది ఎస్టీలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్టు చెప్పారు. 24,647 మంది గిరిజనులకు ప్రతినెలా రూ. 6.85 కోట్ల చేయూత పెన్షన్లు, 18,202 మంది గిరిజనులకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 21.86 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. ఉపాధి హామీ కింద గతేడాది రూ. 26.57 కోట్లు వేతనాలు కింద గిరిజన కుటుంబాలకు అందజేశామన్నారు.



జిల్లాలో 1216 పాఠశాలల్లో 60,380 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 19,181 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని, 4,346 మంది ఉపాధ్యాయులు ఉండగా వారిలో 669 గిరిజనులు ఉన్నట్టు వివరించారు. జిల్లాలో 59,500 మంది గిరిజన రైతులు ఉన్నట్టు తెలిపారు. 11 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాగా, 6 కేసుల్లో విచారణ పూర్తి చేసినట్టు చెప్పారు. 2020 నుంచి ఇప్పటి వరకు 121 కేసుల్లో పరిహారం అందించినట్టు చెప్పారు. కాగా, గిరిజన సంఘాలకు చెందిన పలువురు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ నరేశ్ కుమార్, డీఆర్వో ఎం. రాజేశ్వరి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంచిలో మహిళ మృతదేహం

- భర్తే హత్య చేసి పారిపోయాడని అనుమానం

నవతెలంగాణ-ఉప్పల్


(ఫైల్)

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన జరిగింది. ఓ ఇంట్లో సంచిలో మహిళ మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ప్రదీప్ బోలా, మధుస్మిత్ (28) దంపతులు. వారికి కుమార్తె ఉంది. కొంత కాలంగా ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే, కొన్ని రోజుల నుంచి భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, శుక్రవారం వారింట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఓ సంచిలో మహిళ మృతదేహం చుట్టి ఉంది.

రెండ్రోజుల కిందటే హత్య జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భర్తనే ఆమెను హత్య చేసి.. కుమార్తెను తీసుకుని వెళ్లిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అన్ని కోణాల్లో విచారణ చేసి త్వరలో వివరాలు తెలియజేస్తామని ఉప్పల్ సీఐ ఎలక్షన్ రెడ్డి తెలిపారు.

ఉద్యోగుల పాలిట శాపంగా గత సర్కారు

- మంత్రి కోమటిరెడ్డి విమర్శ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగుల సర్వీస్ నిబంధనల సమస్యను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని ఈఎన్సీ కార్యాలయంలో వివిధ ఉద్యోగ సంఘాలతో మంత్రి భేటీ అయ్యారు. ఈసందర్భంగా వారి సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పదేండ్ల పాటు ఉద్యోగుల సమస్యలపై దష్టిపెట్టకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. నచ్చిన వారికి నజరానాలు అన్నట్టు తమకు అనుకూలంగా ఉన్నవారికే ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేసి ఉద్యోగుల మధ్య ఐక్యతకు విఘాతం కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాస్త్రీయత లేని విధానాలతో ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో కొత్త సమస్యలను తెచ్చిపెట్టిందన్నారు. కుటుంబంలా కలిసి పనిచేయాల్సిన శాఖలో రిక్రూట్‌మెంట్‌కు ఒక యూనియన్ ఏర్పడేలా చేయడం బాధాకరమన్నారు. కొంత సమయం పట్టినా మీరంతా కూర్చొని ఏకాభిప్రాయానికి వస్తే ఈ సమస్యలన్నీ సులువుగానే పరిష్కరించుకోవచ్చని మంత్రి ఉద్యోగులకు చెప్పారు. జోనల్ సమస్యలు, సీనియార్టీ ఇబ్బందులు, సర్వీస్ నిబంధనల సవరణ తదితర అంశాలపై ఒక క్లారిటీ తీసుకువచ్చి ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్లపై ఒక నిర్ణయం తీసుకుందామని చెప్పారు. ఒక యూనివర్సల్ నిర్ణయం తీసుకున్నప్పుడు ఒకరిద్దరికి ఇబ్బంది కలిగినా మిగితావారికి న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, ఈఎన్సీ ఐ గణపతి రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీఈ మెహన్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, పుల్లదాస్, రాజేంద్రనాయక్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి పీఎస్‌గా చంద్రమోహన్ సర్కారు ఉత్తర్వులు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యక్తిగత కార్యదర్శిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కె.చంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సర్క్యులర్ ఇచ్చారు. చంద్రమోహన్ ప్రస్తుతం కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పనిచేస్తున్నారు. వెంటనే ఆ బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు.

నో బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

బెదిరించే అవకాశమున్నదని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాదించారు. అంతేగాక, త్వరలోనే ఈ కేసు దర్యాప్తు కొలిక్కి వచ్చే అవకాశమున్నదనీ, ఈ సమయంలో వీరికి బెయిలివ్వరాదంటూ వాదనలు వినిపించారు. తమ క్లయింట్లకు బెయిల్ మంజూరు చేయాలంటూ నిందిత అధికారుల తరఫు న్యాయవాదులు వాదించారు. వీరి వాదనలను విన్న న్యాయమూర్తి.. నలుగురు నిందితులకు బెయిల్‌ను నిరాకరించారు. ఇటీవలే, ఈ నిందితులకు సంబంధించి నాలుగోసారి చార్జీషీట్‌ను దర్యాప్తు అధికారులు కోర్టులో దాఖలు చేయగా.. అందులో కొన్ని లోపాలున్నాయంటూ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. దీంతో ఆ లోపాలను సరిదిద్దుతూ తిరిగి చార్జిషీట్‌ను దర్యాప్తు అధికారులు దాఖలు చేసినట్టు సమాచారం.

ఈఎస్ఐలో నిధుల దుర్వినియోగం

(మొదటిపేజీ తరువాయి)

మందికి ఉపాధి లభించిందని చెబుతున్న ప్రభుత్వం ఆ మేరకు పెరిగిన కార్మికుల కోసం ఆస్పత్రులు, డిస్పెన్సరీల సంఖ్యను ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఏమైనా ప్రతిపాదనలు పంపించిందా? రాష్ట్రంలో ఎంత మంది కార్మికులున్నారు? ఎంత మందికి ఈఎస్ఐ కార్డులు జారీ చేశారు? ఇంకా ఎంత మందికి జారీ చేయాల్సి ఉంది? స్పష్టతనివ్వాలని కోరారు. కార్మికశాఖ లెక్కల ప్రకారం 1.20 కోట్ల మంది కార్మికులుంటే 18 లక్షల మందికే ఈఎస్ఐ కార్డులున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు 2 కోట్ల మంది వరకుంటారని చెప్పారు. జహీరాబాద్‌లో కార్మికుల సంఖ్య అధికంగా ఉందనీ, అక్కడ డిస్పెన్సరీ సరిపోవడం లేదనీ, 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో డిస్పెన్సరీకి వెంటనే కొత్త భవనం నిర్మించాలని కోరారు. గద్వాలలో కార్మికులున్నా కనీసం ఒక్క డిస్పెన్సరీ లేదని తెలిపారు. రాష్ట్రంలో మరో 10 ఆస్పత్రులతో పాటు ప్రస్తుతమున్న డిస్పెన్సరీలకు రెండు, మూడు రెట్లు అధికంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రూ.26 లక్షల వసూలు ...రూ.12 వేలు అద్దెకివ్వరు

జహీరాబాద్‌లో కార్మికుల నుంచి ఈఎస్ఐ కోసమంటూ రూ.26 లక్షలు వసూలు చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ తెలిపారు. అలాంటి చోట ఉన్న డిస్పెన్సరీకి నెలకు రూ.12 వేలు అద్దె చెల్లించక పోవడంతో కొంత కాలం మూసేశారని తెలిపారు. ప్రతి రోజు 200 నుంచి 250 మంది రోగులు వచ్చే డిస్పెన్సరీలో డిప్యూటేషన్‌పై డాక్టర్ పని చేస్తున్నారని చెప్పారు. ఆస్పత్రి పెట్టాల్సినంత మంది కార్మికులున్న చోట డిస్పెన్సరీ పెట్టి, అది కూడా అద్దె చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు నెలలుగా జీతాల్లేవు

స్కామ్‌ల చరిత్ర కలిగిన ఈఎస్ఐ నిధులను ఇప్పటికీ కార్పొరేట్లకు దోచిపెడుతున్నదని సీఐటీయూ నాయకులు కుమార్ ఆరోపించారు. కేవలం కమిషన్ల కోసమే అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ నుంచి 120 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ పరిధిలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల డిస్పెన్సరీలున్నాయని తెలిపారు. వాటిలో పని చేసేందుకు కాంట్రాక్ట్ ఏజెన్సీని జేడీ ద్వారా పిలిచేవారని తెలిపారు. ప్రస్తుతం ఆరు జిల్లాల కలెక్టర్ల ద్వారా కాంట్రాక్ట్ ఏజెన్సీలను పిలిచేందుకు కాలయాపన జరుగుతున్నదని తెలిపారు. దీన్ని సరి చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు సమయానికి రాకపోవడంతో పీఎఫ్, ఈఎస్ఐ సరైన సమయంలో జమ చేయడం లేదనీ, వేతనాలివ్వడం లేదని వివరించారు. ధర్నా అనంతరం నాయకులు అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్, రుద్రకుమార్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ హాస్టల్‌ను తెరవాలి

- రేపు పూర్వ విద్యార్థుల సందర్శన : ఎంఎస్ఎఫ్ మాజీ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని కాచిగూడ నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్‌ను వెంటనే తెరవాలని పూర్వ విద్యార్థి, ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం పది గంటలకు పూర్వవిద్యార్థులంతా ఆ హాస్టల్‌ను సందర్శిస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేండ్ల కింద నింబోలిఅడ్డలోని సాంఘిక సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్ మూతపడిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ హాస్టల్‌కు ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. ఇక్కడ చదువుకున్న వారు ఎంతో మంది రాజకీయ, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదిగారనీ, ప్రభుత్వ ఉద్యోగులయ్యారని వివరించారు. భవనాన్ని మరమ్మత్తు చేస్తామనే సాకుతో అక్కడి విద్యార్థులను వేరే ప్రాంతానికి బలవంతంగా తరలించారని తెలిపారు. ప్రయివేటు భవనాల్లో ఉంచారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో పక్కా భవనం ఉన్నా ప్రయివేటు వ్యక్తులకు అద్దెలు చెల్లించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నగరం నడిబొడ్డులో ఉన్న కాచిగూడ హాస్టల్ అఫ్జలగంజ్‌లో ఉన్న రాష్ట్ర గ్రంథాయలానికి దగ్గరలో ఉందని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయడం కోసమే అధికారులు ఈ కుట్ర పన్నారని ఆరోపించారు. ఆ హాస్టల్‌ను ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే వెంటనే తెరవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుబంధు పేరుతో 'బీఆర్ఎస్' లూటీ

- రైతుభరోసా అభిప్రాయ సేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు, నేతలు
- వనపర్తిలో క్యాబినెట్ సబ్‌కమిటీ మంత్రుల సమీక్షలో వెల్లడి
- రైతుభరోసా పదెకరాలకు చాలని పలువురి సూచన
- గుట్టలు, రియల్‌ఎస్టేట్, రహదారి భూములకు ఇవ్వొద్దు
- కౌలు రైతులకు 'భరోసా' వర్తింపజేయాలి : స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి
- సమగ్ర భూసర్వే చేపట్టాలని డిమాండ్
- గత ప్రభుత్వ వైఫలాలను పునరావృతం కానివ్వం
- మంత్రులు తుమ్మల, పొంగులేటి వెల్లడి

నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొండలు.. గుట్టలు, రహదారులకు సైతం రైతుబంధు పేరుతో రాష్ట్ర ఖజానాను లూటీ చేసింది.. ఇప్పుడు 10 ఎకరాలకే రైతు భరోసా వచ్చేలా చూడాలి. కొండలు రియల్ ఎస్టేట్ భూములు, రహదారుల భూములకు ఇవ్వొద్దు.. స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు మేరకు కనీస మద్దతు ధర కల్పించాలి. సాగుకు పెరుగుతున్న పెట్టుబడుల దృష్ట్యా ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వే చేయాలి" అని రైతు భరోసా అభిప్రాయ సేకరణలో పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి పట్టణంలో రైతు భరోసా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయం సేకరించారు. క్యాబినెట్ సబ్‌కమిటీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

రైతులు అనేక విషయాలు వారి దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టును అమలు చేయాలని కోరారు. రైతు భరోసాలో భాగంగా భూమిలేని కూలీలకు రూ.12000, కౌలు రైతులకు రూ.25వేల చొప్పున ఇస్తే వారికి భరోసా కలుగుతుందని పలువురు సభ దృష్టికి తెచ్చారు. ఫామ్‌హౌస్‌లు, గుట్టలు, రహదారులకు ఇచ్చే



డబ్బులను కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇవ్వాలని పలువురు సూచించారు. సాగు చేసిన భూములకే రైతుభరోసా ఇవ్వాలి తప్ప పడావు భూములకు ఇవ్వొద్దని అన్నారు. వడగండ్ల ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు రైతులను ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. విత్తనాలు ఎరువులతోపాటు కనీస మద్దతు ధర కల్పిస్తే రైతులు ఉచిత పథకాలు అడగరని నాయకులు అన్నారు. మరికొందరు పట్టాదారులకు 40శాతం ఇస్తే 60 శాతం కౌలుదారులకు భరోసా ఇవ్వాలని కోరారు. ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులకు ఈ పథకం అవసరం లేదన్నారు. ఒకే ఇంట్లో నలుగురు ఉంటే 40 ఎకరాలకు రైతుభరోసా ఇస్తారా అని మరికొందరు ప్రశ్నించారు. మరి కొంతమంది రైతులు అన్నం పెట్టే రైతులకు ఎన్ని ఉచితాలు ఇచ్చినా తక్కువేనని అన్నారు. దేవుడి భూములకు ఇచ్చే భరోసాను సాగుదారులకే ఇవ్వాలని కోరారు. నీళ్లు, నిధులు, ఉచిత విద్యుత్ ఇస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

గత పాలకులు చేసిన తప్పులు చేయకూడదనే..!: మంత్రులు

గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల ఏ పథకమూ నిజమైన లబ్దిదారులకు అందలేదని, ఆ తప్పులు మళ్లీ జరగకూడదనే రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరిస్తున్నామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. ఫామ్‌హౌజ్‌లో కూర్చుని నిర్ణయించి పథకాల అమలు చేస్తే విఫలమవుతాయని రుజువైయిందన్నారు. అందుకే ఏ పథకమైనా ప్రజల ముందు పెట్టి వారి అభిప్రాయం మేరకే అమలు చేస్తామన్నారు. రైతుబంధులో గత ప్రభుత్వం విచ్చలవిడిగా ప్రజాధనాన్ని లూటీ చేసిందని విమర్శించారు. అలాంటి తప్పిదాలు మరోసారి పునరావృతం కానివ్వబోమన్నారు. రైతును రాజును చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఎకరాలకంటే తక్కువ ఉన్న రైతులు 90 శాతం మందికిపైగా ఉన్నారని, వారందరికీ భరోసా కల్పించాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వ్యవసాయ శాఖ కమిషనర్ రంఘునందన్‌రావు, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలు పెరిగాయి. ధరణిలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయలేదు. ముఖ్యంగా రెవెన్యూ, అటవీ భూముల వివాదాలు పరిష్కారం కావాలి. గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి వారికి న్యాయం చేయాలి. ధరణి సమస్యలకు పరిష్కారం కనుగొనాలని కోరారు.

\- సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

కేరళ ప్రజల కల సాకారమైన వేళ...!

(మొదటిపేజీ తరువాయి)

సంఘటన (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వానికి గల అచంచలమైన, తిరుగులేని నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యాధారంగా పరిగణించాల్సి వుంటుంది. 300మీటర్ల పొడవైన అతిపెద్ద భారీ నౌక శాన్ ఫెర్నాండో విజింజం ఓడరేవులో లంగరు వేసింది. ట్రయల్ రన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘ కాలంగా కేరళ ప్రజలు కన్న కల సాకారమైందని వ్యాఖ్యానించారు. ఓడరేవు అనేది ఆర్థికాభివృద్ధికి అతిపెద్ద ప్రొపెల్లర్ అని పేర్కొన్నారు. విజింజం అంతర్జాతీయ ఓడరేవుతో కేరళ అభివృద్ధి చరిత్రలో కొత్త పుట తెరుచుకుందని, కేరళకు కొత్త అధ్యాయం మొదలైందన్నారు. నిజానికి యావత్ దేశానికే ఇదొక గర్వ కారణమన్నారు. ఇటువంటి తరహా ఓడరేవులు ప్రపంచవ్యాప్తంగా చాలా కొద్ది సంఖ్యలోనే వున్నాయన్నారు. దీంతో, అంతర్జాతీయ మ్యాప్‌లో భారత్‌కు స్థానం లభించిందన్నారు. వాస్తవానికి ప్రపంచంలోని అతిపెద్ద ఓడరేవుల్లో విజింజం ఓడరేవు ఒకటి. ఇక పెద్ద సంఖ్యలో ఈ ఓడరేవుకు ఇలాంటి భారీ నౌకలు వస్తాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద నౌకలకు ఆశ్రయం కల్పించే ప్రదేశంగా ఎదిగిందన్నారు. ఇది ట్రయల్ రన్ అయినప్పటికీ, దీంతో ఓడరేవు కార్యకలాపాలు ప్రారంభమైనట్లే. ఇక ఇప్పటి నుండి ఈ పోర్టు పూర్తి స్థాయిలో తన సేవందిస్తుంది. ఓడరేవులన్నింటికీ మదర్ పోర్ట్‌గా వర్ణించదగిన రీతిలో విజింజం పోర్ట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది గర్వకారణమైన క్షణం. అయితే ఇది ఇక్కడితో ఆగిపోరాదని విజయన్ అన్నారు. పోర్టు మొదటి దశ పూర్తయింది. ఇంకా 2,3,4 దశలు పనులు జరుగుతున్నాయని, అవి



పూర్తయితే అప్పుడు ఈ పోర్టు పెద్ద నౌకా కేంద్రంగా మారుతుంది. 2045కల్లా ఇది పూర్తవుతుందని తొలుత అంచనా వేశారు. అయితే, ప్రస్తుతం జరిగిన పనులు తీరు చూస్తుంటే 17సంవత్సరాలు ముందుగానే జరగనుంది. 2028కల్లా పూర్తి స్థాయిలో పోర్టు కార్యకలాపాలు నిర్వహించగలదని తెలుసుకుంటే చాలా సంతోషమనిపిస్తోందని విజయన్ పేర్కొన్నారు. రూ.10వేల కోట్ల మేరా నిధులు కేటాయించడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. షెడ్యూల్ కన్నా 17సంవత్సరాలు ముందుగానే పోర్టు సిద్ధమవడానికి, రాష్ట్రం కాంట్రాక్టుపై సంతకం చేయడానికి ఇది వీలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఓడరేవులు శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రూపకల్పన, నిర్మాణం, ఫైనాన్స్, నిర్వహణ, బదలాయింపు (డిబిఎఫ్‌ఓటి) నమూనాలో బహుళార్థప్రయోజనాలు కలిగిన, రూ.7600కోట్ల వ్యయం కాగల ఈ సీ పోర్ట్ ప్రాజెక్టును అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది.

ఈ ప్రాజెక్టుపై ఏళ్ళ తరబడి చర్చ జరుగుతోంది. వరుసగా వచ్చిన ప్రభుత్వాలు దీన్ని అమలు చేయడానికి గల వివిధ మార్గాలను పరిశీలిస్తూ వచ్చాయి. ఎట్టకేలకు, 2015లో, కేరళలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం మేరకు అదానీ గ్రూపు రూ.2454కోట్లు పెట్టుబడులు పెడుతుంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌గా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరో రూ.1635 కోట్లను సమీకరించాల్సి వుంది. కేరళ ప్రభుత్వం 500 ఎకరాల భూమిని అందచేసింది. డిబిఎఫ్‌ఓటి ఒప్పందం 40ఏళ్ళ పాటు అమల్లో వుంటుంది. కావాలంటే మరో 20ఏళ్ళ పాటు పొడిగించడానికి కూడా నిబంధనలు పొందుపరిచారు.

పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో 20,862 మందికి సీట్ల కేటాయింపు

- సెల్ఫ్‌రిపోర్టింగ్ గడువు 15
- 18 నుంచి పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. 114 పాలిటెక్నిక్ కాలేజీల్లో 29,610 సీట్లున్నాయని తెలిపారు. 20,862 (70.46 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. 8,748 (29.54 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 57 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 13,692 సీట్లుంటే, 11,461 (83.7 శాతం) మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. 2,231 (16.3 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు. 57 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,918 సీట్లుండగా, 9,401 (59.05 శాతం) మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 6,517 (40.95 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఫీజు చెల్లింపునకు గడువు ఈనెల 15 వరకు ఉందని వివరించారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్‌రిపోర్టింగ్ చేసేందుకు గడువు ఈనెల 15 వరకు ఉందని పేర్కొన్నారు. ఈనెల 15,16 తేదీల్లో ఓరియెంటేషన్ తరగతులుంటాయని తెలిపారు. ఈనెల 18 నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

దోస్త్ మూడో విడతలో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 18 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు సంబంధించి మూడో విడతలో విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 18 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ మూడో విడతలో 80,312 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. వారిలో 73,662 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఈనెల 18 వరకు కాలేజీల్లో చేరే అవకాశముందని పేర్కొ న్నారు. ఇప్పటి వరకు కాలేజీల్లో రిపోర్టు చేసిన విద్యార్థులు 1,17,057 మంది ఉన్నారని వివరించారు.

ముగిసిన కురియన్ కమిటీ అభిప్రాయ సేకరణ

- అభిప్రాయాలు పంచుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు
- 21న ఏఐసీసీకి కమిటీ నివేదిక : కురియన్ లేకుండానే ముఖాముఖి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై రెండు రోజులుగా నిర్వహించిన కురియన్ కమిటీ అభిప్రాయ సేకరణ ముగిసింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన సీట్లు రాకపోవడంతో అధిష్టానం నిజనిర్ధారణ చేపట్టింది. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత కురియన్ నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఆ కమిటీ గురు, శుక్రవారాల్లో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముఖాముఖి భేటీలను నిర్వహించింది. మొదటిరోజు లోక్‌సభ అభ్యర్థులు, ఎంపీలతో కురియన్ కమిటీ భేటీ అయ్యింది. రెండో రోజు కురియన్ బంధువులు చనిపోవడంతో ఆయన అకస్మాత్తుగా కేరళకు వెళ్లారు. దీంతో ఎమ్మెల్యేలు, ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో కురియన్ లేకుండానే అభిప్రాయ సేకరణ కొనసాగింది. మిగిలిన ఇద్దరు కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో అభిప్రాయాలు తీసుకున్నారు. గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డితో కూడా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రెండ్రోజులపాటు తీసుకున్న అభిప్రాయాలను కమిటీ విశ్లేషించనుంది. దాని ఆధారంగా ఈనెల 21న ఆ నివేదికను ఏఐసీసీకి సమర్పించనుంది. ఓటమిపై కొంత మంది నేతలు సమగ్రమైన డేటాతో సహా కమిటీకి సమర్పించినట్టు తెలిసింది. లోక్‌సభ నియోజకవర్గాలకు నియమించిన కొంత మంది ఇన్‌చార్జీ మంత్రులు ఎన్నికల్లో జవాబుదారీతనంగా వ్యవహరించలేదంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఇన్‌చార్జీలుగా ఉన్న నియోజకవర్గాలకు సమయం కేటాయించ కుండా, సొంత నియోజకవర్గాలకే పరిమితమయ్యారని ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక క్యాడర్‌ను సక్రమంగా వినియోగించుకోలేకపోయామని వాపోయారు. దీంతో పార్టీకి ఎక్కువ నష్టం జరిగిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్నికల బరి నుంచి పారిపోయి బీజేపీకి ఓట్లు వేయించిందని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్ నేతలు దగ్గరుండి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసేలా ప్రోత్సహించారని వివరించారు. ఎన్నికల్లో పోటీని ద్విముఖ పోటీగా మార్చేసింది...వెరసీ కాంగ్రెస్ పార్టీ ఆశించిన సీట్లను పొందలేకపోయింది.కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉన్న మహబూబ్‌నగర్, చేవెళ్ల, ఆదిలాబాద్, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించకపోవడంతోనే ఓటమి పాలైందనే టాక్ పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నది. కురియన్ కమిటీతో భేటీ అయిన కొంత మంది ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్ల తేడా గురించి అడిగారని తెలిపారు. నిజామా బాద్‌లో పార్టీ ఎందుకు ఓడిపోయిందన్న విషయాన్ని ప్రస్తావించగా, బీఆర్ఎస్ నేతలు బీజేపీకి ఓట్లు వేయించారని చెప్పారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగో పాల్‌రెడ్డి మాట్లాడుతూ భువనగిరిలో మొదట బీజేపీ గెలుస్తుందనే టాక్ వచ్చిందనీ, తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన తర్వాత ఆ ప్రచారం తొలగిపో యిందన్నారు. ఎమ్మెల్యేలమంతా కలిసి కట్టుగా పని చేసి భారీ మెజార్టీ సాధించా మన్నారు.

సుస్థిర అభివృద్ధిలో కేరళ అగ్రగామి

(మొదటిపేజీ తరువాయి)

16 అంశాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరు అంచనా వేసే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) ఇండియా ఇండెక్స్ 2023-24 రిపోర్టును శుక్రవారం నీతి ఆయోగ్ విడుదల చేసింది. ఇందులో ఉత్తరాఖండ్, కేరళ అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలుగా 79 స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచాయి. తమిళనాడు 78 స్కోర్ సాధించి రెండో స్థానంలో ఉంది. గోవా 77 స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచింది. బీహార్ 57 స్కోర్, జార్ఖండ్ 62 స్కోర్, నాగాలాండ్, మేఘాలయ 63 స్కోర్‌లతో అట్టడుగున ఉన్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో చండీగఢ్, జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, ఢిల్లీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఇండియా 71 స్కోర్‌ను నమోదు చేసుకుంది. లింగ సమానత్వంలో 49 స్కోర్ నమోదైంది. అలాగే ఆకలిలో 52 స్కోర్ వచ్చింది. ఈ రెండు విభాగాల్లోనే అత్యంత తక్కువ స్కోర్ నమోదయ్యాయి. ఎస్‌డిజి కింద నిర్దేశించిన 16 లక్ష్యాలలో ఇండియా గణనీయమైన మెరుగుదలను సాధించడంలో మెరుగుపడిందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పేదరికం నిర్మూలనలో రెండూమూడు స్థానాల్లో తెలంగాణ, ఏపీ

ఎస్‌డీజీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ 75 స్కోర్‌తో ఆరో స్థానంలో నిలిచాయి. పేదరికం నిర్మూలనలో తెలంగాణ (91 స్కోర్), ఏపీ (86 స్కోర్)తో రెండూ మూడు స్థానంలో నిలిచాయి. ఆకలి సూచీ (జీరో హంగర్)లో ఏపీ 67 స్కోర్‌తో పదో స్థానంలో నిలిచింది. తెలంగాణ 58 స్కోర్‌తో దారుణంగా ఉంది. ఆరోగ్యంలో ఏపీ 78 స్కోర్‌తో ఆరో స్థానంలో ఉండగా, తెలంగాణ 73 స్కోర్‌తో తొమ్మిదో స్థానంలో నిలిచింది. నాణ్యమైన విద్యలో ఏపీ 52 స్కోర్‌తో 15వ స్థానంలో అత్యంత దారుణంగా ఉండగా, తెలంగాణ మాత్రం 64 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది.లింగ సమానత్వంలో ఏపీ 51 స్కోర్‌తో 12వ స్థానంలో ఉండగా, తెలంగాణ 49 స్కోర్‌తో 13వ స్థానంలో నిలిచింది. మంచినీరు, పారిశుధ్యంలో ఏపీ 91 స్కోర్‌తో 8వ స్థానంలో ఉండగా, తెలంగాణ 90 స్కోర్‌తో 9వ స్థానంలో నిలిచింది. సరసమైన, క్లీన్ ఎనర్జీలో ఏపీ, తెలంగాణ 100 స్కోర్‌తో అగ్రగామిగా నిలిచాయి. మంచి పని విధానం, ఆర్థిక వృద్ధిలో ఏపీ 69 స్కోర్‌తో పదో స్థానంలో ఉండగా, తెలంగాణ 84 స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచింది.పరిశ్రమలు, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాల్లో ఏపీ 49 స్కోర్‌తో 14వ స్థానంలో ఉండగా, తెలంగాణ 60 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

అసమానతల తగ్గుదలలో ఏపీ 67 స్కోర్‌తో 12వ స్థానంలో ఉండగా, తెలంగాణ 65 స్కోర్‌తో 14వ స్థానంలో నిలిచింది. స్థిరమైన నగరాలు, కమ్యూనిటీల్లో ఏపీ 85 స్కోర్‌తో ఆరో స్థానంలో ఉండగా, తెలంగాణ 86 స్కోర్‌తో ఐదో స్థానంలో నిలిచింది. వినియోగం, ఉత్పత్తిలో ఏపీ 93 స్కోర్‌తో నాలుగో స్థానంలో ఉండగా, తెలంగాణ 75 స్కోర్‌తో 13వ స్థానంలో నిలిచింది. వాతావరణ చర్యలలో ఏపీ 70 స్కోర్‌తో ఏడో స్థానంలో ఉండగా, తెలంగాణ 59 స్కోర్‌తో 14వ స్థానంలో నిలిచింది.బ్లూ వాటర్ (సముద్రం, మెరైన్ వనరులు)లో ఏపీ 95 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇందులో సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలే ఉన్నాయి. అటవీ భూమిని కాపాడటం (లైఫ్ ఆన్ ల్యాండ్)లో ఏపీ 77 స్కోర్‌తో 11వ స్థానంలో ఉండగా, తెలంగాణ 82 స్కోర్‌తో ఏడో స్థానంలో నిలిచింది. శాంతి, న్యాయం, బలమైన సంస్థలల్లో ఏపీ 79 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో ఉండగా, తెలంగాణ 67 స్కోర్‌తో 17వ స్థానంలో నిలిచింది.

పసికందు విక్రయం

- కాసులకు కక్కుర్తి పడిన కన్న తండ్రి
- భార్య ఫిర్యాదుతో విషయం వెలుగులోకి .. నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

కాసులకు కక్కుర్తిపడిన కన్నతండ్రి.. భార్యకు తెలియకుండా 16 రోజుల పసికందును లక్ష రూపాయలకు అమ్మేశాడు. పాప తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుజూసింది. ఈ దారుణ ఘటన హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అస్మాబేగం, మహమ్మద్ ఆసిఫ్ భార్యాభర్తలు. బండ్లగూడ నసీబ్‌నగర్‌లో



నివాసముంటున్నారు. వారికి కుమారుడు, 16 రోజుల పాప ఉన్నారు. ఆసిఫ్ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా వారింటికి సమీపంలోనే కర్నాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన పాషా ఉంటున్నాడు. గుల్బర్గాలో ఉండే అతని అన్న మీనాదిసాబ్‌కు పెండ్లయ్యి 9 ఏండ్లు గడుస్తున్నా సంతానం లేదు. దాంతో తన అన్నకు ఒక పాపను కొనివ్వాలన్న ఉద్దేశంతో చాంద్ సుల్తానా అనే మహిళ ద్వారా అస్మాబేగం కూతురు ఉందని తెలుసుకున్నాడు. ఆ పాపను అమ్మాలని తండ్రి మహమ్మద్ ఆసిఫ్‌ను చాంద్‌సుల్తానా అడిగింది. అందుకు అంగీకరించిన ఆసిఫ్ మహమ్మద్ లక్ష రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. కూతురిని భార్యకు తెలియకుండా ఇచ్చేశాడు.

చాంద్ సుల్తానా మధ్యవర్తిత్వం వహించినందుకుగాను రూ.లక్ష 50 వేలు మీనాదిసాబ్ నుంచి తీసుకుంది. మరో రూ.లక్ష మహమ్మద్ ఆసిఫ్‌కు ఇచ్చింది. కూతురు కనిపించకపోవడంతో భర్తపై అనుమానంతో అస్మాబేగం బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆసిఫ్‌ను అరెస్టు చేసి విచారించగా అసలు విషయం బయటపడింది. వెంటనే పోలీసులు గుల్బర్గాకు వెళ్లి మినాదిసాబ్, పాషా, చాంద్ సుల్తానాను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పసికందును తల్లికి అప్పగించారు.

15న కలెక్టరేట్ల ఎదుట ప్రదర్శనలు

30న ఇందిరాపార్క్ వద్ద మౌనదీక్ష : టాప్ర రాష్ట్ర కన్వీనర్ స్వరాజ్‌కుమార్ భట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ప్రదర్శనలను నిర్వహిస్తామని టాప్ర రాష్ట్ర కన్వీనర్ స్వరాజ్‌కుమార్ భట్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మౌనదీక్ష చేపడతామని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టాప్ర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టాప్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే అమలు చేయాలని కోరారు.

బిజినెస్

మార్కెట్ల నూతన రికార్డ్

సెన్సెక్స్ 80,500కు చేరిక

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన రికార్డ్‌లను చేరాయి. శుక్రవారం సెషన్‌లో ఐటి స్టాక్స్ భారీగా పెరగడంతో ఓ దశలో సెన్సెక్స్ 1000 పాయింట్లు పైగా లాభపడి 80,893కు చేరింది. ఇంట్రాడేలో నిఫ్టీ 500 పాయింట్ల పైగా లాభంతో 24,592 వద్ద నమోదయ్యింది. టిసిఎస్ షేర్లు 7 శాతం పైగా పెరగడంతో పాటు ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్ స్టాక్స్‌కు డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలోనే తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 622 పాయింట్లు పెరిగి 80,519 వద్ద ముగిసింది. నిఫ్టీ 196 పాయింట్లు లాభపడి 24,502 వద్ద నమోదయ్యింది. బిఎస్ఇలో మిడ్ క్యాప్ సూచీ 0.22 శాతం తగ్గగా.. స్మాల్ క్యాప్ 0.13 శాతం పెరిగింది. సెన్సెక్స్‌లో టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ సూచీలు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా, ఐసిఐసిఐ బ్యాంక్, టైటాన్ షేర్లు అధికంగా నష్టపోయాయి.

నికోన్ నుంచి సరికొత్త కెమెరా



హైదరాబాద్ : ప్రముఖ ఫోటోగ్రఫీ ఉత్పత్తుల కంపెనీ నికోన్ శుక్రవారం హైదరాబాద్‌లో తన జడ్6క్కీక్కీక్కీ ఫుల్‌ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరాను ఆవిష్కరించింది. దీని ద్వారా ఇమేజింగ్‌ను విప్లవాత్మకంగా మార్చనున్నట్లు నికోన్ ఇండియా ఎండి సజ్జన్ కుమార్ తెలిపారు. పూర్తి ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరా పోర్ట్‌ఫోలియో పట్ల తమ నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. సరికొత్త ఈ కెమెరా ధరను రూ.2,47,990గా నిర్ణయించామన్నారు.

ఏసర్ బ్రాండ్‌తో ఇండ్‌కల్ టెక్నాలజీ జట్టు

న్యూఢిల్లీ : సాంకేతిక సంస్థ అయిన ఇండ్‌కల్ టెక్నాలజీస్ కొత్తగా గ్లోబల్ ఐటిసి దిగ్గజం ఏసర్ సంస్థతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంతో ఇండ్‌కల్ భారతదేశంలో ఏసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్ ఫోన్ల రూపకల్పన, తయారీ, పంపిణీ చేస్తుందని ఇండ్‌కల్ టెక్నాలజీస్ సిఇఒ ఆనంద్ దూబే తెలిపారు. ఈ వెంచర్ ద్వారా రూ.15,000- 50వేల మధ్య విలువ చేసే స్మార్ట్‌ఫోన్లపై దృష్టి సారించనున్నామన్నారు.

ఎకోఫీ, మహీంద్రా సంస్థ భాగస్వామ్యం

ముంబయి : విద్యుత్ వాహనాలు, సోలార్ రంగాల్లోని చిన్న, మధ్యతరహా సంస్థలకు రుణాలు అందించే ఎకోఫీ తాజాగా మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయినా మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్ఎంఎంఎల్)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. దీంతో విద్యుత్ త్రిచక్ర వాహనాలకు వినూత్న ఫైనాన్సింగ్ సొల్యూషన్స్‌ను అందించనున్నట్లు పేర్కొంది. ఈ రంగంలో పెరుగుతున్న ఇవి త్రిచక్ర వాహనాల డిమాండ్‌కు ప్రోత్సాహాన్ని అందించాలని నిర్దేశించుకున్నట్లు ఎకోఫీ సహ వ్యవస్థాపకులు, సిఇఒ రాజశ్రీ నంబియర్ పేర్కొన్నారు. దేశంలో ఇవి త్రిచక్ర వాహనాల వినియోగాన్ని పెంచడం తమ భాగస్వామ్య ఉద్దేశ్యమని ఎంఎల్ఎంఎంఎల్ సిఇఒ సుమన్ మిశ్రా తెలిపారు.

ఎఐ టూల్స్‌తో ఒప్పో రెనో 12 సిరీస్ ఫోన్లు

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ ఒప్పో కొత్తగా ఎఐ టూల్స్‌తో కూడిన రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. కృత్రిమ మేధా కలిగిన రెనో12, రెనో 12ప్రో ఫోన్లను అందుబాటులోకి తెచ్చినట్లు శుక్రవారం ఆ సంస్థ తెలిపింది. ప్రధాన కెమెరా 50 ఎంపి టెలిఫోటో సహా 2ఎంపి, 8ఎంపి కెమెరాలతో ఆవిష్కరించినట్లు పేర్కొంది. సెల్ఫీ కోసం 32 ఎంపి కెమెరాను కలిగి ఉంది. రెనో 12 ప్రో 12జిబి ర్యామ్, 256జిబి స్టోరేజ్ ధరను రూ.36,999గా, 12జిబి, 256జిబి ఒప్పో రెనో ధను రూ.32,999గా నిర్ణయించింది.

జ్యుడీషియల్ పే కమిషన్ సిఫారసులు అమలు చేయరేం?

16 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సమన్లు

న్యూఢిల్లీ: 'రెండో నేషనల్ జ్యుడిషియల్ పే కమిషన్' (ఎస్ఎన్‌జేపీసీ) సిఫారసులను అమలు చేయని 16 రాష్ట్రాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఆర్థికశాఖ కార్యదర్శులు ఆగస్టు 23న స్వయంగా కోర్టుకు హాజరుకావాలని సమన్లు ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసుపై తదుపరి విచారణ చేపట్టింది. కోర్టు సహాయకునిగా (అమికస్ క్యూరీ) వ్యవహరిస్తున్న న్యాయవాది కె.పరమేశ్వర్ ఇచ్చిన నివేదికను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సర్వోన్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.పదవీవిరమణ పొందిన జ్యుడిషియల్ అధికారులకు పే కమిషన్ సిఫారసుల మేరకు పింఛను బకాయిలు, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో ఈ రాష్ట్రాల అలసత్వం తదితర అంశాలపై అసహనం వ్యక్తంచేసింది. ఎస్ఎన్‌జేపీసీ సిఫారసుల అమలుకు ఏడుసార్లు అవకాశాలిచ్చినా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అనేక రాష్ట్రాలు విఫలమయ్యాయని, ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శులు వ్యక్తిగతంగా హాజరు కాకపోతే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సీజేఐ ధర్మాసనం హెచ్చరించింది.

బీహార్‌లో పిడుగుపాటుతో ఐదుగురు మృతి

పాట్నా : బీహార్‌లోని పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో పిడుగుపాటుకు గురై ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో మూడురోజుల క్రితం పిడుగులు పడి 12 మంది మరణించారు. దీంతో, ఈ ఘటనల వల్ల మృతుల సంఖ్య 17కి పెరిగింది. బత్నాహా గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడటంతో అక్కడ పనులు చేస్తున్న మకున్ సూఫీ, అషినా ఖాతూన్, రు, ఖుతౌనా మరణించారు. దుమారియా గ్రామంలో సంగీతాదేవి, మంజుదేవిలు కూడా పిడుగుపాటుకు గురై చనిపోయారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మృతులకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తరారీ బ్లాక్ పరిధిలోని బర్కాగావ్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో పిడుగుపడటంతో 18 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారంతా సదర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 38 మంది పిడుగుపాటుతో మరణించిన ఘటనలు మరవకముందే బీహార్‌లోనూ అలాంటి ఘటనలే జరగడం గమనార్హం.

రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతు సంఘం వినతి



సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్‌రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ రైతు సంఘం ప్రతినిధుల బృందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతుల సమస్యలపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలంటూ తెలంగాణ రైతు సంఘం కోరింది. ఈమేరకు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్‌రెడ్డిని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. పుల్లయ్య, నాయకులు తంబూరి ఉమామహేశ్వరరెడ్డి, అళ్ళ నాగేశ్వరరావులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

వినతిపత్రంలోని ముఖ్యాంశాలివే...

- భూమాతగా ప్రకటించిన ధరణిలో 20 లోపాలున్నట్లు గత బీఆర్ఎస్ క్యాబినెట్ కమిటీ అంగీకరించింది. మొత్తం రాష్ట్రంలో 4.5 లక్షల మంది డబ్బులు చెల్లించి ధరఖాస్తులు పెట్టుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భూ సమస్యలపై గల లోపాలను సవరించి అందరికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. సమగ్ర భూ సర్వే నిర్వహించి, గ్రామ సభలు జరిపి లోపాలను సవరించాలి.
- రెవెన్యూ రికార్డుల్లో కౌలు రైతులు, వాస్తవ సాగుదారుల పేర్ల నమోదు చేసేందుకు రెవెన్యూ రిజిస్టర్‌ల్లో 'కాలం'ను ఏర్పాటు చేయాలి. వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలి. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలి.
- 'కేంద్ర పీఎం ఫసల్ బీమా' నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం (2020 నుంచి) వైదొలిగింది. అప్పటి నుంచి ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రాష్ట్ర రైతులకు ఎలాంటి పరిహారం రావడంలేదు. రాష్ట్రంలో ఏటా రూ.5వేల కోట్ల విలువగల పంటలు దెబ్బతింటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించి, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి.
- మొదటి ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలి. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులను రానున్న ఏడాదిలో పూర్తి చేయడానికి బడ్జెట్ కేటాయింపులు చేయాలి. కాళేశ్వరం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై 'హైకోర్టు జడ్జి' ద్వారా విచారణ జరిపించాలి. నేరస్తులను శిక్షించాలి. రెండో సాగునీటి సమర్థవంత వినియోగానికి, సాగునీటి ఇంధన ఖర్చు పొదుపుకు సూక్ష్మ సాగునీటి పథకాలు అవసరం. వీటి వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. తాజా వ్యవసాయ ఖర్చులు, ధరల విధాన నివేదిక ప్రకారం ఇప్పటికే సూక్ష్మ సాగునీటి పథకాలు పలు రాష్ట్రాల్లో 70శాతానికి మించిందని పేర్కొంటూ, మిగిలిన రాష్ట్రాల్లో వీటి అమలును వేగవంతం చేయాలని సూచించింది. ఇలా చేయాల్సిన రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. సబ్సిడీపై మైక్రోఇరిగేషన్ (డ్రిప్, స్ప్రింక్లర్) పథకాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచి వీటిని ఉధృతంగా రాష్ట్రంలో అమలు చేయాలి. ఐడిసి నిర్వహణలోని లిఫ్ట్ పథకాలను రిపేర్లు చేయాలి.
- రాష్ట్రంలో కల్తీ విత్తనాల వ్యాపారం వ్యవస్థీకృతంగా సాగుతున్నది. ఏటా 4,5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. కల్తీ విత్తనాలను పట్టుకోవడమే తప్ప నేరస్తులపై ఎలాంటి శిక్షలు ఉండడం లేదు. నష్టపోయిన రైతులకు పరిహారాలు లేవు. ప్రభుత్వం వెంటనే 'రాష్ట్ర విత్తన చట్టా'న్ని రూపొందించాలి. కల్తీ విత్తన సంస్థల కంపెనీలను రద్దు చేయాలి.
- గత రెండేండ్లుగా వ్యవసాయ శాఖ నుంచి 'యాక్షన్ ప్లాన్' ప్రకటన వెలువడలేదు. వెంటనే వార్షిక ప్రణాళికలు ప్రకటించాలి. ఈ వార్షిక ప్రణాళికలో ప్రాంతాల భూసారాన్ని, రాష్ట్ర అవసరాలను బట్టి పంటల విధానాన్ని రూపొందించాలి.
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన రైతు భరోసా పథకం ప్రకారం ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుల ఖాతాల్లో వేయాలి. వానాకాలం పంటలకు సంబంధించి ఎకరాకు రూ.7,500 చొప్పున వాస్తవ సాగుదారులందరికీ వారి ఖాత్లాలలో జమ చేయాలి.
- రాష్ట్ర స్థాయి 'వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణయాక కమిషన్' ఏర్పాటు చేసి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు, బోనస్ అమలు చేయాలి. వడ్లకు క్వింటాల్ రూ.2,800 సహా మొక్కజొన్న తదితర పంటలకు మ్యానిఫెస్టోలో ప్రకటించిన ధరలను అమలు చేయాలి. అందుకు వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీలకు డైరెక్షన్ ఇవ్వాలి. లీటర్ పాలకు రూ.5 బోనస్ అమలుకు నిధులు విడుదల చేయాలి.
- రూ.2లక్షల లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలి. రిజర్వుబ్యాంక్ ఆదేశాల ప్రకారం బ్యాంకులు తమ డిపాజిట్లలో 18 శాతం 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం రైతులకు రుణాలు ఇవ్వాలి.
- అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అర్హులకు హక్కు పత్రాలు ఇవ్వాలి. ఫారెస్టు అధికారుల వేధింపులను ఆపాలి.
- మూసేసిన చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించేందుకు చర్యలు ప్రారంభించాలి.
- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం రైతుల నుంచి భూసేకరణ చేస్తున్న సందర్భంగా 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలి. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు 81,254 మంది దూరం

- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించింది 99,170 మంది
- ఎప్‌సెట్‌కు 1.80 లక్షల మంది అర్హత
- ధ్రువపత్రాల పరిశీలనకు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 99,170 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని వివరించారు. వారిలో 60,713 మంది అభ్యర్థులు 33,19,866 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం వరకు గడువుందని పేర్కొన్నారు. ఈనెల 15 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఈనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పెత్తందార్ల క్రౌర్యం

కర్నూలు జిల్లాలో దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు



ఆదోని : కర్నూలు జిల్లా ఆదోని మండలంలో పెత్తందారులు చెలరేగిపోయారు. భూ వివాదం నేపథ్యంలో దళిత మహిళపై ట్రాక్టర్ ఎక్కించి హత్య చేశారు. ఆమెకు సహాయంగా వచ్చిన మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచారు. అనంతరం గ్రామం విడిచి పారిపోయారు. శుక్రవారం పట్టపగలు జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. పోలీసులు నిందితులపై ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి, గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ గుండమ్మ(55) అదే గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిల సమీప బంధువు (పిన తల్లి) తిరుపతమ్మ వద్ద కొంత కాలం క్రితం నాలుగు ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. అయితే, ఆ పొలంలో తమకు వాటా ఉందంటూ రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కోర్టులో దావా వేశారు. భూ వివాదం కోర్టు పరిధిలో ఉండగానే పొలం దున్నేందుకు రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లారు. వీరిని గుండమ్మ అడ్డు కున్నారు. కొద్ది సేపు వివాదం అనంతరం పొలం దున్నడానికి తీసుకువచ్చిన ట్రాక్టర్‌ను గుండమ్మపైకి ఎక్కించారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు తోడుగా వెళ్లిన పురుషోత్తంరెడ్డి అనే మరో వ్యక్తిపైనా రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి అనుచరులు దాడి చేసి గాయపరిచారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన పురుషోత్తం రెడ్డిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండమ్మ మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ కేసులో రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డితోపాటు మరో నలుగురు వ్యక్తులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: కేవీపీఎస్

దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప డిమాండ్ చేశారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో గుండమ్మ మృతదేహాన్ని కేవీపీఎస్ నేతలు సందర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.



లా కోర్సులో మనుస్మృతిపై యూటర్న్

- ఈ ప్రతిపాదనను తిరస్కరించిన ఢిల్లీ యూనివర్సిటీ వీసీ

న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలనే ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్రం యూటర్న్ తీసుకుంది. న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలనే ప్రతిపాదనను ఢిల్లీ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గురువారమే తిరస్కరించారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం వెల్లడించారు. లా కోర్సులో మనుస్మృతిను చేర్చే ప్రసక్తే లేదని చెప్పారు. ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ గురువారం న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించే ప్రతిపాదనను తిరస్కరించారని పేర్కొన్న ప్రధాన్, రాజ్యాంగం యొక్క నిజమైన స్ఫూర్తిని నిలబెట్టడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన్ అన్నారు. హైదరాబాద్‌లో విలేకరులతో 'నిన్న, ఢిల్లీ యూనివర్సిటీలో మనుస్మృతిని లా ఫ్యాకల్టీ కోర్సులో భాగం చేస్తున్నారని మాకు కొంత సమాచారం వచ్చింది. దీంతో నేను ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌తో విచారించి మాట్లాడాను. న్యాయశాస్త్ర ఛాప్టర్‌లో కొంతమంది లా ఫ్యాకల్టీ సభ్యులు కొన్ని మార్పులు చేస్తారని ఆయన నాకు హామీ ఇచ్చారు' అని ప్రధాన్ తెలిపారు.'అకడమిక్ కౌన్సిల్‌లో అటువంటి ప్రతిపాదనకు ఎలాంటి ఆమోదం లేదు. నిన్ననే, వైస్ ఛాన్సలర్ ఆ ప్రతిపాదనను తిరస్కరించారు. మనమందరం మన రాజ్యాంగానికి, భవిష్యత్ దృక్పథానికి కట్టుబడి ఉన్నాము. రాజ్యాంగం యొక్క నిజమైన స్ఫూర్తిని నిలబెట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అక్కడ ఏదైనా స్క్రిప్ట్‌లోని వివాదాస్పద భాగాన్ని చేర్చే ప్రశ్నే లేదు' అని అన్నారు.ఈ ప్రతిపాదనపై శుక్రవారం జరిగిన అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చినట్లు, ఈ ప్రతిపాదనపై కొంత మంది ఫ్యాకల్టీ నుంచి తీవ్ర విమర్శలు వచ్చినట్లు సమాచారం.మొదటి, తృతీయ సంవత్సరాల విద్యార్థులకు మనుస్మృతిని బోధించడానికి సమావేశంలో ప్రతిపాదించారు. కాగా, మరోవైపు ఈ ప్రతిపాదనను విరమించికున్నట్లు ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



నేపాల్ నదిలో కొట్టుకుపోయిన బస్సులు

- 66మంది గల్లంతు
- సురక్షితంగా ముగ్గురు ఒడ్డుకు

ఖాట్మండు : నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో కొట్టుకుపోవడంతో ఆ బస్సుల్లో ప్రయాణిస్తున్న 66మంది గల్లంతయ్యారని అధికారులు శుక్రవారం తెలిపారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో, కొండచరియలు విరిగిపడి దారులు మూసుకుపోవడంతో ప్రయాణికులను కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలు కూడా ముందుకు సాగలేదని ప్రభుత్వ ప్రతినిధి ఖిమా నందా భూసల్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో బస్సులు కొట్టుకుపోయాయి. సమాచారం తెలిసిన వెంటనే అదనపు సహాయక సిబ్బందిని, భద్రతా బలగాలను అక్కడకు పంపారు. ప్రమాదం జరిగినపుడు ఒక బస్సులో 24మంది మరో బస్సులో 42మంది వున్నారు. అయితే మార్గమధ్యంలో బస్సులో మరికొంతమంది ఎక్కివుండవచ్చని భావిస్తున్నట్లు భూసల్ చెప్పారు. జూన్ నుండి సెప్టెంబరు వరకు వర్షాకాలంలో నేపాల్‌లో పర్వత ప్రాంతాలు ఎక్కువ కారణంగా భారీగా వర్షాలు కురుస్తాయి. ఈ సీజనులో కొండచరియలు విరిగిపడడం కూడా సర్వసాధారణమే. గత కొద్ది రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలతో నదులన్నీ పొంగి పొర్లుతున్నాయి. మధ్యాహ్నం వరకు బస్సుల ఆచూకీ తెలియరాలేదు. బహుశా బస్సులు మునిగిపోయి త్రిశూలి నదిలో దిగువ ప్రాంతానికి కొట్టుకుపోయి వుండవచ్చునని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

నేపాల్ ప్రధాని విచారం

ఈ ప్రమాదాల పట్ల నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేశంలో ఇటీవల భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గాలింపు చర్యల్లో ప్రభుత్వ సహాయక బృందాలు నిమగ్నమయ్యాయని తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. గత 24గంటల్లో నేపాల్‌వ్యాప్తంగా పలు జిల్లాలో వర్షాలు, కొండచరియలు విరిగిపడి 17మంది మరణించారని హోం మంత్రి రబి లమిచానె పార్లమెంట్‌కు తెలిపారు. బస్సులు నదిలో కొట్టుకుపోయిన ఘటనలో 500మందికి పైగా అదనపు సిబ్బంది సహాయక చర్యల నిమిత్తం పంపినట్లు చెప్పారు. కాగా ముగ్గురు ప్రయాణికులు ఈదుకుంటూ సురక్షితంగా వచ్చారని వారికి ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నామని అధికారులు చెప్పారు.



బదిలీలలు

ప్రభుత్వశాఖల్లో రచ్చరచ్చ

- భారీగా పైరవీలు
- సాగునీటిశాఖలో అనర్హులకు పోస్టింగ్
- వైద్యారోగ్యశాఖలో గందరగోళం
- 40 శాతంతో ఉద్యోగుల్లో ఆందోళన
- టీచర్ల ట్రాన్స్‌ఫర్లు పూర్తి
- హెచ్‌వోడీలకు చుక్కలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయా సర్కారీ శాఖల్లో సందడి కనిపిస్తున్నది. ఎలాగైనా పదోన్నతి సాధించాలని కొందరు, అనుకూల ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకోవాలని మరికొందరు పడరాని పాట్లు పడుతున్నారు. సీఎం రేవంత్ సర్కారు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఇటీవల ఎత్తేయడంతో అన్ని ప్రభుత్వ శాఖల్లో అలజడి రేగింది. హెచ్‌వోడీలు కసరత్తు ప్రారంభించారు. ఏ శాఖకు ఆ శాఖ బదిలీలపై ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశాయి. ఇప్పటికే ఆర్థిక, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు ఇతర శాఖలు ఉత్తర్వులు ఇచ్చుకున్నాయి. మొత్తంగా శాఖల్లో కేవలం 40 శాతం మంది ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయాలని మార్గదర్శకాలు జారీ అయిన సంగతి తెలిసిందే. ఆయా శాఖల్లో కింది నుంచి పైదాక ఉన్న ఉద్యోగుల బదిలీలకు అర్హులను గుర్తించే బాధ్యతను ఆయా శాఖల హెచ్‌వోడీలకు అప్పగించారు. ఆ మేరకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈనెల 20 లోపు బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పటికే విద్యాశాఖలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియకు మరకలంటాయి. నిబంధనలకు విరుద్ధంగా వెబ్‌కౌన్సిలింగ్ జరిగిందనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. హెచ్ఆర్‌ఏ ప్రాంతాలను బ్లాక్ చేసి అనుకూలమైన వారికి ఇచ్చుకున్నారనే ఆరోపణలూ వస్తూనే ఉన్నాయి. రాష్ట్ర రాజధాని చుట్టూ ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఈ తరహా వ్యవహారాలు అధికంగా జరిగాయంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 317 జీవో సమస్యలు ఒకవైపు వేధిస్తుండగా, పైరవీలతో టీచర్లకు నష్టం జరిగిందనే విమర్శలు మరోవైపు వినిపిస్తున్నాయి. ఆ శాఖలో ఇంకా ఉద్యోగుల బదిలీలు చేయాల్సి ఉంది. సాగునీటి పారుదల శాఖలో అనర్హులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. నలుగురు చీఫ్ ఇంజినీర్లకు నిబంధనలకు విరుద్ధంగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీల విషయంలో గందరగోళం నెలకొంది. సీనియార్టీ జాబితాను రూపొందించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంజినీరింగ్ శాఖల్లో వందలాది మంది ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీల కోసం ఎదురుతెన్నులు పడుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖలో ఇప్పటికే గుట్టుచప్పుడు కాకుండా కొంతమందికి ప్రమోషన్లు ఇచ్చినట్టు విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలమైన పోస్టింగులను తెచ్చుకునేందుకు అధికార పలుకుబడి కలిగిన కొందరు ఉద్యోగులు మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. వాటిని హెచ్‌వోడీలకు ఇచ్చి తమకు మంచి పోస్టింగ్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ తరహా లేఖలతో హెచ్‌వోడీల తలబొప్పికడుతున్నట్టు సమాచారం. ప్రధానంగా ఇంజినీరింగ్ శాఖల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. 40 శాతం బదిలీల జాబితాలో పేర్లు లేకపోతే ట్రాన్స్‌ఫర్లు చేయబోమనీ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ట్రాన్స్‌ఫర్లు చేస్తామని హెచ్‌వోడీలు చెబుతున్నారు. శుక్రవారం సిఫారసు లేఖలతో మిషన్ భగీరథ హెచ్‌వోడీపై తీవ్ర ఒత్తిళ్లు రాగా 'తాము ప్రభుత్వ జీవో ప్రకారమే వ్యవహరిస్తామని' సదరు ఉన్నతాధికారి స్పష్టం చేశారు. బదిలీలకు ఎవరికైతే అర్హతలు ఉంటాయో, వారికే వర్తింపజేస్తాం..



ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండవని పేర్కొన్నారు. మెడికల్ గ్రౌండ్స్‌పై బదిలీలను కోరుకునేవారికి సైతం గట్టిగా సమాధానం చెప్పారు. జీవోలో పేర్కొన్న నిబంధనల మేరకే బదిలీలు చేస్తామని చెప్పారు. ఇదిలావుంటే రోడ్లు, భవనాల శాఖలో పరిస్థితి మరోలా ఉంది. సర్వీసు నిబంధనలు సరిగ్గా లేవని, తమకు న్యాయం చేయాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకుని మొర పెట్టుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో సర్వీసు నిబంధనలు సక్రమంగా లేకపోవడం, వీటిని అడ్డంపెట్టుకుని పైరవీల బ్యాచ్ ఇష్టానుసారం పోస్టింగ్‌లు తెచ్చుకోవడంతో ఒక్కో అధికారి నాలుగైదుసార్లు ఎక్స్‌టెన్షన్లు తెచ్చుకుంటూ ఆయా శాఖల్లో హవా నడిపిస్తున్నారనేది నగ్న సత్యం.

సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా అలేఖ్య బాధ్యతల స్వీకరరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అలేఖ్య పుంజల రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు మాట్లాడుతూ అలేఖ్య నాట్యరంగానికి గుర్తింపు తెచ్చిందని అభినందించారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పద్మావతి, రాజ్ సింగ్ ఠాకూర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువలతో ఆమెను సత్కరించారు. అలేఖ్య చైర్ పర్సన్‌గా కళలకు ప్రాధాన్యతనిస్తారనీ, నృత్య, నాటక, సంగీత రంగాలకు ఉత్తేజం తెస్తారని కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు భద్రత కల్పించండి

- డీజీపీ జితేందర్‌కు టీఎన్జీవో విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన డీజీపీ జితేందర్‌ను టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ కార్యాలయంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, నగర అధ్యక్షులు శ్రీకాంత్, భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను శ్లాబులను మార్చండి

- బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులివ్వాలి
- ధర్మేంద్రప్రధాన్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి తపస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదాయపు పన్నులో స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచాలనీ, శ్లాబు రేట్లలో మార్పులు తేవాలని తపస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎన్‌సీటీఈ నిబంధనలను మార్చాలనీ, బీఈడీ అర్హత ఉన్న ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎం/ఎల్‌ఎఫ్ఎల్ పదోన్నతులను కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాలను అందజేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు మేలు చేకూర్చేలా చూస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, సహాధ్యక్షులు బెండి ఉష, అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

19 మంది ప్రభుత్వ ప్లీడర్ల నియామకం

- జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో 19 మంది ప్రభుత్వ ప్లీడర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు జీవో 399ని ప్రభుత్వ కార్యదర్శి ఆర్.తిరుపతి శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ న్యాయాధికారుల నియామక నిబంధనల మేరకే వీటిని చేపట్టినట్టు జీవోలో పేర్కొన్నారు. ప్రభుతత్వ ప్లీడర్లుగా నియమితులైన వారిలో డివి చలపతిరావు, ఎం. షాలిని, మహ్మద్ హుస్సేన్, బి. కృష్ణ, ఎస్.సుమన్, ఈ.పూర్ణచందర్‌రావు, జి.తిరుపతిరెడ్డి, అనంతుల రవీందర్, ఎ.అనంతసేన్‌రెడ్డి, ఎం.విజ్ఞేశ్వర్‌రెడ్డి, టి.వెంకట్‌రాజు, పి. శ్రావన్ కుమార్‌గౌడ్, జి. భాస్కర్,య హెచ్. రాజేష్‌కుమార్, గడ్డం కిరణ్‌కుమార్, ఈ వెంకటరెడ్డి, కె.మణి దీపిక, ప్రదీప్‌కుమార్ శ్రీరాంభట్ల, సుజాత కూరపాటి ఉన్నారు.

అర్హులైన వారినే ప్రిన్సిపాల్‌గా పదోన్నతులివ్వాలి

- టిగారియా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే డిగ్రీ లెక్చరర్లకు ప్రిన్స్‌పాళ్లుగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం(టిగారియా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శారద, డాక్టర్ సత్యశ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సర్వీసు నిబంధనల ప్రకారం పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాటు, పీహెచ్‌డీ అర్హత ఉండాలనీ, ఐదు సంవత్సరాలు డిగ్రీ లెక్చరర్‌గా బోధనానుభవంతో పాటు డిపార్ట్ మెంటల్ పరీక్షలు పాసై ఉండాలని తెలిపారు. అలాంటి వారు మాత్రమే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులకు అర్హులని పేర్కొన్నారు. పదోన్నతుల్లో జరుగుతున్న జాప్యం వల్ల అర్హత లేని వారు కూడా డిగ్రీ ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు ఇవ్వాలని సంస్థ మీద ఒత్తిడి తేవడం సమంజసం కాదని వారు హితవు పలికారు. ఈ విషయంలో సంస్థ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజనుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగం దుర్మార్గం

- ఎస్సై, ఎమ్మెల్యే పీఏపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పాలకుర్తి ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి విజయేందర్ రెడ్డి అరాచకాలపై సోషల్ మీడియాలో ప్రశ్నిస్తూ పోస్ట్ పెట్టాడనే కారణంగా గిరిజన యువకుడైన సురేష్ నాయక్ పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్సై జగదీశ్వర్, దీనికి కారకుడైన విజయేందర్ రెడ్డిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాంనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామ శివారు తండాకు చెందిన మాలోత్ సురేష్ నాయక్ పాలకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి విజయేందర్ రెడ్డి అరాచకాలపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడనే కారణంతో తొర్రూరు పోలీసు స్టేషన్‌కు సురేష్ నాయక్‌ను పిలిపించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. . ఆ ఎస్సై నవ హక్కులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రజాస్వామ్యవాదులు స్పందించాలని కోరారు. ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణికి 546 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 546 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ సమస్యలపై 115, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 79, విద్యుత్ శాఖపై 50, హౌజింగ్‌కు సంబంధించి 64, మైనార్టీ సంక్షేమ శాఖకు శాఖకు 41, ఇతర శాఖలకు సంబంధించి 197 దరఖాస్తులు అందినట్టు ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య తెలిపారు.

మూడు ఎడిషన్లలో క్రెడాయబిలిటీ లక్ష్యం 'హౌస్ ఫర్ ఆల్'...

- ఆగస్టు 2 నుంచి 4 వరకు హైటెక్స్‌లో...
- 9 నుంచి 11 వరకు కొంపల్లిలో..
- 23 నుంచి 15 వరకు నాగోల్‌లో...
- కొనుగోలుదారులు, బిల్డర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'క్రెడాయబిలిటీ' పేరుతో మూడు ఎడిషన్లలో ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు వీ రాజశేఖరరెడ్డి, ప్రెసిడెంట్-ఎలక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీ జగన్నాథరావు మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి మూడు దిక్కులా మూడు ప్రాపర్టీ షోలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పురోగమనంలో ఉన్నదనీ, దాన్ని మరింత వృద్ధిచేసేందుకు ఈ షోలు ఉపయోగపడతాయని తెలిపారు. ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తొలి ప్రదర్శన ఉంటుందనీ, దీన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్స్‌లో నిర్వహించే ప్రాపర్టీ షోను ఐటీ శాఖ మంత్రి డీ శ్రీధర్‌బాబు, ఆగస్టు 23 నుంచి 25 వరకు ల్యాండ్ నాగోల్ మెట్రో స్టేషన్‌లో జరిగే ప్రదర్శనను రెవెన్యూ శాఖ మంత్రి పీ శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారని వివరించారు. ఈ ప్రదర్శనల ఏర్పాటు ద్వారా కొనుగోలుదారులు, బిల్డర్ల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం 'క్రెడాయ్' ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ ప్రాపర్టీ షోల్లో రూ.35 లక్షల నుంచి ఇండ్ల నమూనాలు ప్రారంభమవుతాయన్నారు.

అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో, నాణ్యమైన సౌకర్యాల కల్పనతో, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అనుమతులతో కూడిన వెంచర్లు ఇక్కడ ప్రదర్శిస్తారని చెప్పారు. ఎగ్జిబిషన్లలో ఇప్పటికే 10 శాతం స్టాల్స్ బుకింగ్స్ పూర్తయ్యాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగితే మంచిదేననీ, కానీ అది హైదరాబాద్‌తో పోటీ పడలేదని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి విలువలు పెంచే ప్రయత్నం చేస్తున్నదనీ, అది అవసరమే అయినా, దానిపై శాస్త్రీయ అధ్యయనం చేసి, కొద్ది రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోల్లో ఎక్కడా ప్రీ లాంచింగ్ వెంచర్లు ఉండబోవన్నారు. పూర్తి పారదర్శకంగా ఇండ్లు, ఇండ్ల స్థలాల అమ్మకాలు జరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ చాప్టర్ పరిధిలో 35 లక్షల యూనిట్లు అందుబాటులో ఉన్నాయనీ, కొన్ని సర్వే సంస్థలు పేర్కొన్నట్టు తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏమాత్రం వెనుకబడి లేదని స్పష్టం చేశారు. హౌస్ ఫర్ ఆల్ సేవతో కూడిన కాన్సెప్ట్‌తో 'క్రెడాయ్' పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఉపాధ్యక్షులు ఎమ్ శ్రీకాంత్, బీ ప్రదీప్‌రెడ్డి, సీజీ మురళీమోహన్, జాయింట్ సెక్రటరీ గూడూరు నితీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ హస్తం

- తాజాగా కండువా కప్పుకున్న ప్రకాశ్‌గౌడ్
- గ్రేటర్ తర్వాత లైన్లో ఉమ్మడి మెదక్
- అసెంబ్లీ సమావేశాల్లోపే పూర్తికానున్న తతంగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేరికలపై అధికార కాంగ్రెస్ మరింత దూకుడును ప్రదర్శిస్తోంది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్ ప్రధాన ప్రతిపక్షం నుంచి ఒక్కో ఎమ్మెల్యేను లాక్కోవటంపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు ఆ పార్టీ గూటికి చేరిపోగా.. త్వరలోనే మరికొందరు ఆ జాబితాలో చేరిపోనున్నారు. అన్నీ కుదిరితే శనివారం లేదా ఆదివారం గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన సుధీర్‌రెడ్డి (ఎల్‌బీ నగర్), కేపీ వివేకానంద (కుత్బుల్లాపూర్), మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్) కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని సమాచారం. కొద్ది రోజుల క్రితం వీరందరూ హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసిన సంగతి విదితమే. కాంగ్రెస్‌లో వారు చేరబోతున్నారనటానికి ఇది బలం చేకూరుస్తోంది. పార్టీ మారే విషయమై ఆయా ఎమ్మెల్యేలు ఆయనతో అప్పుడే చర్చించినట్టు తెలిసింది. అయితే తమ తమ నియోజకవర్గాల అభివృద్ధికి సహకరించాలని కోరటానికే మంత్రిని కలిశామంటూ వారు అప్పుడు చెప్పటం గమనార్హం. కానీ తాజాగా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం సీఎం నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన రేవంత్‌తో భేటీ అయ్యారు. అనంతరం సీఎం.. ప్రకాశ్‌గౌడ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే ప్రకాశ్ గౌడ్ సీఎంతో మంతనాలు జరిపారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన అప్పుడే నిర్ణయించుకున్నా కొన్ని కారణాలతో అది వాయిదా పడుతూ వచ్చింది. 'సమయం వచ్చినప్పుడు పిలుస్తాం..సిద్ధంగా ఉండండి...' అంటూ రేవంత్ సూచించటంతో ఆయన ఇప్పటి వరకూ వేచి చూసి అధికార పార్టీలో జాయినయ్యారు. ఆయన కంటే ముందే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ గూటికి చేరగా, ఇప్పుడు ప్రకాశ్ గౌడ్ దాన్ని కొనసాగించారు. ఇదే కోవలో గ్రేటర్‌కు చెందిన మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం హస్తం గూటికి చేరబోతున్నారనే సంకేతాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సొంత జిల్లా అయిన ఉమ్మడి మెదక్‌లో కూడా ఆ పార్టీకి 'ఫిరాయింపుల గండం' పొంచి ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకరరెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారని సమాచారం. వాస్తవానికి రేవంత్ సర్కార్ కొలువుదీరగానే బీఆర్ఎస్‌లోని అందరికంటే ముందుగానే వీరు సీఎంతో భేటీ అయ్యారు. ఆ సమయంలోనే వీరు పార్టీ మారబోతున్నారంటూ ప్రచారం జరిగినా... అదేమీ లేదంటూ ఎమ్మెల్యేలు కొట్టి పారేశారు. వీరిలో కొందరికి కేసులు, ఒకరిద్దరికి వ్యాపారాలకు సంబంధించిన హామీలు రావటం ఆలస్యమవటంతో చేరికలు కూడా ఆలస్యమవుతున్నాయని తెలిసింది. సీఎం నుంచి సంబంధిత అంశాలపై స్పష్టత రాగానే వీరు కూడా గాంధీ భవన్ మెట్లెక్కుతారని సీనియర్ నేత ఒకరు తెలిపారు. వీరు కాంగ్రెస్ కండువా కప్పుకున్న అనంతరం ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా అదే బాట పట్టనున్నారని ఆయన తెలిపారు.

బీజేపీఎల్పీలో ఆ పార్టీ ఎమ్మెల్యేల భేటీ

- బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించాం : మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఆవరణంలోని బీజేపీ ఎల్పీ కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు శుక్రవారం భేటీ అయ్యారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజాసింగ్, కె.వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్‌సూర్యనారాయణ గుప్తా పాల్గొ న్నారు. సమావేశం అనంతరం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు.

ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికపై సాగునీటి శాఖ సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వైఫల్యం ఎన్డీఎస్ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపై సాగునీటి శాఖ సమీక్షించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌదలో మరోసారి పూర్తిస్థాయిలో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు చర్చించారు. ఈ నివేదికను పూర్తిస్థాయిలో అమలుచేయించేందుకు ఏజెన్సీపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నారు. ఈఎన్సీ జనరల్ బి.అనిల్‌కుమార్, ఈఎన్సీ ఓఅండ్ఎం నాగేందర్‌రావు, రామగుండం సీఈ కె.సుధాకర్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరమ్మతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే పూర్తిస్థాయిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ ప్రతినిధులు అమితాబ్ మీనా, మనీష్‌గుప్తా, డాక్టర్ మందిర సైతం ఈ భేటిలో పాల్గొన్నారు. నివేదిక అమలుపై నిపుణులతో పాటు ఎన్డీఎస్ఏ అధికారులతోనూ మరోమారు చర్చించనున్నారు.

గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభించకపోవటంపై కేటీఆర్ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిర్మాణం పూర్తయినా గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించకపోవటంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఢిల్లీకి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టు తిరగటంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా? అని సీఎం రేవంత్‌ను ఆయన ప్రశ్నించారు. ఆ ఫ్లై ఓవర్ ను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే ప్రారంభించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై అవగాహన లేని అసమర్థ ప్రభుత్వం, నాయకత్వం ఉన్నందునే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రజా సమస్యల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నదని విమర్శించారు.

త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం

- ఆ పార్టీలో మిగిలేది నలుగురే..
- బీఆర్ఎస్ కార్యాలయాన్ని కేటీఆర్ కార్పొరేట్ కంపెనీలా నడిపారు : ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు



నవతెలంగాణ- హిమాయత్‌నగర్

కాంగ్రెస్ పార్టీలో 15 రోజుల్లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం కాబోతుందని, ఆ పార్టీలో మిగిలేది నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్, ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగుతాయని తెలిపారు. బీఆర్ఎస్ కార్యాలయాన్ని కేటీఆర్ కార్పొరేట్ కంపెనీలాగా నడిపారని, కేసీఆర్‌ను కలవాలంటే ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ దొరికేది కాదని ఆరోపించారు. ఒకవేళ దొరికినా గంటల తరబడి వెయిట్ చేయించే వారని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారని, అందుకే విలువ లేని చోట ఉండలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఉండేదని, బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చేద్దామంటే అసలు ఫండే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు వేల కోట్లు దోచుకున్నారని, వాటి వివరాలు త్వరలో బయట పెడతానని అన్నారు. ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ మేకపోతు గంభీరం చూపిస్తోందని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యురాలు కవిత జైల్లో ఉంటే ఆమెను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారన్నారు.

'సాలార్జంగ్' భూములు కొనొద్దు

- వారసుడు అబ్దుల్ వహెబ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-బంజారాహిల్స్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని పీర్జాదిగూడలో ఇటీవల వివాదాస్పదమైన ప్రభుత్వ సంరక్షణలో ఉన్న సాలార్జంగ్‌కు చెందిన స్థలాలను ఎవరూ కొనుగోలు చేయొద్దని సాలార్జంగ్ వారసుడు అబ్దుల్ వహెబ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో న్యాయవాది జితేందర్ రెడ్డి, బొల్లం లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నిజాం తదనంతరం హైదరాబాద్ ప్రధానిగా పనిచేసిన సాలార్జంగ్‌కు పీర్జాదిగూడ ప్రాంతంలో 362 ఎకరాల 15 గుంటల భూమి ఉందన్నారు. కాగా, సదరు భూమిపై కొందరు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి విక్రయిస్తున్నారని అన్నారు. సదరు స్థలాలను కొనుగోలు చేసిన వారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. క్రయవిక్రయాలను ఆపాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయాలు జరగకుండా అడ్డుకట్ట వేసి పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోకుండా కాపాడాలని కోరారు. ఈ విషయమై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవిస్తామని చెప్పారు.

'అగాధం అంచున ప్రపంచం'

ప్రముఖ రాజకీయ శాస్త్రవేత



ప్రపంచం ఒక పెద్ద పరివర్తనకు లోనవుతున్నందున అగాధం అంచున ఉందని ప్రముఖ రష్యన్ రాజకీయ శాస్త్రవేత్త అలెగ్జాండర్ డైన్కిన్ హెచ్చరించాడు. 60 సంవత్సరాల క్రితం క్యూబా క్షిపణి సంక్షోభం సమయంలో ప్రపంచం చివరిసారిగా విపత్తుకు దగ్గరగా వచ్చిందని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ ఎకానమీ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్‌గా ఉన్న డైన్‌కిన్ గురువారం మాస్కోలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో చెప్పాడు. 21వ శతాబ్దంలో యుద్ధం-శాంతి' పేరుతో రాబోయే లియో టాల్‌స్టాయ్ ఇంటర్నేషనల్ పీస్ ప్రైజ్ అవార్డు వేడుకకు సన్నాహాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. వందల సంవత్సరాలుగా ప్రపంచ క్రమం ఐరోపా చేత, ఇటీవల దాకా అమెరికా చేత నిర్ధారించబడిందని డైన్కిన్ పేర్కొన్నాడు. అయితే, ఉక్రెయిన్‌లో సంఘర్షణ తరువాత, రష్యా, చైనా, భారతదేశం భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ అంతర్జాతీయ నిర్మాణం మొదటిసారిగా రూపుదిద్దుకుంటుందని, రాజకీయ తూర్పు రాజకీయ పశ్చిమకు సమాన భాగస్వామిగా ఉంటుందని ఆయన వాదించాడు. యూరోపియన్ యూనియన్, అమెరికావలె కాకుండా, చైనా, భారతదేశం ఉక్రెయిన్ వివాదంపై రష్యాను ఖండించడానికి నిరాకరించాయి. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ వారం మాస్కోకు వెళ్లి 2022లో శత్రుత్వం చెలరేగిన తర్వాత తొలిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యాడు.

అమెరికా ప్రపంచంపై తన ప్రభావం కోల్పోవడంతోపాటు ఆ దేశ ప్రస్తుత ప్రెసిడెంట్ జో బైడెన్ వృద్ధాప్యంతో వచ్చిన మానసిక సమస్యల కారణంగా పశ్చిమ దేశాలు నిర్లక్ష్యంగా చర్యలు, నిర్ణయాలు తీసుకోవడానికి దారితీస్తుందని డైన్కిన్ హెచ్చరించాడు. బుధవారంనాడు బైడెన్ వాషింగ్టన్‌లో నాటో శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభించి అమెరికా నేతృత్వంలోని మిలిటరీ కూటమి ఎప్పటికంటే శక్తివంతమైనది అని, రష్యా, ఉక్రెయిన్ మధ్య వివాదంలో తీవ్రమైన సవాలును ఎదుర్కొంటున్నదని ప్రకటించాడు.

ప్రపంచ సమకం

పశ్చిమ దేశాల ఉక్రెయిన్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి రష్యా హాజరు కాదు



దౌత్యవేత్త

ఉక్రెయిన్‌లో కొత్త శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావడానికి రష్యాకు ఎటువంటి ప్రణాళిక లేదు. అది కీవ్ శాంతి సూత్రాన్ని ప్రోత్సహించడానికి మాత్రమే ఉద్దేశింప బడుతుందని రష్యా ఉప విదేశాంగ మంత్రి మిఖాయిల్ గలుజిన్, అటువంటి సంఘటనలలో అల్టిమేటంలా వినిపించే కథనాన్ని వివరించారు. జూన్‌లో, స్విట్జర్లాండ్ ఉక్రెయిన్ శాంతి శిఖరాగ్ర సమావేశం అనే పేరుతో జరిగిన సమావేశానికి 90 కంటే ఎక్కువ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి రష్యాను ఆహ్వానించనందున చైనాతో సహా కొన్ని దేశాలు చర్చలలో చేరడానికి నిరాకరించాయి. మాస్కో ఈ ప్రక్రియలో భాగం కావాలని వాదించాయి.

ఖైదీల మార్పిడి, అణు, ఆహార భద్రతతో సహా వ్లాదిమిర్ జెలెన్స్కీ 'శాంతి సూత్రం'లోని మూడు అంశాలపై సమావేశం దృష్టి సారించింది. 2022 చివరలో కీవ్‌చే ముందుగా ప్రతిపాదించబడిన ఈ ప్రతిపాదన ఉక్రెయిన్ తన స్వంత భూభాగాలుగా పేర్కొన్న అన్ని ప్రాంతాల నుండి రష్యా వైదొలగాలని కూడా పిలుపునిచ్చింది. మాస్కో దీనిని వాస్తవికతకు దూరంగా ఉందని కొట్టిపారేసింది. స్విస్-ఆతిథ్య శిఖరాగ్ర సమావేశానికి హాజరైన అనేక దేశాలు తుది ప్రకటనపై సంతకం చేయలేదు లేదా తరువాత వారి సంతకాలను ఉప సంహరించుకోలేదు. ఈ సంవత్సరం చివరిలో అలాంటి రెండవ ఈవెంట్‌ను నిర్వహించాల నుకుంటున్నట్లు చెప్పాడు. భవిష్యత్తులో జరిగే చర్చల్లో రష్యా ఏదో ఒక ప్రతినిధిని కలిగి ఉండ వచ్చని కూడా ఆయన అన్నాడు. అయితే, గురువారం ఆర్ ఐ ఏ నోవోస్టికి ఇచ్చిన ఇంటర్వ్యూలో, రష్యాకు హాజరయ్యే ఆలోచన లేదని గలుజిన్ నొక్కిచెప్పాడు. కీవ్ పాలన, దాని పాశ్చాత్య మాస్టర్లు స్విట్జర్లాండ్‌లో జరిగిన శాంతి శిఖరాగ్ర సమావేశం కోసం తమను తాము పునరావాసం చేసుకోవాలని భావిస్తున్నారని మాకు తెలుసు. తిరిగి అదే విధమైన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రయత్నిస్తారు అని అతను చెప్పాడు. కీవ్ వైఖరిలో స్పష్టమైన మార్పు ఉన్నప్పటికీ, మాస్కో ఇప్పటికీ డెడ్-ఎండ్ అల్టిమేటం లాంటి జెలెన్స్కీ ఫార్ములా ద్వారా ముందుకు వెళ్లాలని ఫలించని ఆశతో మునుపటి వాక్చాతుర్యాన్ని వింటున్నట్లు దౌత్యవేత్త పేర్కొన్నాడు. ఉక్రెయిన్, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఇతర కార్యక్రమాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నాయి... ఇది మరొక మోసం అని కూడా ఆయన ఆరోపించారు. మేము అలాంటి అల్టిమేటమ్‌లను అంగీకరించము. అలాంటి సమావేశాలలో పాల్గొనబోము అని గలుజిన్ నొక్కిచెప్పాడు.

నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు కీవ్ రెండవ శిఖరాగ్ర సమావేశాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు అమెరికాలోని మూలాలను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ రాసింది. రిపబ్లికన్ ప్రెసిడెన్షియల్ ఫ్రంట్‌రన్నర్ డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశం ఉన్నందున ఇది ఉక్రెయిన్‌కు అత్యవసరంగా మారిన విషయాన్ని సూచిస్తుందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ట్రంప్ ఎన్నికైతే ఉక్రెయిన్ వివాదాన్ని 24 గంటల్లో పరిష్కరిస్తానని పదేపదే చెబుతున్నాడు. అలాగే ఉక్రెయిన్‌కు అమెరికా ఇస్తున్న సైనిక మద్దతును ట్రంప్ విమర్శిస్తున్నాడు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ చిగురింత నరసింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ నామినేటెడ్ పదవి ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సీఎంను కలసిన వారిలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బాల్ లింగని జంగయ్య, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందీహిల్స్ కాలనీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి బాలాజీ మిఠాయి బండార్ షాపును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, బీఆర్ఎస్ అధ్యక్షులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మీర్ పేట్

సమిష్టి పోరాటాల ద్వారానే తెలంగాణ వచ్చింది



- జాతీయ స్థాయిలో తెలంగాణను నిలబెట్టింది పోరాటాలే
- ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ - చైతన్యపురి

సమిష్టి పోరాటాల ద్వారానే ప్రత్యేక తెలంగాణ వచ్చిందే తప్ప ఒక్కరి వల్ల రాలేదని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్ భవనంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మెన్ కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యమకారులు ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రొఫెసర్ కోదండరాం, విమలక్కలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం సమాజంలో ఉద్యమకారులు ఒక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆ ఉద్యమకారులు ఏదో ఒక సాయం అందుతుందేమోనని ఆశ, గుర్తింపు కావాలని కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన రాజకీయ పక్షాలే నిర్వయించలేదని ప్రతి ఒక్కరూ సంఘటితమై పోరాటాలు చేసిన ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాధన జరిగిందన్నారు. ప్రజలు తమకు తాముగా స్వచ్ఛందంగా ఉద్యమం చేశారని, బలిదానాలు చేసి కూడా తమ ఆకాంక్షను అప్పుడున్న ప్రభుత్వాలకు తెలియజేయడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ కూడా ఒక రాష్ట్రం కోసం ఇలాంటి ఉద్యమం జరిగిన దాఖలాలు లేవని అన్నారు. బలిదానాలపై జాతీయస్థాయిలో సరిగా అధ్యయనం జరగలేదని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు స్వీయ రాజకీయ అస్తిత్వం కోసమే పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారన్నారు. పోరాటాల ద్వారానే తెలంగాణకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఉద్యమ సంఘాలన్నీ కలిపి ఒక జేఏసీగా ఏర్పాటు చేసుకుందామని అన్నారు. ఎల్బీనగర్‌లో జరిగిన సంఘటనలను పుస్తక రూపంలో తీసుకువచ్చి ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఉద్యమకారులపైనే ఉందన్నారు. ఎవరైనా చరిత్రను మర్చిపోతే భవిష్యత్ ఉండదని, తెలంగాణ వస్తే బాగుపడతామనే ఉద్దేశంతోటే అందరూ పోరాటం చేశారని చెప్పారు. గత పదేండ్ల పాలనలో ఉద్యమకారులకు సరైన గౌరవం గుర్తింపు దక్కలేదన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మెన్ సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ ఉద్యమకారుల గుర్తింపు, బాధ్యతలను కోదండరాం సార్‌కు అప్పగిస్తామని అన్నారు. అసలైన నికార్సైన ఉద్యమకారులకే న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇస్తానని హామీ ఇచ్చిందని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేవీ రంగా రెడ్డి, కప్పాటి పాండు రంగారెడ్డి, పల్లె వినయ్, బీరెల్లి వెంకటరెడ్డి, శ్రవణ్, ఖలీల్, కాచాం సుష్మా తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' కేసుల్లో
లేడి కండక్టర్లను సస్పెండ్ చేయడం సరికాదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ మహిళా కండక్టర్లు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, జీరో టికెట్స్ ఇచ్చే సందర్భంలో జరుగుతున్న చిన్న చిన్న సమస్యలపై కండక్టర్లను సస్పెండ్, రిమూవల్ చేయడం సరికాదని, ఇది చాలా అన్యాయమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహమ్మద్ తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సు నిర్వహించారు. అంతకుముందు ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, నాగన్న గౌడ్, టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మహమూద్ జీ.అబ్రహం, జయ, కల్పన, ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర నాయకులు సునీల్, బెన్ సుశీల్, జక్కుల మల్లేష్, హాఫీజ్ ఖాన్, సుధాకర్, ఎల్.రమేష్, కె. సురేందర్, ఎం.మనోహర్ పాల్గొని.. మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మహిళా కండక్టర్ల పనిభారంతో పాటు వారి అధికారుల జులుం ప్రదర్శిస్తున్నారని గుర్తించారు. నెలకు కనీసం మూడు రోజులు సెలవు ఇవ్వడం లేదని, రాత్రి 7గంటల లోపు డ్యూటీలు ఇవ్వకపోగా.. హార్డ్ డ్యూటీలు చేయిస్తున్నారని, చాలాచోట్ల మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని గుర్తించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.



- ఇది చాలా అన్యాయం..తీవ్రంగా ఖండిస్తున్నాం
- మహిళలపై కనికరం చూపకుండా హార్డు డ్యూటీలు వేయడం దుర్మార్గమైన చర్య
- టీజీఎస్‌ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా కీలకం
- తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సులో టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సయ్యద మహమూద్

అనంతరం సయ్యద్ మహమూద్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ గతంలో చేసిన విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ ఎండీ కండక్టర్లకు మహాలక్ష్మి కేసుల నుంచి మినయింపు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ ఇది ఎక్కడ అమలు కావడం లేదన్నారు. మహిళా కండక్టర్లకు సెకండ్ షిఫ్ట్‌లో లేట్ అవర్స్ డ్యూటీలు వేస్తున్నారని, వారి ఇన్‌కమింగ్ అర్ధరాత్రి 12 గంటలకు అయిపోతున్నదని తెలిపారు. వెంటనే ఇలాంటి డ్యూటీలను నిలిపివేయాలని ఆయన కోరారు. జిల్లాలు, సిటీ డిపోల నుంచి మహిళా కండక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన వారందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ నాయకులు, విశ్లేషకులు పీఎస్ మూర్తి మాట్లాడుతూ మహిళా సమస్యలకు సంబంధించి పలు పరిష్కార మార్గాలను సూచించారు. ఆర్.డి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీజీఎస్‌ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా ప్రధానమైనదని, వారి సేవలను కొనియాడారు. టీజీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ అదనపు జనరల్ సెక్రటరీ అబ్రహం మహాలక్ష్మి పథకం జయప్రదంగా అమలు చేస్తున్నారన్నారు. మహిళ నాయకురాలు జయ, కల్పనా మాట్లాడుతూ మహిళా కండక్టర్లకు కష్టమైన డ్యూటీస్ వేసి.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. లేడీ కండక్టర్ల పట్ల అమానుషంగా ప్రవర్తించడమే కాకుండా అర్ధరాత్రి డ్యూటీస్ చేయిస్తున్నారని వారు మండిపడ్డారు. ఇవి మానుకోకపోతే టీజీఎస్ ఆర్టీసీ లేడీ కండక్టర్లు ఒకరోజు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ సహాయ సహకారాలు అవసరమని వారు కోరారు.



అనాథలకు సేవ చేయడం అదృష్టం : గిరి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో ఎంతో మంది అనాథలకు ఆశ్రయం కల్పించి..మానవతా హృదయంతో సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు గిరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం గట్టు గిరి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి మతి స్థిమితం లేని, రోడ్లపై జీవనం సాగిస్తున్న అనాథలను చేరదీసి వారికి సేవ చేస్తున్ననట్టు తెలిపారు. చిత్తూర్ జిల్లా, మాధవరం మండలం, బండివాండ్ల గ్రామానికి చెందిన బందిలి కుమారస్వామికి (44) మతిస్థిమితం సరిగ్గా లేదన్నారు. చిత్తూరులో రైలు ఎక్కి కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగి, రోడ్ల పైన తిరుగుతూ 5 రోజుల కిందట బాలాపూర్ మండలం, నాదర్గుల్ గ్రామంలోని వంశీదర స్కూల్ లోనికి వెళ్లి స్కూల్ యాజమాన్యాన్ని ఇబ్బంది పెట్టడంతో ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారని చెప్పారు.

పోలీసులు వెంటనే ఆ విషయాన్ని మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి తెలియజేయడంతో వెంటనే కుమారస్వామిని ఆశ్రమానికి తీసుకువచ్చినట్టు తెలిపారు. 3 రోజులు పౌష్టికహారం, మెరుగైన వైద్యం అందించిన తర్వాత మానసిక స్థితి కుదుటపడడంతో అతను అడ్రస్ చెప్పినట్టు తెలిపారు. వెంటనే కుమారస్వామి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ కృష్ణయ్య సమక్షంలో కుమారస్వామిని తన కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తెలిపారు. అనంతరం కుమారస్వామి కుటుంబ సభ్యులు గట్టు గిరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల ఎస్ఐ కృష్ణయ్య, ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి, కుమారస్వామి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్

నవతెలంగాణ - మీర్‌పేట్



సీజనల్ వ్యాధుల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహ న్ ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఫ్రై డే.. డ్రై డే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మీర్‌పేట్ పరిధిలోని 15వ డివిజన్ పరిధిలో ఉన్న మిథులానగర్ కాలనీలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను, ఇంటి ఆవరణలో మనం పెంచుకునే చెట్ల కుండీలలో ఉండే చెత్తను తొలగించాలని సూచించారు. రోడ్ల పైన నీరు నిలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ సూపర్వైజర్ ఇంద్రసేనా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు హారతి వెంకటేశ్వర్లు, కాలనీ కార్యదర్శి ఫణిరాజ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-నాగోల్

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని మమతానగర్ కాలనీకి చెందిన మురళీకృష్ణ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో బాధితునికి రెండు లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శుక్రవారం బాధితుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి సహాయనిధి పేదలకు ఓ వరం అని, వారి ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వివిధ రోగాల బారిన పడి, ప్రమాదాలకు గురైన వారు మెరుగైన వైద్యాన్ని పొంది..ఆరోగ్యవంతులుగా ఉండేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తా లక్ష్మారెడ్డి, చీర శ్రీనివాస్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వన మహోత్సవంలో మల్‌రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ ఫేస్ -1లో అర్బన్ బయోడైవర్సరీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అర్బన్ బయోడైవర్సరీ చైర్మెన్ మల్లారెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా హరితమయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డిప్యూటీ బయో డైవర్సిటీ డైరెక్టర్ చంద్రశేఖరరావు, సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్, రాష్ట్ర నాయకులు వేదరి యోగేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి, ఇంద్రప్రస్థ కాలనీ ఫేస్ -1 ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ గౌడ్, గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద తొలగించాలని వినతి



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పరిధిలోని సిద్ధివినాయక నగర్, ఎస్ఎస్ ఆర్‌నగర్ కాలనీల ప్రజలు వీధి కుక్కల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటి నుండి రక్షణ కల్పించాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వీధి కుక్కలు కాలనీలలో స్వైరవిహారం చేస్తూ పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా కరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మా కాలనీలో ముగ్గురు చిన్న పిల్లలను కరిచాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపైన తిరగాలంటే ప్రజలు భయపడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ రామ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కలుగజేసుకొని వీధి కుక్కల బారి నుంచి మమ్ములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందజేసిన వారిలో సిద్ధి కాలనీ అధ్యక్షుడు జే ఆశీర్వాదం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కాలనీవాసులు జగన్ రామ్ రెడ్డి, బాల్ రెడ్డి, మల్లేష్, సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల జాగ్రత్తలపై సమావేశం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి అధ్యక్షతన పురపాలక శాఖ, ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై(డెంగ్యూ, మలేరియా) తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వాణిరెడ్డి మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అందుకోసం మున్సిపల్ సిబ్బంది మురికి నీటిలో దోమలు పెరగకుండా టెమిఫాస్ స్ప్రేను ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. అన్నీ వార్డులలో నీటి నిల్వలు లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వైద్య అధికారి మాట్లాడుతూ వర్షా కాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జపానిస్ ఇన్సెఫలిట్స్ వ్యాధి ప్రభలకుండా దీనికి సంబంధించిన వ్యాక్సిన్ ఏ ఎన్ఎంల ద్వారా 1సంవత్సరం నుండి 15సంవత్సరాల వరకు వయసు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. డెంగ్యూ, ఇతర వ్యాధులను ఏఎన్ఎంల పరిధిలో గుర్తించినట్లయితే తక్షణమే మున్సిపల్ కమిషనర్, మెడికల్ ఆఫీసర్ కు తెలియచేసి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆయేషా తనవీర్, మెడికల్ ఆఫీసర్ డా. జి. బాలామణి, సి హెచ్ ఓ, ఏఎన్ఎంలు, వార్డ్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, శానిటేషన్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ భవనంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సెక్రెటరీ హరిచందన దాసరితో శుక్రవారం రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. అనంతరం రాంరెడ్డి.. ఎల్బీనగర్-మల్కాపూర్ జాతీయ రహదారిలో వనస్థలిపురం పనామా గోడౌన్, ఆటో నగర్ మరియు హయత్ నగర్‌లో నిర్మిస్తున్న అండర్ పాస్‌లను ఎర్త్ వాల్‌లకు బదులుగా కాలమ్ స్ట్రక్చర్‌తో నిర్మించడానికి కావాల్సిన అదనపు నిధులు సమకూర్చవల్సిందిగా కోరుతూ మంత్రి వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

బాలాపూర్ ప్లంబర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మీర్‌పేట్



బాలాపూర్ మండలం ప్లంబర్స్ అసోసియేషన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కె నరేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహా, ఉపాధ్యక్షుడు వెంకటేష్, సహాయ కార్యదర్శి హాలీమ్, కోశాధికారిగా జి మూర్తితో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి.. ప్లంబర్స్ అసోసియేషన్ కార్యాలయం కోసం స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, సభ్యులు మహేష్ కుమార్, బి అభిలాష్, కే బాల్ రెడ్డి, అశోక్, రాముడు, కె శీను, కే కాశన్న, మౌల, ఎస్ ఆంజనేయులు, జి అంజి, బి గోపి, బి మల్లేష్, రఫీక్, శ్రీశైలం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం అని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని 3వ డివిజన్‌లో న్యూ మధురానగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను స్థానిక కార్పొరేటర్లు రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డిలతో కలిసి శుక్రవారం మేయర్ పరిశీలించారు. తర్వాత పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు చేపట్టి.. బోనాల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు మాజీ జడ్పీటీసీ సత్యనారాయణ, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు నవ్వారు మల్లారెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకులు రామిడి శూరకర్ణరెడ్డి, ఏనుగు తిరుమల్ రెడ్డి, కుంచె నాగేందర్ గౌడ్, బోయపల్లి వెంకట్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, బీజేపీ పార్టీ నాయకులు శూరకర్ణారెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, వివిధ కాలనీల ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



18వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తాం : సునీల్

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డును అభివృద్ధిలో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నట్టు కౌన్సిలర్, పీసీసీ సభ్యులు కాకుమాను సునీల్ అన్నారు. కమ్మగూడలోని స్మశానవాటికలో రూ.20లక్షలతో చేపట్టిన నూతన స్నానాల గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. యూజీడీ, సీసీ రోడ్లు, తాగునీటి వసతులు అందిస్తున్నామన్నారు.వార్డు ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువు తాతిరెడ్డి జయరాజు, సహగురువు మాదాను ఆరోగ్య స్వామి, చర్చ్ కమిటీ సభ్యులు కాకుమాను ఆరోగ్యం, అడ్డగట్ల మరియరాజు, కాకుమాను అంకిత్, గ్రామ పెద్దలు భోనగిరి మరియన్న, కాకుమాను మార్తయ్య, 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకుమాను రాజు, పోలిశెట్టి వినయ్, ఆకురాతి రాకేష్, రమేష్, ప్రకాష్, థామస్, జోహార్, సంతోష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





మాసబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య భవన్‌లో నాగారి ప్రీతం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా పదవి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, సూర్నగంటి విజయ్ కుమార్, బొల్లపల్లి కుమార్, చిత్రం మధు,తిరుమలేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌ను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పూల బొకేను అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సభ

నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, శ్రీలత, సీతాలతలకు ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ఆధ్వర్యంలో శుక్రవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆ ఉపాధ్యాయులు చేసిన సేవలు, విద్యార్థులకు నేర్పిన విద్యా బుద్ధులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీజనల్ వ్యాధులపై ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గోషామల్ సర్కిల్ -14 ఏ ఎంహెచ్ఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌ల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులుపై అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమలు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురుగునీరు, నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారాన్ని పురస్కరించుకొని డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోషామాల్ సర్కిల్ -14డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్,, స్కూలు ప్రిన్సిపల్ బ్రదర్ షాజహాన్ ఆంటోనీ, యు సీడీసీఓ సమ్మయ్య, ఎండమాలజీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సంగీత నాటక అకాడమీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పుంజాల అలేఖ్య వినయ్ కుమార్‌ను రవీంద్ర భారతిలో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలను తెలిపిన తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు యువక మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏస్.పి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు జి.నవీన్ కుమార్, కార్యవర్గ సభ్యులు జిల్లా మనోజ్ కుమార్ ఇతర సభ్యులు.. నవతెలంగాణ-ధూల్‌పేట్

చైర్మెన్ మెట్టు సాయికుమార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్‌ను కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న గోషామాల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా తదితరులు

దేవాలయాలకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంలోని ఆషాడ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఎంటోమెంట్ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న అన్ని డివిజన్ పరిధిలోని 72 దేవాలయాల చెక్కులను నియోజకవర్గ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ ప్రభాకర్ చేతుల మీదుగా దేవాలయాల నిర్వాహకులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల తహసీల్దార్ ప్రేమ్ కుమార్, నగర బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, లాల్ సింగ్, రాకేష్ జైస్వాల్, శశికళ కృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లి మెయిన్ రోడ్డు పిల్లర్ నెంబర్ 1122 వద్దగల విజయ లక్ష్మి ట్రేడర్స్ షాప్ ముందు ఫుట్ పాత్ పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండడం గమనించిన స్థానికులు చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరీక్షించగా దాదాపు 50 ఏండ్ల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి చాతిపై నాగుపాము పచ్చబొట్టు కుడి చేతిపై గుర్తుతెలియని రెండు పచ్చబొట్లు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి మృతుడి వివరాలపై దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేసి ఒక మొబైల్ ఫోన్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బులు సంపాదించేదుకు దొంగతనాలకు పాల్పడుతున్న ఓస్కోలా పవన్ (23)గాంధీ నగర్ ఇంజిన్ బౌలి, ఫలక్‌నామ డ్రైవర్ పస్తం వంశీ తేజ(21) ఫలక్‌నామ ఆటో మెకానిక్ అల్లి మల్లీ వంశీ(21) కార్ వాషింగ్, డీజే ఆపరేటర్ ఉప్పుగూడకు చెందిన ముగ్గురు స్నేహితులు. సులభంగా డబ్బులు సంపాదిం చేందుకు ఈ నెల 9న కోఠిలోని గుజరాతి గల్లీలో బ్లాక్ కలర్ డియో బైక్ పై వచ్చి మహమ్మద్ జలీల్ అనే వ్యక్తి నుంచి సెల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు సుల్తాన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ ఆధారంగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వంశీ తేజపై గతంలో యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



రాష్ట్ర మత్స్య సహకార సమాఖ్య సంస్థ చైర్మెన్‌గా నియమితులైన మెట్టు సాయి కుమార్‌ను కలిసి సన్మానించిన కార్వాన్ డివిజన్ ప్రెసిడెంట్ జగన్ గౌడ్ తదితరులు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

నిత్యం జనగణమన లో భాగంగా నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్ నగర్ లో ఏర్పాటుచేసిన జెండా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడెల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



డెంగ్యూ నియంత్రణకు కృషి చేయాలి

- కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-హైదరాబాద్



డెంగ్యూ నివారణకు ఆయా అధికారులందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కృషి చేయాలని కమిషనర్ ఆమ్రపాలి కాట కోరారు. శుక్రవారం కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్‌లతో నగరంలో డెంగ్యూ నియంత్రణ కు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగ్యూ హాట్ స్పాట్ పాయింట్స్ గుర్తించి, ఆయా ఏరియాలలో ప్రజలకు, పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి డెంగ్యూ లక్షణాలు, డెంగ్యూ నివారణ, కట్టడికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎంఅండ్ హెచ్‌ఓలు, ఎంటమాలజీ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నమోదైన డెంగ్యూ కేసుల వివరాలు, సంబంధితుల అడ్రెస్ లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నుండి తీసుకోవాలని తెలిపారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్స్, సంపుల నిర్మాణ ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డెంగ్యూ ప్రబలిన ఇంటి చుట్టు పక్కల గల మిగిలిన ఇండ్ల వారికి ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్ లు తమ తమ పరిధిలో డెంగ్యూ నియంత్రణకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. వల్నరబుల్ గార్బేజ్ పాయింట్ల తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని, ఎంటమాలజీ వర్కర్స్, శానిటేషన్ కార్మికుల హాజరు శాతం మెరుగు పరచాలన్నారు. అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జోనల్ కమిష నర్లు, శానిటేషన్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

నాలా ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి



నాలా ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, సఫిల్‌గూడ లేక్ పార్కులో గల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి కమిషనర్ ఆమ్రపాలి కాటతో కలిసి సఫిల్ గూడ లేక్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, శ్రావణ్ కాలనీ వాసులు వేకర్స్ పలు సమస్యలను మేయం్‌కు వివరించారు. సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క, మురుగు నీరుతో దోమలు విపరీతంగా ఉన్నాయని వివరించారు. మురుగు నీరు రాకుండా వాటర్ వర్క్ అధికారులతో మాట్లాడి డైవర్షన్ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని అదే విధంగా పూర్తిగా గుర్రపు డెక్క తొలగించిన తర్వాత టూరిజం స్పాట్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని అవసరమనుకుంటే బోటు ఏర్పాటు కు చర్యలు తీసుకుంటామని కమిషనర్ మేయర్ వివరించారు. పార్కుల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. కొన్ని మరమ్మత్తులు చేయాలని వాకార్స్ వివరించడంతో 15 రోజుల్లో మరమ్మతులు చేయాలని అంతే కాకుండా ఓపెన్ జిమ్ వద్ద వర్షాలు కురిసినప్పుడు బురదగా ఉంటుందనీ అక్కడ కూడా బురద లేకుండా మొరం పోయాలని అధికారులను ఆదేశించారు. చెరువు కట్ట పైన పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. తదనంతరం దీన్ దయాళ్ కాలనీలో నాలాను పరిశీలించారు. నాలాలో ప్రమాదాలు సంభవించకుండా భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను వారు ఆదేశించారు. మేయర్, కమిషనర్ వెంట సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ రవి కిరణ్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాన్ని హత్య చేసిన నిందితుడిని శిక్షించాలి



- గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్

నవతెలంగాణ-ధూల్‌పేట్

గిరిజన కుటుంబాన్ని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మనాయక్ డిమాండ్ చేశారు. పాతబస్తీ ఫలక్‌నామా డివిజన్ పరిధిలో రవీందర్ నాయక్ నగర్ చౌరస్తాలో గిరిజన దంపతులకు హత్య చేసిన నిందితుడిని వెంటనే శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. నర్సంపేట డివిజన్ చిన్న రావుపేట మండలం 16 చింతల తండాలో లంబాడి తెగకు చెందిన బాణావత్ సుగుణ, శ్రీను ను హత్య చేసిన నిందితుడిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన మేకల నాగరాజు (బన్నీ)ని జీవిత ఖైదుగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. నెల రోజుల పాటు ప్లాన్ చేసి కత్తిని తయారు చేయించుకుని రెక్కి నిర్వహించి రాత్రి 2 గంటల తర్వాత హత్య చేయడాన్ని చూస్తే ఇలాంటి. ద్రోహిని కఠినంగా శిక్షించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు హత్యల పాలన కొనసాగుతున్నదని, మరోసారి ఇట్లాంటి సంఘటనలు జరగకుండా కఠినమైనటువంటి శిక్ష విధించాలన్నారు. దీప్తికి రక్షణ కల్పించాలని, మదన్‌కి మెరుగైన వైద్యం అందించాలని, వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలునాయక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంగోత్ కృష్ణా నాయక్, సీఐటీయు జిల్లా కార్యదర్శి సభావత్ కిషన్, చిన్న శ్రీను నాయక్. లచ్చిరాం నాయక్, ఆంజనేయులు, శత్రు, హరియా తదితరులు పాల్గొని నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటం నిర్వహిస్తామని దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని, గిరిజనులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఆషాఢ మాస బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం



- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో అమ్మవారి ఆషాఢ మాస బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు.ఆషాడం మాసం బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గం బోలక్ పూర్ డివిజన్ దేవుని తోట దేవాలయంలో నియోజకవర్గంలో దాదాపు 186 దేవాలయాలకు సంబంధించిన ఒక కోటి 2 లక్షల 24 వేల 500 రూపాయల చెక్కులను ఎంపీ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ , కార్పొరేటర్లు రవి చారి, సుప్రియ నవీన్ గౌడ్, రచన శ్రీ, పావని వినయ్ కుమార్, బిజెపి నాయకులు పూసరాజు, ముషీరాబాద్ తాసిల్దార్ గోవర్ధన్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆషాడ బోనాలను అత్యంత వైభవంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామన్నారు. ప్రతి దేవాలయం వద్ద ప్రత్యేక వసతులు కల్పించి అక్క చెల్లెమ్మలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బోనాలను అమ్మవారికి సమర్పించే విధంగా చూస్తామన్నారు. గటాల పలారం బండ్ల ఊరేగింపులలో ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో బోనాల పండుగ నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ బోనాల చెక్కుల పర్యవేక్షకులు జెఏకె.కృష్ణ, నరేందర్ రెడ్డి, ఈవో సత్యనారాయణ, ముషీరాబాద్ నియోజకవర్గ వివిధ డివిజన్‌ల ప్రెసిడెంట్ లు వై శ్రీనివాస్, రాకేష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రాధక్క సంతాప పోస్టర్ ఆవిష్కరణ

- ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్



గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట నేత కామ్రేడ్ రాధక్కకు విప్లవ జోహార్లు అర్పించారు. ఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ గోదావరిలోయ ప్రతిఘటనా పోరాట నిర్మాత, భారత విప్లవోద్యమ అగ్రనేత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరి కామ్రేడ్ రాధక్క 14న జరిగే సంతాప సభ వాల్ పోస్టర్‌ను విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు అనురాధ, ఎం.శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రతిఘటనా పోరాటానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, మంథని మహదేవ్ పూర్ నుండి శ్రీకాకుళం వరకు గోదావరిలోయ పరీవాహక ప్రాంతంలో ఉవ్వెత్తున సాగిన ప్రతిఘటనా పోరాటంలో కామ్రేడ్ రాధక్క ప్రత్యక్షంగా పాలొని నాయకత్వం వహించిందన్నారు. ఆదివాసీ, గిరిజనుల కోసం గోదావరి లోయలో అసమాన త్యాగాలతో సాగిన ఉద్యమానికి కామ్రేడ్ పుల్లారెడ్డితో కలిసి నాయకత్వం వహించిన రాధక్క చివరి శ్వాసవరకు ప్రతిఘటనా పోరాట రాజకీయాలతోనే కొనసాగిందన్నారు. కామ్రేడ్ సీపీ మరణాంతరం ఆయన విలువైన రచనలను వాల్యూమ్‌లుగా ముద్రించి రాధక్క విప్లవ శ్రేణులకు అందించిందన్నారు. ఆమె మరణం విప్లవోద్యమానికి తీరని లోటని, ఆమె నడిచిన ప్రతిఘటనా పోరాట బాటే భారత ప్రజల విముక్తి బాటని, ఆమార్గంలో పయనించటమే రాధక్కకు అర్పించే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు కొండల్, పీడీఎస్‌యు నాయకులు యశ్వంత్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల్లో చైతన్యం తీసుకువస్తేనే పాలకులు మాట వింటారు'

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు
- ఈ నెల 14 నుండి 31 వరకు సమగ్ర కుల గణన సాధన యాత్ర
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చినప్పుడే పాలకులు ప్రజల మాట వింటారని, అప్పుడే తమ హక్కులను సాధించుకోవచ్చునని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అభిప్రాయపడ్డారు. బీసీ కుల సంఘాల జేఏసీ, బీసీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'సమగ్ర కుల గణన సాధన యాత్ర'కు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ కుల గణన అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రజల నాడీ పాలకులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన సాధన యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. సమగ్ర కుల గణన అనే డిమాండ్ 1950 నుండి ఉందని, స్వాతంత్రంకు ముందు ప్రతి 10 ఏండ్లకు ఒకసారి ఈ కుల గణన నిర్వహించే వారని గుర్తు చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 31వ తేదీ వరకు కామారెడ్డి నుండి కరీంనగర్ వరకు ఈ 'సమగ్ర కుల గణన సాధన యాత్ర' కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రవేశ పెట్టిందని, అందుకోసమే కామారెడ్డి నుండి ఈ యాత్ర ప్రారంభించి, ఈ ప్రభుత్వానికి గుర్తు చేస్తూ అమలు చేసేలా ఒత్తిడి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పూర్తి చేస్తే బీసీలందరు అండగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు విక్రమ్ గౌడ్, శ్యామ్, వేముల వెంకటేష్, కుందారపు గణేశా చారి, శేఖర్ సాగర్, నరసింహ, మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇండ్లను లాక్కోవద్దు

- సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-అంబర్‌పేట



మూసీ అభివృద్ధి పేరుతో పేదలు వేసుకున్న ఇండ్లని అధికారులు సందర్శించడమే కాకుండా పేదల ఇండ్లపై గుర్తులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసీరాం లంక, బస్తీబాట కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి మహేందర్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుని వారు మాట్లాడుతూ "సీఎం రేవంత్ రెడ్డి మూసీ నది అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో 1000 కోట్లు కేటాయించింది. లండన్‌కు వెళ్లి అక్కడ ఉన్న నదిని పరిశీలించి వచ్చి గుజరాత్‌లోని సబర్మతి నది మాదిరిగా మూసీని అభివృద్ధి చేయాలని హైదరాబాద్‌లో ఉన్న మన మూసీని కూడా లండన్ తరహా శుద్ధి చేసి ఆహ్లాదకరమైన పార్కుతో పాటు బోర్డింగ్ చేసే విధంగా ఏర్పాటు చేస్తానని మూసీ అవతల ఇవతల ఎత్తైన భవనాలు రోడ్డులు, మూసీపై బ్రిడ్జీల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దాని కోసం ఒక ప్రత్యేక మూసీ రివర్ ఫ్రంట్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. దాన్ని పర్యవేక్షించడానికి ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ని కూడా కేటాయించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి 7 బిలియన్ డాలర్లు 58 వేల కోట్లు అప్పుచేసి అభివృద్ధి చేయాలని చూస్తున్నారు. ఒక ప్రణాళిక కూడా సిద్ధం చేసినట్టుగా కనబడుతున్నది. ఈ సందర్భంగా రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ పోలీసు అధికారుల బృందం మూసీ పరివాహ ప్రాంతాల్లో బస్తీలను సందర్శిస్తుండడంతో 11 మండలాల్లో 11,500 పేదలు భయాందోళనకు గురవుతున్నారు. ఎంతో కష్టాలు పడి భూములు అమ్ముకొని తక్కువ ధరకు వస్తుందని ఈ ప్రాం తాల్లో పేదలు ఇండ్లు కట్టుకున్నారు. కొంతమంది ప్రయి వేటు వ్యక్తులు ఈ భూమిని అమ్ముకొని కోట్లు సంపాదించారు. ఈ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడే అడ్డుకొని ఉండుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పేదలు కట్టుకున్న ఇండ్లని కూల్చివేయాలని ఆలోచన విరమించుకోవాలి. మూసీలో ప్రమాదకరంగా ఉన్న ఇండ్లను తొలగిస్తే వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. అదేవిధంగా మూసీ నదిలోకి వస్తున్న సీవరేజీ వాటర్‌తోపాటు పరిశ్రమల రసాయనలు రాకుండా ఎస్టీపీలు నిర్మించాలి. పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూసీని అభివృద్ధి చేయాలి. ఇక్కడ ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడ నివసిస్తున్న వారు మరో ప్రాంతం వెళ్లి ఉండాలంటే ఎట్లా ఉంటుందో ఆలోచించుకోవాలి. ప్రజల ను ఇబ్బందులు లేకుండా వారికి అన్ని రకాల వసతులు కల్పించి దాని తర్వాత ఏదైనా నిర్ణయం తీసుకోవాలి' అని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, అఖిల్, మోహన్ నాయకులు పాల్గొన్నారు.

'శ్రమకు తగిన ఫలితాన్ని అందిస్తున్న ఓల్టా యాప్'

- డ్రైవర్లకు, ప్రయాణికులకు లాభదాయకం
- డ్రైవర్లకు అవగాహన సదస్సులో ఓల్టా సీఈఓ రాజా విక్రమ్, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం

నవతెలంగాణ-హిమాయత్ నగర్



కార్పొరేట్ రైడింగ్ యాప్‌లు ఒక వైపు ప్రయాణికులకు ఛార్జీల మోత మోగిస్తూ మరోవైపు డ్రైవర్ల శ్రమను దోచుకుంటున్న నేపథ్యంలో దేశంలోనే మొదటి సారిగా 'ఓల్టా యాప్' ఆటో డ్రైవర్లకు శ్రమకు తగిన ఫలితాన్ని అందిస్తుందని ఓల్టా యాప్ చీఫ్ ఎగ్జికూటివ్ ఆఫీసర్ రాజా విక్రమ్ చెప్పారు. ఓల్టా యాప్ ఆటో డ్రైవర్ల నుంచి ఎలాంటి కమీషన్, ఫ్లాట్ ఫామ్ ఛార్జీలు తీసుకోదని, రైడింగ్‌లకు వచ్చే మొత్తం డబ్బులను డ్రైవర్లకే చెల్లిస్తుందని తెలిపారు. ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్ నగర్ లోని ఎన్. సత్యనారాయణ రెడ్డి భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన శశికాంత్ కనపర్తి ప్రారంభించిన 'ఓల్టా యాప్' పై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఓల్టా సీఈఓ రాజా విక్రమ్, మేనేజర్ ఉదయ్ భాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ సాయిరామ్, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి, ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, ఏఐటీయుసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి యాప్ గురించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓల్టా సీఈఓ రాజా విక్రమ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు చేసే శ్రమకు తగిన డబ్బులను పూర్తిగా వారికే అందించాలనే లక్ష్యంతో 'ఓల్టా యాప్' తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ కు చెందిన ఈ యాప్ లో ఇప్పటి వరకు 40 వేల మంది డ్రైవర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రతి రోజు 36 వేల మంది ప్రయా ణికులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ కార్పొరేట్ రైడింగ్ యాప్ లు కమీషన్లు, ఫ్లాట్ ఫామ్ ఛార్జీలు తదితర పేర్లతో కష్టపడి పని చేసే ఆటో డ్రైవర్లను దోపిడీ చేస్తున్నాయన్నారు.ఎలాంటి కమీషన్ లేకుండా ఒక సామాజిక సేవా దృక్పథంతో తీసుకువచ్చిన ఓల్టా యాప్ వల్ల ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కొమురెళ్ళి బాబు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.జంగయ్య, సీనియర్ నాయకులు ఎ.భిక్షపతియాదవ్, ఏఐటీయుసీ నగర నాయకులు సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ఐఎల్‌ఓ సూచనలు తీసుకుంటాం

- కనీస వేతనాల మండలి బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్

నవతెలంగాణ-ముషీరాబాద్



కార్మికుల సంక్షేమానికి ఐఎల్ఓ సూచనలు తీసుకుంటామని కనీస వేతనాల మండలి బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఐఎల్ఓ కో- ఆర్డినేషన్ కమిటీ, కమిషనర్ ఆఫ్ లేబర్, డైరెక్టర్ కృష్ణా ఆదిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మెన్ జనక్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. దేశంలో మొదటిసారి ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐఎల్ఓ స్టడీ ప్రకారం మినిమం వేజెస్‌పై చర్చించలేదని మొట్ట మొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల శ్రేయస్సు కోసం దేశంలోనే మొదటిసారి ఐఎల్ఓ సూచనలు తీసుకొని వాటి పై సమగ్రమైన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్ , సిబ్బంది ఎస్ ఎస్ జాజు , ఐఎన్‌టీయు సీజాతీయ కార్యదర్శి ఆర్‌డి.చంద్ర శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన అవని



నవతెలంగాణ - కూకట్ పల్లి
ఆల్విన్ కాలని డివిజన్ జన్మభూమి కాలనీలో నివసించే బాలస్వామి అనే పేద వద్ధుడు ఇంటి డాబా మీద నుంచి ప్రమాదవశాత్తు కింద పడి పోవడంతో అతని నడుము పనిచేయకుండా అయ్యింది. కొన్ని సంవత్సరాలుగా అతను మంచానికే పరిమితమై బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న, అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు,కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శిరీష సత్తూర్.. ఓలమ్మ బాలస్వామి దంపతులకు మందుల ఖర్చుల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని జై సంతోష్ నగర్ లో శుక్రవారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కాలనీ కమిటీ అధ్యక్షులు కిషన్ చారి తో కలిసి నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. డివిజన్ అభివద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అనంతరం రాజుల స్వామి నగర్, పాండు బస్తీలలో పాదయాత్ర చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నిటిని త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం: కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం జగద్గిరి గుట్ట డివిజన్ పరిధి అంజయ్యనగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పే బ్యాక్ అంబేద్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై ఆయన చేతుల మీదుగా నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదవాలని అప్పుడే భావిభారత పౌరులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కుమార్, వీరయ్య ప్రసాద్, శ్యామ్, దాసు, డివిజన్ అధ్యక్షులు అశోక్, మిట్టల్ దాసు, నరసింహారెడ్డి, హనుమంతు, బ్రహ్మానందం చారి,యాదగిరి,సత్తిరెడ్డి,సంతోష్ మనోహర్, అప్పిరెడ్డి,ఆదిలక్ష్మి, సంధ్యసాగర్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి
ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కూకట్ పల్లి క్యాంపు కార్యాలయం వద్ద కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జీహెచ్ ఎంసీ సిబ్బందితో కలసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి ఆవరణలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్నచో తనిఖీ చేసి పారబోయాలన్నారు. అట్టి నీటిలో దోమలు గుడ్లు పెడతాయని.. ఆ గుడ్డు నుంచి దోమగా రూపాంతరం చెందడానికి వారం రోజుల సమయం పడుతుందని తెలిపారు. కాబట్టి ఈ వారం రోజుల లోపల ఆ దోమకాలా చక్రాన్ని మనం బ్రేక్ చేసి, దోమల ఉత్పత్తిని అరికట్టాలని సూచిం చారు. దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సుకు, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, ఎంటమాలజీ సిబ్బందికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి సర్కిల్ డీసీ కృష్ణయ్య, ఎస్ డబ్ల్యూ ఎం. మోహన్ రెడ్డి, ఎ.యం. హెచ్.ఓ మమతా, ఎంటమాలాజీ ఏఈ ఉష పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో కార్పొరేటర్



నవతెలంగాణ - కూకట్ పల్లి
వర్షాకాలం నేపథ్యంలో ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా, జీహెచ్ఎంసీ ఎంటమాలాజీ సిబ్బంది ఆధ్వర్యంలో, దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంటమాలాజీ సూపర్వైజర్ డి. నరసింహులు చెప్పిన విధంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మన ఇంటి ఆవరణలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్నచో అట్టి నీరును తనిఖీ చేసి పారబోయాలని సూచించారు. పాఠశాల హైస్కూల్ ఎచ్.ఎం నరసింహులు, ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం సుందరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

మతసామరస్యాలకు ప్రతీక పీర్ల పండుగ

ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
మత సామరస్యాలకు ప్రతీక (మొహరం)పీర్ల పండుగని హిందూ ముస్లింలు సమైక్యంగా సోదర భావంతో జరుపుకునే గొప్ప ఉత్సవమని ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. మొహరం ఉత్సవంలో భాగంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ ప్రాంతంలో సవార్లు (పీరిలు) ఎత్తుకొని కుటుంబ సమేతంగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విభిన్న మతాలు సంస్కృతితో ఐక్యంగా జరుపుకోవడం ఈ పండగ గొప్పతనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ,మైనార్టీ నాయకులు ఇమామ్, కాజమీయా తదితరులు పాల్గొన్నారు.

హెచ్.ఎం.టీ పరిశ్రమను సందర్శించిన కేంద్ర మంత్రులు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
కేంద్ర భారీ పరిశ్రమలు, స్టీల్ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలు శుక్రవారం కుత్బుల్లాపూర్‌లోని హెచ్.ఎం.టీ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా గత కొన్నేండ్లుగా అపరిష్కతంగా ఉన్న హెచ్ఎంటీ ఎంప్లాయిస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర మంత్రులను ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1992 నుంచి ఉద్యోగులకు ఇవ్వాల్సిన అనేక రకమైన బకాయిలను నేటికీ చెల్లించలేదన్నారు. అదేవిధంగా ఉద్యోగులకు అందాల్సిన పీఎఫ్, ఎర్న్ లీవ్స్ (ఈఎల్) ఎన్ క్యాష్మెంట్ వెంటనే చెల్లించాలని కోరారు. 2019 నుంచి ఉద్యోగులకు అందాల్సిన గ్రాట్యుటీ ఇప్పటికీ అందలేదన్నారు. రిటైర్మెంట్ సమయంలో దాదాపు 600 మంది ఉద్యోగులు తమకు అందాల్సిన బకాయిలు అందగా అవస్థలు పడుతున్నారని, ఇప్పటికే పలువురు ఉద్యోగులు మతిచెందగా వారి కుటుంబాలు రోడ్డున పడి అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు అందాల్సిన బకాయిలతో పాటు అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ సీఎండీ రాజేష్ కోహ్లి, వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్, హెచ్ఎంటి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- వనమహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి అంశాలపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో
వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాల్టీలు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీసీ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వనమహోత్సవం, అమ్మ ఆదర్శ పాఠశాలలు, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం కింద జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో నాటేందుకు మొక్కలు రెడీగా ఉన్నాయని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు బతికే అవకాశం ఎక్కువగా ఉన్నందున మొక్కలు నాటడం మొదలు పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటిముందు మొక్కలు నాటేందుకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. చెట్లను పెంచడం వల్ల ఆక్సిజన్ వస్తుందన్నారు. మానవ మనుగడకు చెట్లు పెంచడం ఎంతో మేలు చేస్తుందన్నారు. వన మహోత్సవంలో విరివిరిగా మొక్కలు నాటి పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించి మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలన్నారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు తీసుకుని మొక్కలను సంరక్షించాలని సూచించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు చాలా వరకు పూర్తయ్యాయనీ, ఇంకా పలు స్కూల్లో వివిధ దశలో కొనసాగుతున్న పనులను పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించా రు. మండలాల వారీగా పనుల పురోగతిపై సమీక్షిస్తూ అధికారులందరూ తమకు కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిషన్, తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌలిక వసతుల పనులు చాలా వరకు పూర్తయ్యాయనీ, ఇంకా మిగిలి ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాన్నారు. గతంలో పాఠశాలలో ఉన్న పరిస్థితులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టిన తర్వాత పాఠశాలల ఫోటోలను సమర్పించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామనీ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కౌంటర్లు ఉండాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం కింద వచ్చే దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు అందించిన గహజ్యోతి, మహాలక్ష్మి (గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగేలా అమలు తీరును పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డేటా విభాగంలో కంప్యూటర్ చేయడానికి ఆపరేటర్లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎక్కువగా దరఖాస్తులు వస్తే రెండు సిస్టమ్‌లు కూడా ఉపయోగించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జానకిరామ్, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారిన ఉపకార వేత(నా)లు తీరవా..?



- పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో
రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఉపకార వేత(నా)లు తీరడం లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి డిమాండ్ చేశారు. తక్షణమే సీఎం పేద విద్యార్థులకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ, ప్రదర్శనతో కలెక్టరేట్ ముట్టడికి వెళ్తుండగా.. గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గేటు ఎదుట దాదాపు 2 గంటలపాటు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నాగరాజు మాట్లాడుతూ ఆరేండ్లుగా విద్యార్థులకు ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రాష్ట్రంలో ఏడాదికి 4 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారనీ, వీరికి ఏడాదికి రూ. 3వేల వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. 2019- 2020 వరకు రూ.800 కోట్లు, 2020-2021 వరకు రూ.2,356 కోట్లు, 2021-2022 వరకు రూ.2100.43 కోట్లు, 2022-2023 వరకు రూ.2958.14 కోట్లతో కలిపి మొత్తం రూ.8,214.57 కోట్లు ఫీజుల రూపంలో బకాయి ఉన్నట్టు తెలిపారు. పభుత్వం విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుంచి రూ.ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఫీజులు రాకపోవడంతో ప్రయివేటు యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. దీంతో ఉన్నత చదువులకు వెళ్ళాలనే విద్యార్థులు, తల్లిదండ్రులు సర్టిఫికెట్స్ కోసం అప్పులు చేస్తున్న దుస్థితి నెలకొందన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా కళాశాల నడపడానికి బయట నుంచి అప్పులు తెచ్చామనీ, ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు మూతవేసే పరిస్థితి ఉందని వాపోతున్నట్టు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు, వాటిని విడుదల చేసేందుకు జారీ చేసిన మార్గదర్శకాలను ప్రభుత్వమే అమలు చేయడం లేదన్నారు. అకాడమిక్ ఇయర్ ప్రారంభంలోనే విద్యార్థుల నుంచి దరఖాస్తులు తీసుకుని ప్రభుత్వం పరిశీలన చేయాలనీ, పరిశీలనలో అర్హులు అని తేలితే ముందే 25శాతం చెల్లించాలనీ, అకాడమిక్ ఇయర్ మధ్యలో 50 శాతం, మిగిలిన ఫీజులు, ఏడాది చివరిలో చెల్లించాలనే నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు పాటించడం లేదన్నారు. విద్యార్థి దరఖాస్తు చేసుకుని తన కోర్సు ముగిసే వరకు కూడా ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. రాష్ట్రం, జిల్లాలో అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఎక్కువ ఫీజులు బకాయిలు ఉన్న పరిస్థితి ఉందన్నారు. డబ్బులు చెల్లించలేని విద్యార్థులు సర్టిఫికెట్లను కళాశాలలో వదిలేసి చదువులకు స్వస్తి చెప్పి ప్రయివేటు ఉద్యోగాల వైపు వెళ్తున్నారని చెప్పారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్, వంశీ, మనోజ్, సహాయ కార్యదర్శులు కిరణ్, అవినాష్, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్‌రావు, నాయకులు సుబ్బు, బాలు, అజయ్, శ్రీనివాస్, తేజ,, విద్యార్థులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

విద్యార్థుల నినాదాలతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ దద్దరిల్లింది. 'మీరు బయటకు వస్తారా..? మమ్మల్ని లోపలికి రమ్మంటారా..?' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో కలెక్టరేట్ లోపల, బయట రెండు గంటల పాటు ట్రాఫిక్ జాయి అయ్యింది. లోపలి నుంచి బయటకు, బయటి నుంచి లోపలికి ఎవ్వరినీ అనుమతించలేదు. దీంతో స్పందించిన కలెక్టర్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశురామ్‌ను పంపించగా.. ఆయనకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

'ఎస్ఎమ్ఏ' వ్యాధిపై అవగాహన మన బాధ్యత



నవతెలంగాణ-సిటీబ్యూరో
'ఎస్ఎమ్ఏ' వ్యాధిపై అవగాహన మన బాధ్యత అని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ గురించి అవగాహన కల్పించేందుకు క్యూర్ ఎస్ఎమ్ఏ ఇండియా ఈ అరుదైన వ్యాధిపై ఆగస్టు 4వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో ఉదయం 6 గంటలకు నిర్వహించే అవగాహన రన్ పోస్టర్‌ను శుక్రవారం ఎర్రమంజిల్‌లో రెయిన్ బో హాస్పిటల్ పిల్లల వైద్యులు డాక్టర్ రమేష్ కోనంకి, ఐజీ హాస్పిటల్ క్లినికల్ జెనెటకిస్ట్ డాక్టర్ తెల్లా సునిత, క్యూర్ ఎస్ఎమ్ఏ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ పేషెంట్ అడ్వకేసీ శ్రీలక్ష్మీ నాళం, క్యూర్ ఎస్ఎమ్ఏ రీజినల్ కో-ఆర్డినేటర్ మిస్టర్ సతీష్, కమాండెంట్ ఎన్వీ రామారావు, మోసీన్ ఖాన్, అభిరామ్, నూర్ మహమ్మద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ కోనంకి మాట్లాడుతూ తెలిసీ, తెలియని వయస్సులో ఎంతో మంది చిన్నారులు భయంకరమైన ఎస్ఎమ్ఏ వ్యాధి బారిన పడుతున్నారనీ, ఈ వ్యాధిని ఆదిలోనే అంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆగష్టు 4వ తేదీన నిర్వహించనున్న రన్‌లో ప్రతి ఒక్కరూ ఇది తమ బాధ్యత అని ముందుకు వచ్చి పాల్గొని చిన్నారులు ఆ వ్యాధి బారిన పడకుండా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ తెల్లా సునిత మాట్లాడుతూ ఎస్ఎమ్ఏ వ్యాధిపై నేడు ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలన్నారు. గతంలో తక్కువగా ఉన్న కేసులు నేడు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. చిన్నారుల భవిష్యత్‌తో పాటు, వారి కుటుంబం కూడా చిన్నాభిన్నం అవుతుందన్నారు. వెన్నెముక కండరాల క్షీణత అనేది జన్యుపరమైన వ్యాధి అనీ, ఇది వెన్నుపాములోని మోటారు నరాల కణాలను బలహీనపరుస్తుందనీ, ఇది శారీరక బలం, నడవడానికి, తినడానికి లేదా శ్వాస తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోతుందని వివరించారు. ఇది శిశువుల మరణానికి ప్రథమ జన్యుకారణం అనీ, సర్వైవల్ మోటార్ న్యూరాన్ జన్యువు 1లో ఉత్పరివర్తన వలన సంభవిస్తుందన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

- కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్
మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని... నాటిన ప్రతి మొక్క సంరక్షించుకోవాలని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, వీడీఆర్ కాలనీలలో స్థానకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చూసినప్పుడే భావితరాలకు మంచి కాలుష్య రహిత సమాజాన్ని అందిస్తామని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం మన భవిష్యత్తుకు సంబంధించిందని ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అన్ని స్థలాలలో అలాగే రహదారులకు ఇరుపక్కల అన్ని చోట్ల మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, మున్సిపల్ అధికారులు,సీనియర్ నాయకురాలు అనిత,సమైక్య అధ్యక్షురాలు సత్యవాణి, మహిళా అధ్యక్షులు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, నాయకులు అంజయ్య, నరేందర్ రెడ్డి, స్థానికులు భరత్,ప్రభాకర్, మహాలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



- కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ నాయకులు పలువురు ప్రజాప్రతినిధులు జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై పడిన గుంతలను శరవేగంగా పూర్తి చేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా చెదారాలతోపాటు మట్టి దిబ్బలు, ఇసుక కుప్పలను తొలగించాలని అధికారుల దష్టికి తీసుకువచ్చారు. ఓపెన్ నాలాలలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు చెత్తాచెదారాలను తొలగించి మలేరియా బాల్స్ వేయడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొందరు రోడ్డు కిరువైపులా అక్రమంగా ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని సర్వే చేసి వాటిని తొలగించాలని కోరారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేయాలని, అదేవిధంగా వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ వీలైనంత తొందరలో సమస్యల పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ ప్రెసిడెంట్ తూము వేణు, సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, లక్ష్మణ్, సీనియర్ నాయకులు కంటెస్టెంట్ కార్పొరేటర విట్టల్ రెడ్డి , రాఘవేంద్రరావు, వివిధ డివిజన్ల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ సంతోష్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సునీల్ యాదవ్, పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికలో వసతులు కల్పించాలి


- కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
హిందూ స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించి అభివద్ధి చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ(ఎం) కూకట్ పల్లి మండల కమిటీ సభ్యులు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎం శంకర్, బి శ్రీను మహేష్ పాల్గొని మాట్లాడుతూ హైదర్ నగర్ అలీ తలాబ్ వద్ద ఉన్న హిందూ స్మశాన వాటికను అభివద్ధి చేయాలన్నారు. హిందూ స్మశాన వాటికలో వీధిలైట్లు వేయాలని, స్థానాల గదులు నిర్మించాలని, రెండు బర్నింగ్ ప్లాట్ ఫామ్స్ ఏర్పాటు చేయాలని, చుట్టు ప్రహరి గోడ నిర్మించాలని జోనల్ కమిషనర్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన కమిషనర్ వసతులు కల్పించి అభివద్ధి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అశోక్ యాదవ్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

నిజాంపేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

నవతెలంగాణ-దుండిగల్
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరే షన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నూతన పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్,కమిషనర్ రామకష్ణారావు, ఎమ్మార్వో ఫూల్ సింగ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ - బాలానగర్
నాగరిగారి ప్రీతం రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాంధీభవన్ నుండి ర్యాలీగా తరలి వెళ్లి మాసాబ్ ట్యాంక్ లో గల దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్ కు చేరుకున్నారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి సీనియర్ నాయకులు, సంజీవరావు, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరి రాము, శివ, భరత్, చింటు శివ, మహేష్, ప్రకాష్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - కూకట్ పల్లి
కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన శిష్యుడు బీజేపీ ఆల్విన్ కాలని డివిజన్ నాయకుడు శివాజీ కస్తూరి ఆధ్వర్యంలో ఎల్లమ్మ బండలో జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు,గాజుల రామరం కార్పొరేటర్ రావుల శేషగిరి, కుమార్ యాదవ్, రామరాజు, కేశవరావు,వీరా చారి,శేఖర్ యాదవ్ లు పాల్గొని ,కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా నిర్వహించారు. నాయకులు ,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు

- బీజేపీ రాష్ట్ర నాయకులు విజిత్ వర్మ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
జేఎన్‌టీయూలో ఓ భవన ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ పాటించడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకులు విజిత్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో ఓ భవన ప్రారంభోత్సవానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. సాధారణంగా ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టిన పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందలేదని, ఇది ఎంతవరకు సమంజసమన్నారు. నియంతతంగా ప్రవర్తించడం, ఇది ప్రజాస్వామ్యానికి తెరలేని అగౌరవమన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు.

బాలికల ఉన్నతికి పోస్ట్ పొదుపు ఖాతా తెరవాలి



- కార్పొరేటర్ విజయారెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ పోస్ట్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భేటీ-పడావో భేటీ -బచావో కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలలోని 50 మంది పేద ఆడపిల్లలకు (సుకన్య సమద్ధి ఖాతాలు ప్రారంభించిన వారికి) పీ.జే.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మెన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి అతిథిగా హాజరై పాస్‌బుక్ పుస్తకాలను అందజేసి మాట్లాడారు. వాటి వినియోగం ద్వారా చిన్నపిల్లల తల్లిదండ్రులకు ఈ స్కీం భవిష్యత్తులో ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ సీనియర్ పోస్టుమాస్టర్ ప్రసాద్, వై శ్రీనివాసులు, రఘు గౌడ్,సంకీర్తన, మీనాక్షి, నళినితో పాటు పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని ఖండిస్తున్నాం



- టీపీసీసీ స్టేట్ లీగల్ కన్వీనర్ ఖాజా అహ్మద్

నవతెలంగాణ - హైదరాబాద్

సిద్దిపేటలో న్యాయవాది పైన ఏఎస్‌ఐ ఉమా రెడ్డి అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని టీపీసీసీ స్టేట్ లీగల్ కన్వీనర్, న్యాయ వాది ఖాజా అహ్మద్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఒక కేసులో నిందితులకు అనుకూలంగా కోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ ఉత్తర్వుల ప్రతిని ఇచ్చేందుకు వెళ్లిన అడ్వకేట్ పై సిద్దిపేట పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. నిందితుడిపై దాడిని ప్రశ్నించిన పాపానికి లాయర్ ఫోన్ లాక్కోవడమే కాకుం డా దానిని ధ్వంసం చేసిన పోలీసులే తిరిగి తమ విధులను అడ్డుకున్నారంటూ ఎస్‌ఐఆర్ నమోదు చేయడం దారుణమన్నారు. ఏఎస్‌ఐతోపాటు ఈ దాడిలో పాల్గొన్న పోలీసులందరినీ సస్పెండ్ చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా ఉండేందుకు బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో న్యాయవ్యవస్థ లో భాగమైన న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల హక్కుల కోసం పోరాటాలు చేస్తామని స్పష్టం చేసారు.

సంగీత నాటక అకాడమీ చైర్మెన్‌గా అలేఖ్య

- సంగీత నాటక అకాడమీ కార్యలయంలో బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అలేఖ్య పుంజల సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రాంగణంలోని కళా భవన్‌లో ఉన్న సంగీత నాటక అకాడమీ కార్యలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో తెలుగు విశ్వవిద్యా లయంలో నత్య శాఖ అధిపతిగా ఉన్న కారణాన విశ్వ విద్యాలయ ఆచార్యులు విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులు పాల్గొని మాట్లాడుతూ నాట్య రంగంలో విశేష సేవలు అందించిన అలేఖ్యను ప్రభుత్వం తగు గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, పద్మ వతి రాజ్ సింగ్ ఠాకూర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అలేఖ్యను మాలలతో శాలువాలతో సత్కరించారు. కాగా గత ప్రభుత్వ కాలంలో సంగీత నాటక అకాడమీ ఏర్పడిన తరువాత నాటక ప్రముఖుడు బద్మి శివ కుమార్, నాట్య గురువు దీపిక రెడ్డి చైర్మెన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం చైర్మెన్‌గా నియమితురాలైన అలేఖ్య రాజకీయ ప్రేరేపిత పోస్టుగా కాకుండా కళలకు ప్రాధాన్యత ఇస్తారని రాష్ట్ర వ్యాప్తంగా నత్య నాటక సంగీత రంగాలు ఉత్తేజం కాగలవని పలువురు కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వయో వృద్ధుల సమస్యల దరఖాస్తుకు ప్రత్యేక వెబ్ పోర్టల్

- వయో వృద్ధుల ఆస్తి వివాదాలకు సంబంధించిన 200 పైచిలుకు కేసులను పరిష్కరించాం
- సీనియర్ సిటిజన్ కేసులు పరిష్కారంలో ఉన్నత స్థానంలో హైదరాబాద్ జిల్లా
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న రోజులలో జిల్లా లోని వయోవృద్దులు తమ ఆస్తికి సంబంధించిన సమస్యలను ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేలా త్వరలో ప్రత్యేక వెబ్ పోర్టల్ ను ప్రారంభిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వయో వృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వయో వృద్దులకు సంబంధించిన 200 పైగా కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో వయవృద్దులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ ఆస్తులకు సంబంధించిన సమస్యలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా ఒక ప్రత్యేక వెబ్ పోర్టల్ ను జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం తీసుకున్న వివిధ చర్యలను వివరించారు. జిల్లాలో ఉన్న అన్ని వృద్ధాశ్రమాలను దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేసి వివిధ రకాల జబ్బులకు చికిత్స చేయనున్నారు. జిల్లాలో ఉన్నటువంటి అన్ని వృద్ధా ఆశ్రమముల యజమాన్యాలతో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, వారు ఇస్తున్న సేవలను, సౌకర్యాల గురించి తెలుసుకుంటానని,అంతే కాకుండా వృద్ధ ఆశ్రమలను సరియైన పద్ధతిలో నిర్వహించే విధంగా సూచనలు ఇవ్వనున్నామని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వయో వృద్ధుల సంక్షేమ అధికారి ఎ. రాజేందర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, ఏసీపీ ఆంజనేయులు,సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ సింగ్, జీహెచ్‌ఎంసీ పీఓ అలీం,ప్రియదర్శిని, తివారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ దారుణహత్య

- సనత్‌నగర్‌లో ఘటన
- పోలీసుస్టేషన్ ఎదుట హిజ్రాల ఆందోళన

నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్‌లో ఓ ట్రాన్స్‌జెండర్‌ను ముక్కలు ముక్కలుగా నరికి దారుణంగా హత్య చేశారు. నిర్మానుష్య ప్రదేశంలో ట్రాన్స్ జెండర్ మృతదేహం పడి ఉండటం, మృతదేహంపై తీవ్రంగా గాయాలు ఉండటం స్థానికంగా సంచలనం సృష్టించింది. బాలానగర్ ఏసీపీ జి.హన్మంతరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లాకు చెందిన షీలా అలియాస్ షేక్ సాజీద్ అహ్మద్ అబ్బాస్ (30) వరంగల్ నుంచి నగరానికి వచ్చి కొంత కాలంగా బాలానగర్ హెచ్‌ఎంటీ సొసైటీలో నివాసముంటూ చుటుపక్కల ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నది. ఇదిలా ఉండగా శుక్రవారం ఫతేనగర్ వాల్మీకీనగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహం ముక్కలుగా ఉండటాన్ని గుర్తించిన స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు. హత్యకు గురైన వ్యక్తి ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించి ఆమె ఆచూకీ ఆరా తీశారు. ఈ మేరకు ఆమె షీలా అనే ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించారు. షీలా ఒంటిపై పలు చోట్ల పదునైన ఆయుధాలతో దాడి చేసిన గాయాలు, ఒంటిపై కాలిన గాయాలు , తలపై గాయాలు ఉన్నట్టుగా గుర్తించారు. కర్రలతో ఆమె తలపై మోది ఉంటారని ఏసీపీ అను మానం వ్యక్తం చేశారు గుర్తుతెలి యని వ్యక్తులు డబ్బుల కోసం షీలాను నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం నుంచి పొడవైన కర్రతో పాటు కొన్ని అనుమానాస్పద వస్తువులను క్లూస్‌టీమ్ సిబ్బంది సేకరించారు.

అయితే షీలాను హత్య చేసింది ఎవరు...? ఈ హత్యలో ఎంత మంది పాల్గొన్నారు...? ఆమె హత్యతో ఇతర హిజ్రాలకు ఏదైనా సంబంధం ఉందా.?అనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.అందుకు ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న సీసీకెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ ఘటనకు కారకులయ్యే అవకాశమున్న అనుమానినుతలకు సంబంధించిన వివరాలను పలువురు హిజ్రాల ద్వారా సేకరించామని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామని ఏసీపీ హన్మంతరావు వెల్లడించారు.

పోలీసుస్టేషన్ వద్ద హిజ్రాల నిరసన...

షీలా హత్యను నిరసిస్తూ శుక్రవారం పలువురు హిజ్రాలు సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. షీలాను హత్యచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పలువురు హిజ్రాలు మాట్లాడుతూ దిక్కూ,మొక్కూ లేని తాము భిక్షాటనతో జీవితాలను వెళ్ల దీస్తుంటే డబ్బుల కోసం తమను చిత్రహింసలకు గురి చేయడమేకాకుండా అనేక ప్రాంతాల్లో హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో తమపై అమానుషంగా దాడులు జరుగుతున్నాయని, తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా దాడులు, హత్యలు చేస్తున్న వారిని గుర్తించి ఆరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. షీలాను హత్య చేసిన అగంతకులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య పాల్గొని మద్దతు తెలిపారు.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ధర్నా

నవతెలంగాణ-ఓయూ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి డీఎల్ మోహన్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో వారాసిగూడ, అడ్డగుట, ప్రాంతాల్లో శుక్రవారం అడ్డా ల వద్ద తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను అమలు చేయడానికి ప్రయత్నాలు ప్రారం భిస్తునన్నట్లు చెప్పారు. ఈ విధానాలు మానుకోవాలని కోరారు. లేని యెడల పెద్ద ఎత్తున కార్మికుల లోకాన్ని కలు పుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. భవాన నిర్మాణ కార్మిక రంగంలో కార్మికులు ఇప్పటికే పని లేక ఇబ్బంది పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవాల్సింది పోయి వారిని ఇబ్బంది పెట్టి చర్యలు వెంటనే మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ధర్నా కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు బి.మధు నరసింహ,సూర్య ప్రకాష్, భాష , ఎల్ల స్వామి, బి కృష్ణ,నారాయణ, పార్వతమ్మ లక్ష్మి, శ్రీనివాస్ అజయ్ బాబు, పాల్గొన్నారు.

వృద్ధుని సెల్ దొంగలించిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

వృద్ధుడి నుంచి సెల్ ఫోన్ స్నాచింగ్ చేసిన యువకుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం ఓయూ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గ్యార జగన్, సీఐ రాజేందర్ కేసు వివరాలను వెల్లడించారు. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 లో హ్యాపీ హెూమ్స్ అపార్ట్మెంట్‌లో నివాసముండే గోపాల్ వృత్తిరీత్యా ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈ నెల 6న రాత్రి ఎనిమిది గంటల సమయంలో బెంగుళూరు వెళ్లేందుకు రైలు ఎక్కేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వెళ్లాడు. రైలు రావడంలో తీవ్ర జాప్యం జరగడంతో గోపాల్ తన ఇంటికి తిరిగివెళ్లేందుకు రాత్రి పదకొండు గంటల సమయంలో నిర్ణయించుకున్నాడు. బయటకు వచ్చి, ఆటో కోసం వెతుకుతుండగా, యాక్టివాపై వచ్చిన ఒక వ్యక్తి తాను అదే దారిలో వెళ్తున్నానని, రూ.200 ఇస్తే దింపుతానని చెప్పారు. దాంతో ఆ వ్యక్తి బైక్ ఎక్కిన గోపాల్ తన ఇంటి సమీపంలో రాత్రి పన్నెండు గంటలకు దిగాడు. ఈ మేరకు ఆ వ్యక్తికి డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించేందుకు ప్రయత్నించినప్పటికీ కుదరలేదు. దాంతో జేబులో నుంచి డబ్బు తీసి, సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులో లెక్కిస్తుండగా, ఒక్కసారిగా ఆ వ్యక్తి అతని చేతిలో నుంచి రూ.1700 నగదు, సెల్ ఫోన్ లాక్కొని పరారయ్యాడు. దీంతో గోపాల్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నిందితుడు తార్నాకలో దొంగలించిన మొబైల్ ఫోన్‌ను అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా శుక్రవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి సెల్ ఫోన్ యాక్టివా వాహనం, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆంథోనీ ఫెలిక్స్ ఖాన్ బోయిన్‌పల్లి సమీపంలోని డైమండ్ పాయింట్ హెూటల్ వద్ద నివసిస్తూ, ప్రయివేటు ఉద్యోగం చేసేవాడు. ఇటీవల అతడిని ఉద్యోగం నుంచి తొలగించడంతో చోరీకి పాల్పడ్డాడు. నిందితుడిని పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.



శాకంబరిదేవి అలంకారంలో మహంకాళి

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ మేరకు ఆలయ కార్య నిర్వహణ అధికారి గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. శాకాంబరి దేవిగా అమ్మవారిని అలంకరించగా... వివిధ రకాలైన కూరగాయలతో ఆలయంతో పాటు అంతరాయంలో కూడా అలంకరణ చేశారు. అలాగే ఆలయం మొత్తాన్ని రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. ఆలయానికి రాలేని భక్తులు అమ్మవారిని తమ ఇండ్ల ముందే దర్శించుకుని పూజలు నిర్వహించుకునే విధంగా ఘటాన్ని పురవీధుల్లో ఊరేగిస్తారు. ఇప్పటికే పలు వీధుల్లో అమ్మవారి ఘటం భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలు రానున్నారు.

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- 256 దేవాలయాలకు రూ. 1.69 కోట్ల పంపిణీ

నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ సంస్కతిని చాటిచెప్పే బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయ ఆవరణలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని 256 దేవాలయ కమిటీల సభ్యులకు 1.69 కోట్ల రూపాయల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, కార్పొరేటర్‌లు టి.మహేశ్వరి, దీపిక, కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, మాజీ కార్పొరేటర్ కిరణ్మయి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి ఎమ్మెల్యే

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం పరిసరాలలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించనున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన జరిగే సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై జీహెచ్‌ఎంసీ దేవాదాయ, వాటర్ వర్క్స్, ఎలెక్ట్రికల్, హెల్త్, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, అగ్నిమాపకం తదితర శాఖలకు చెందిన అధికారులతో కలిసి సమీక్షించనున్నట్టు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి ప్రతి ఏటా వివిధ ప్రాంతాల నుండి లక్షలాదిమంది భక్తులు వస్తుంటారు. ఈ సంవత్సరం కూడా అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే తగు సూచనలు, ఆదేశాలు ఇస్తారు.

ఆలయ కమిటీలకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ శుక్రవారం చెక్కులు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న 218 ఆలయాల కమిటీలకు చెక్కులను ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల ఉత్సవాల చెక్కులు అందించడం సభ్యులందరినీ ఓకే ప్రాంతంలో కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బోనాలు జరుపుకుంటున్న సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు జరుపుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు అన్ని శాఖలతో అధికారులతో సమావేశం కూడా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు ,భద్రన్న, ముప్పిడి మధుకర్, సరిత, ధనలక్ష్మి, రేపల్లె వెంకటేశ్వర్లు, మారేడుపల్లి డిప్యూటీ తాసిల్దార్ శివకుమార్ ,తిరుమలగిరి తాసిల్దార్ అశోక్ కుమార్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులతో ఎమ్మెల్యే సమీక్ష

బోనాల ఉత్సవాల సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తన నార్త్ పరిధిలోని జోన్ పోలీసులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటువంటి పక్షపాతం లేకుండా పోలీసులు పనిచేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ఏసీపీ రమేష్, తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ,కార్ఖానా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకష్ణ, బొల్లారం సబ్ ఇన్‌స్పెక్టర్ రామకష్ణ , పాల్గొన్నారు.





బోనాల జాతర సందర్భంగా శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానంలో కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజక ఇన్‌చార్జి కోట నీలిమ ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలకు పండుగ నిర్వహించేందుకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట

ఫ్రైడే - డ్రైడేలో ప్రత్యేక డ్రైవ్

- పాల్గొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ లోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో ప్రతీ వారం నిర్వహించే దోమల నివారణ అవగాహన కార్యక్రమం ఫ్రైడే - డ్రైడే ప్రత్యేక డ్రైవ్‌లో అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో దోమలను నివారించే ప్రత్యేక యం త్రాలు, పని ముట్లు, కీటక నాశినిల పని తీరును పరిశీ లించి, నివారణ చర్యలు తెలియజేసే డోర్ స్టికర్స్ ను కాలనీ వాసుల ఇండ్లకు అతికించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు కేటాయించి, తమ ఇంటి పరిసరాలను, పాత్రలను ప్రత్యేక శ్రద్ధతో శుభ్రం చేసుకోవాలని, తద్వారా హాని కలిగించే దోమలు, కీటకాలను నివారించడం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు.జీహెచ్‌ఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమంలో శక్తి వంచన లేకుండా సేవలందించాలని, ముఖ్యంగా వర్షాకాలం కాబట్టి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంఓహెచ్ రజినీకాంత్, ఎంటమోలజీ విభాగ అధికారులు ఏఈ సునీత, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





సితఫలమండి ప్రభుత్వ పాఠశాలలో ఫ్రైడే - డ్రై డే కార్యక్రమంలో కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంకులు, సంప్‌లు, పూల కుండీలు, రిఫ్రిజిరేటర్లు, దోమల వృద్ధికి దారితీసే ఇంటిలోని అన్ని ప్రదేశాలు, నీటి నిల్వ కంటైనర్‌లను వారానికోసారి శుభ్రపరచాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారానికి ఒకరోజు ఇంటి పరిసర ప్రాంతాలు ఇంటిని శుభ్రపరిచే విధంగా ఒకరోజు సమయం కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి శుక్రవారం పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం పై సహకరించిన పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఏఈ సునీత,శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఎస్‌సీఐకు గ్రీన్ అవార్డు. 4 ఐఎస్ఓ సర్టిఫికెట్లు

- హర్షం వ్యక్తం చేసిన కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాకు గ్రీన్ అవార్డు తో సహా నాలుగు ఐఎస్ఓ సర్టిఫికెట్స్ రావడం పట్ల కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు హర్షం వ్యక్తం చేసారు. శుక్రవారం కాలేజ్ బోర్డు రూమ్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో హెచ్. వై. ఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివరాం ఆలపాటి ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌ను ఇంజినీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు కు అందించారు. కాలేజీలో పరిపాలన వ్యవహారాలు డాక్యుమెంటేషన్ విధానాలు, ఉద్యోగులు తమ విధివిధానాలను పాటించడం, సమయపాలన, ఫైళ్ల సత్వర పరిష్కరణ తదితరమైన వాటిలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నందుకు ఐఎస్ఓ 9001 క్వాలిటీ మేనేజ్ మెంట్ సర్టిఫికేషన్ ఇస్తున్నట్టు ఆయన అన్నారు.

1981 నుండి గచ్చిబౌలిలో నడుస్తున్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ లో పర్యావరణ పరిరక్షణ చర్యలు, కాలేజ్ ప్రాంగణంలో ప్రక్రుతి సహజంగా ఏర్పడిన పెద్ద పెద్ద బండ రాళ్ళు, అధిక వయసున్న భారీవృక్షాలు, అటవీ సంపదను కాపాడటం నేటి రోజుల్లో సాధ్యమయ్యే పనికాదని, అయినా కూడా ప్రకృతి పట్ల విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ సహజ సంపదను పరిరక్షిస్తున్నందుకు ఐఎస్ఓ 14001 ఎన్విరాన్మెంట్ మేనేజ్ మెంట్ సర్టిఫికెట్ ను కూడా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ కు ఇస్తున్నట్టు, ఇందుకు తామెంతో గర్విస్తున్నామని ఆలపాటి శివయ్య అన్నారు.ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో నిత్యం జరుగు తుండే అనేక శిక్షణా కార్యక్రమాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఎంతోమంది ఉన్నతాధికారులతో పాటుగా కింది స్థాయి సిబ్బంది కూడా హాజరవుతుంటారని, దూర ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులకు ఏమైనా అనారోగ్య సమస్యలు వచ్చినట్టయితే వెంటనే దగ్గరలోని కేర్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునే విధంగా ఆ ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకోవడంతో పాటుగా కాలేజ్ స్టాఫ్ కోసం ప్రతి రెండు, మూడు నెలలకు వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన మందులను రాయించుకోవడంతో పాటుగా కాలేజ్ లో చైల్డ్ లేబర్ లేకపోవడం, షిఫ్ట్ ల వారీగా సిబ్బంది పనిచేయడం మొదలైన వాటిపట్ల ఐఎస్ఓ 45001 ఆకుపెషనల్ హెల్త్ సేఫ్టీ మేనేజ్ మెంట్ సర్టిఫికెట్ ను ప్రదానం చేస్తున్నట్టు ఆలపాటి శివయ్య తెలిపారు.

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ప్రాంగణం పెద్ద వైశాల్యంలో ఉన్నందున ఇక్కడ సోలార్ విద్యుత్‌ను ఉపయోగించడం, కార్యాలయం మొత్తం కూడా ఎల్ఈడీ దీపాలు వాడటం వల్ల కూడా ఐ ఎస్ ఓ 50001 ఎనర్జీ మేనేజ్ మెంట్ సర్టిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని ఆలపాటి తెలిపారు. ప్రభుత్వం ఆశించే అన్ని రకాల స్థాయిలను ఇఎస్‌సీఐ పాటిస్తున్నందున ప్రత్యేకంగా గ్రీన్ అవార్డును కూడా హెచ్ వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రయివేట్ లిమిటెడ్ బహుకరిస్తున్నట్లు ఆలపాటి తెలిపారు.ఈ అవార్డులు, ప్రశంసా పత్రాలు రావడం వెనుక తన కాలేజ్ సిబ్బంది, అధికారుల శ్రమ విధులపట్ల వారికున్న అంకితభావం మాత్రమే కారణమని, ఇందుకు తన సిబ్బందికి ధన్యవాదములు తెలుపుతున్నట్లు కాలేజ్ డైరెక్టర్ రామేశ్వర్ రావు అన్నారు. కార్యక్రమంలో ఇద్దరు చీఫ్ లు లక్ష్మీకాంత రావు, వెంకటశాస్త్రి లతో పాటుగా అన్ని డివిజన్లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శుక్రవారం వెంగళరావు నగర్ లో రూ. 35లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్య రావు, డీఈ రామచంద్ర రాజు, ఏఈ అవినాష్, విజయ్ ముదిరాజ్, కాలనీ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, శ్యామ్ రావు, సునీత, వేణు, ఆంజనేయులు,, అంబటి రామకృష్ణ, పూజారీ బాలరాజు, కట్ట లక్ష్మి,, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ పులి జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావుని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలినేని రామ్మోహన్ రావు తదితర నాయకులు నవతెలంగాణ-అంబర్‌పేట

జూబ్లీహిల్స్ పెద్దమ్మకు బంగారు బోనం



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

సప్త మాతృతలకు-సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మూడో బంగారు బోనాన్ని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో శుక్రవారం సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరే గింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం మీరాలం మండి శ్రీ మహంకేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి గుడికి సామూహిక ఊరేగింపుగా భక్తులు బంగారు బోనం, పట్టు వస్త్రాలు, వడి బియ్యంతో తరలివెళ్లారు. భజబా జంత్రీల నడుమ పోతరాజుల నృత్యాలతో జూబ్లీహిల్స్‌కు చేరుకున్న బంగారు బోనానికి వేద పండితుల మంత్రోచ్చారణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాకేష్ తివారి, మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, కోటి రెడ్డి, హాన్స్ రాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కుల మతాలకతీతంగా గ్లోబల్ పీస్ ర్యాలీ'

- ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె.ఎ.పాల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశ అభివృద్ధి, ప్రజల సుభిక్షం కోసం కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో 'గ్లోబల్ పీస్ ర్యాలీ, జాతీయ స్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె.ఎ.పాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ర్యాలీ, సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఎ.పాల్ మాట్లాడుతూ మన దేశ ఆర్థిక పరిస్థితి 80వ స్థానానికి పడిపోయిందని, దాన్ని నెంబర్ వన్ స్థానానికి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తున్నానని, అందుకు దేశంలోని ప్రముఖులు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, మేధావులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలు తనకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థాయికి చేరు కునేలా వివిధ దేశాల కంపెనీల నుంచి పెట్టుబ డులను తీసుకురావడానికి, దేశంలో శాంతిని నెలకొల్పడానికి గ్లోబల్ పీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ర్యాలీ, సదస్సు ఎంతగానో ఉపయోగప డుతుందని, అందుకు దేశంలోని 29 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ ప్రముఖులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సెలబ్రిటీలు, జర్నలిస్టులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. అక్టోబర్ 2న నిర్వహించే ఈ ర్యాలీ, సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'గృహజ్యోతి' దరఖాస్తుల నమోదులో జరిగిన

పొరపాట్లను సరి చేయండి

అర్హులకు ఉచిత విద్యుత్ అందించండి : సీపీఐ(ఎం) విజ్ఞప్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కోసం గృహ జ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న అనేకమంది అర్హులకు నేటికీ అమలు కావడం లేదని, దరఖాస్తు వివరాలను నమోదు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం చేసిన తప్పుల కారణంగానే పెద్ద సంఖ్యలో అర్హులకు ఉచిత విద్యుత్ అందడం లేదని సీపీఐ(ఎం) తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో అనేక మురికివాడలలో ఇటీవల సీపీఐ(ఎం) చేపట్టిన బస్తీ బాట సందర్భంగా పేదలు తమకు ఉచిత విద్యుత్ రావడం లేదని, భారీగా కరెంట్ బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసినట్టు చెప్పారు. ప్రజాపాలన సందర్భంగా చేసుకున్న దరఖాస్తులోని వివరాలను తక్కువ సమయంలో హడావుడిగా నమోదు చేయడం కారణంగా అనేక తప్పులు జరిగాయని ఆయన తెలిపారు. దీనివలన నిజమైన లబ్దిదారులు చాలా నష్టపోతున్నారని వివరించారు. జీహెచ్ఎంసీలో తప్పులను సరిచేసే ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో వాటిని సరి చేయడం సాధ్యం కాదని అధికారులు చేతులెత్తేస్తున్నారని చెప్పారు. వేలమంది ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొందని, తప్పులను సరిచేసి నిజమైన లబ్దిదారులకు ఉచిత విద్యుత్ అందించే చర్యలు తక్షణమే చేపట్టాలని సీపీఐ(ఎం) నగర కమిటీ తరపున ఎం.శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





బోనాలకు రావాలని మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మికు ఆహ్వానం అందజేశామని కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి ఈసారి జరిగే ఉత్సవాల్లో తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బోనాల వేడుకల సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ లోని తుల్జాభవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొని ఆల యాల నిర్వహాకులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అంబర్పేట నియోజకవర్గం పరిధిలోని ఆలయాలకు చెక్కులు రూ.50,82,00 లతో 128 చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఆలయాల వద్ద ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రజలు బోనాల వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ హైదరాబాద్ అసిస్టెంట్ కమీషనర్ ఎ. బాలా జీ, తుల్జాభవన్ ఈవో అంజనారెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, వై. అమృత, బి. పద్మ వెంకట్రెడ్డి, విజయ్కుమార్ గౌడ్, అంబర్పేట తహసీల్దార్ వీరాబాయి, స్థానిక నేతలు ఎం. మహేష్ యాదవ్, దేవిరెడ్డి విజితారెడ్డి, బి. ఓంప్రకాష్ యాదవ్, బి. కృష్ణాగౌడ్, ఎం.బి. కిషోర్ కుమార్, పింజరి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్..
పెండ్లి చేసుకోవడానికి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెండ్లి చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తులు సుల్తాన్ బజార్ పోలిసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ కి చెందిన విజయ్ కుమార్ గౌడ్ అలియాస్ వినోద్ (24) ఇస్సామీయా బజార్‌లో బట్టల షాపులు పనిచేస్తాడు. కాగా ఈనెల 8న బాలిక తండ్రి స్కూల్ కి వెళ్లి తిరిగి రాలే దని సుల్తాన్ బజార్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

అమర్నాథ్ యాత్రికులకు అందుబాటులో వస్త్రాలు..





నవతెలంగాణ-ధూల్‌పేట్

నగర నలుమూలలకు ప్రత్యేకతను సంతరించుకున్న పాతబస్తీ మదీనా వస్త్రాల మార్కెట్ ప్రధానం. ప్రస్తుత ట్రెండ్‌తో పాటు అన్ని రకాల వస్త్రాలకు నిలయం. మదీనా చౌరస్తాలో నూట ఇరువై ఏళ్ల చరిత్ర గల మొహమ్మద్ క్యాప్ మార్ట్‌లో అమర్నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులు అక్కడి వాతావరణాన్ని తట్టుకునే వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. అక్కడి వాతావరణంను తట్టుకునేలా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాత్ర పూర్తి చేసుకోవడానికి పేద, మధ్య తరగతి వారు సైతం కొనుగోలు చేసే ధరలలో అందుబాటులో ఉన్నాయని మొహమ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మొహమ్మద్ ఇల్యాస్ బుఖరి తెలిపారు. ఈ అమరనాథ్ యాత్రలో అవసరం అయ్యే, లేథర్ జాకెట్, రెయిన్ కోర్ట్, వింటర్ క్యాప్, ట్రావెల్ బ్యాగ్, వులేన్ సాక్స్, హ్యాండ్ గ్లోవ్స్, గొడుగు, రెయిన్ క్యాప్‌లతో పాటు అవసరమయ్యే అన్ని రకాల వస్తువులు ఉంచామ న్నారు. వీటితో యాత్ర కు వెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

ట్రాన్స్‌పోర్ట్ హమాలి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ట్రాన్స్ పోర్ట్ హమాలి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీఐటీయు హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు పి. నాగేశ్వర్, కె. జంగయ్యలు డిమాండ్ చేశారు. ట్రాన్స్ పోర్ట్ హమాలి కార్మికుల సమావేశం నాయకులు జి. వెంకటేష్ అధ్యక్షతన కిషన్ గంజ్ (సీఐటీయు) కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ ట్రాన్స్ పోర్ట్, హమాలి కార్మికులు ఈ ప్రాంతంలో వందలాది మంది రాత్రిలు పనిచేస్తున్నారన్నారు. వారికి సరి యైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిత్యం లోడింగ్, అన్ లోడింగ్ చేసే హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 55 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులకు నెలకు రూ.5వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీ కార్మికుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్తార్ గంజ్, మహరాజ్ గంజ్ హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చెన్నయ్య, ఆర్.సాయిలు, ఉపాధ్యక్షులు పి. కుర్మయ్య, నాయకులు మోహన్, హన్మంతు,తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



- జంగంమెంట్‌లో 'డ్రై డే ఫ్రైడే'లో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-ధూల్‌పేట్

మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ సర్కిల్ 10 డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాతబస్తీ ఫలక్ నూమా పరిధిలోని జంగంమెంట్ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఫలక్‌నూమా సర్కిల్ 10 ఆధ్వర్యంలో "డ్రై డే" కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ "డ్రై డే" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ఎలా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులకు, స్థానికులకు, బస్తీవాసులకు తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు సూచించారు. మరి ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా వాటిని నివారించవచ్చని అవగాహన కల్పించారు.

'కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి'

- అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చేపూరి రాజు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే ప్రజల పక్షాన నిలబడి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్ సీ) పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చేపూరి రాజు హెచ్చరించారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ 26వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపూరి రాజు మాట్లాడుతూ తమకు రాష్ట్ర వ్యాప్తంగా 50 వేలకు పైగా పార్టీ సభ్యత్వం ఉందని తెలిపారు. త్వరలోనే పార్టీ భవిష్యత్ కార్యచరణను ప్రకటించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతామని ఆయన పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో 'రాజ్యంగ పరిరక్షణ యాత్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజలకు రాజ్యాంగ హక్కులు, అధికారణాలు, ప్రాథమిక స్వేచ్ఛ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు వాడాల భాస్కర్, కులిమిద్ద అంజయ్య, బి.శ్రీనివాస్ మాదిగ, షేక్ మహబూబ్, లింగస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పలు కాలనీల్లో పర్యటించిన బొంతు శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీ రోడ్డు నెంబర్ మూడు తోపాటు వివిధ కాలనీల్లో చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవియాదవ్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్స్, వాటర్, డ్రయినేజీ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఆమె వెంట ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు కాసుల పోచయ్య గౌడ్, నాగిళ్ల బాల్ రెడ్డి, బోడిగ ప్రభు గౌడ్, కాసుల అంజయ్య గౌడ్, తదితరులున్నారు.

పుంజాల అలేఖ్య వినయ్ కుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ - కూకట్ పల్లి

రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మెన్‌గా శుక్రవారం బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ పుంజాల అలేఖ్య వినయ్ కుమార్‌ను రవీంద్ర భారతిలోని ఆమె కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర బీసీ వికాస్ సమితి, రాష్ట్ర అధ్యక్షులు బాశెట్టి నర్సింగరావు, అశోక్ చారి, జోరాపురి అశోక్, సురేష్, చంద్రశేఖర్, వేణు, రాహుల్, శ్రీకాంత్, కుమార్, మహేష్ తదితరులు ఉన్నారు.

సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్ సందర్శన



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సఫిల్ గూడ మినీ ట్యాంక్ బండ్ చెరువును హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి,మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్‌లు సందర్శించారు. సఫిల్‌గూడ చెరువును సుందరీకరణ చేయాలని, చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని, గుర్రపు డెక్కను తొలగించాలని జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో కార్పొరేటర్ శ్రవణ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నగర మేయర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి శుక్రవారం చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులు, మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రతి విద్యార్థి తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని యాదవ్ నగర్‌లోని సిద్దార్థ హై స్కూల్‌లో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన డెంగ్యూ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజుకు 10 నిమిషాలు కేటాయించి ఇండ్లలో నీరు నిలిచి ఉండే చోటును గుర్తించి వాటిని శుభ్రపరుచుకుంటే డెంగ్యూ వచ్చే అవకాశాలను తగ్గించుకోచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ ఏఈ వనజ, సిద్దార్థ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఆనంద్ రావు, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, సిస్టి రాములు, కిట్టు, నర్సింగ్ రావు, భిక్షపతి, నాగేష్ గౌడ్, బాచి, మహిళా నాయకులు, అనిత, వరలక్ష్మి శైలజ తదితరులు పాల్గొన్నారు.

బోనాల నిర్వహణపై అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరిలో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ వివిధ డిపార్టుమెంట్ల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రయినేజీ లీకేజీ లేకుండా చూడాలని సూచించారు. పండుగపూట మంచి నీరు సరిపడా వదలాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చే మహిళలకు ఇబ్బంది కాకుండా చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. రోడ్డుకు ప్యాచ్ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ, డీసీ రాజు, కార్పొరేటర్ శ్రవణ్, డిటెకటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఏడీఈ యాదగిరి, హార్టికల్చర్ మహేశ్వరి, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశ్రీత, శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, గుడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన మేయర్



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌కు చెందిన నాగరిగారి ప్రీతం నియమితులైన సందర్భంగా వారిని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మోత్కూర్ మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం కవితలక్ష్మి నరసింహారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట 1వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆంజనేయులు, తిరుమలేష్ తదితరులున్నారు.

సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదుల విధుల బహిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సిద్దిపేటలో ఒక కేసు విషయంపైన పోలీసు స్టేషన్‌కి వెళ్లిన న్యాయవాదిపైన ఏఎస్ఐ అకారణంగా దాడి చేయడాన్ని ఖండిస్తూ, దాడికి నిరసనగా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో గురువారం విధులు బహిష్కరిస్తున్నట్టు అధ్యక్షులు శ్రీనివాస చారి వెల్లడించా రు. గురువారం నిరసన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని దీనిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదుల కోసం కొత్త చట్టాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. న్యాయవాదులు విధులు బహిష్కరించి పెద్ద సంఖ్యలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మైసమ్మగూడలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- పట్టింపులేని టౌన్ ప్లానింగ్ అధికారులు
- చైర్ పర్సన్ భర్త అండదండలతోనే కొనసాగుతున్నాయని ఆరోపణలు
- భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలో జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగు తున్నాయి. కాగా పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. మున్సిపల్ చైర్ పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి అండదండలతోనే జోరుగా అక్రమ నిర్మాణాలకు కొనసాగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. మైసమ్మగుడలో ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. మున్సిపల్, హెచ్ఎండీఏ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు డబ్బులు దండుకొని చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మైసమ్మగూడలో మల్లారెడ్డి యూనివర్సిటీ ఏర్పాటు కావడంతో ఇక్కడ హాస్టళ్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దీన్నే అదునుగా చేసుకున్న నిర్మాణదారులు నాలాలు, ఎఫ్‌టీఎల్‌ను కబ్జాలు చేసి భారీ ఎత్తున బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టి హాస్టల్స్‌ను కిరాయికి ఇస్తున్నారు. ఇట్టి అక్రమ నిర్మాణాలన్నీ స్థానిక ఎమ్మెల్యే బావమరిది సహకారంతోనే కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు తక్షణమే స్పందించి మైసమ్మగూడలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.





అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం



గుడ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాల వెనుకల ఎంతటి వారున్నా ఉపేక్షించే లేదు. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడుతాం.

- మేడ్చల్, మున్సిపల్ కమిషనర్, శ్రీహరి

ఎస్సీ బాలుర వసతి గృహంలో మౌలిక వసతులేవి..

- 111 మందికి 3 బాత్రూంలు, 3 టాయిలెట్స్
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- సమస్యలను పరిష్కరించాలని విన్నపం

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో 111మంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉంటూ మేడ్చల్ జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఈ హాస్టల్‌లో మూడో తరగతి నుంచి పదో తరగతికి చెందిన విద్యార్థులు ఉంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపుగా నెల రోజులు గడుస్తున్నా విద్యార్థులకు నోట్ బుక్స్, హాస్టల్ డ్రెస్సులు ఇంకా అందలేదు. హాస్టల్‌లోని 111 మంది విద్యార్థులకు కలిపి కేవలం మూడు బాత్రూంలు, మూడు టాయిలెట్స్ మాత్రమే ఉండడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి చెల్లించే



రూ.62 కాస్మోటిక్ చార్జీతో కట్టింగ్, ఆయిల్, సోప్, షాంపూ, టూత్ పేస్ట్, బ్రెష్ వస్తులను కొనలేని పరిస్థితిలో ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న నలుగురు ట్యూటర్స్ సైతం కేవలం నెలకు రూ .1500 చెల్లించడంతో చాలీచాలని వేతనంతో వారు కొనసాగుతున్నారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి సరిపడా కంప్యూటర్లు కూడా లేవు. కేవలం రెండు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. హాస్టల్ వార్డెన్ సుధాకర్‌రెడ్డిని బాత్రూంల విషయంపై వివరణ కోరగా తాను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని సమాధానం ఇచ్చారు. తక్షణమే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు కోరుతున్నారు.



మృతుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

బీజేఆర్ కాలనీకి చెందిన అంబాదాస్ మరణించడంతో బీఆర్ఎస్ నాయకులు సింగిడి సోమశేఖర్‌రెడ్డి అంత్యక్రియల కోసం మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మృతుడి కుటుంబం సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుషాయిగూడ శ్మశాన వాటికలో దహన సంస్కరాలకు ఏర్పాటు చేయించారు. అంబాదాస్ పేదరికాన్ని తెలుసుకుని ఆర్థిక సాయం అందజేసినట్టు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని సాయం చేసిన సోమశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పోచయ్యకు కాంగ్రెస్ నేతల పరామర్శ



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు మాజీ సర్పంచ్ సింగరేణి పోచయ్య తల్లి రాజమ్మ గురువారం అనారోగ్యంతో మరణించారు. కాగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, మాజీ సర్పంచ్‌లు బాబు యాదవ్, దుడ్డు సంజీవ రావు, కోల శ్రవంతి వెంకటేష్, కౌన్సిలర్లు జాకట దేవ, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు తుపాకుల కృష్ణ, మాజీ సొసైటీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, సొసైటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రేగు రాజు మృతురాలి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల అశ్రు నయనాల మధ్య రాజమ్మ అత్యక్రియలు నిర్వహించారు.

గాన కోకిల అవార్డు అందుకున్న వెంకటేశం



నవతెలంగాణ-జవహర్ నగర్

ఉత్తర తెలంగాణలోని కవులు, కళాకారులకు, ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉద్యమ గాన కోకిల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉత్తమ గాన కోకిల అవార్డును కానుగంటి వెంకటేశం అందుకున్నారు. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రెస్ భవన్‌లో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, జిల్లాలకు చెందిన 40 మంది కళాకారులకు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ కుమార్, అవార్డులను అందజేశారు. జానపద కళా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానుగంటి వెంకటేశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాంస్కృతిక శాఖలో పని చేస్తూ అనేక కళా ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులను అందుకున్నాడు. మూడో అవార్డు శుక్రవారం కరీంనగర్‌లో ఉత్తమ ఉద్యమ గాన కోకిల అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, మేధావులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటేనే జీవితానికి సార్థకత

- కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్
- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదలను ఆదుకోవడంలోనే జీవితానికి సార్థకత ఏర్పడుతుందని, తద్వారా సమాజంలో మంచి పేరు వస్తుందని మదర్ థెరిస్సా కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో నేషనల్ థర్మల్, పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో 50 మంది పేదలకు మెడికల్ కిట్లు, టబ్బులు, అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బూడిద వెంకటేష్ మాట్లాడుతూ.. పేద ప్రజలు ఎక్కువగా ఉండే జవహర్ నగర్‌లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ వారు దయార్ధ హృదయంతో లెప్రసి బాధితులకు మెడికల్ కిట్లు, టబ్బులు అందజేస్తూ ఎనలేని సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా కాలనీవాసులు పాల్గొన్నారు.



వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

రెవెన్యూ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చర్లపల్లి డివిజన్ వార్డు ఆఫీస్‌లో వివిధ కాలనీల వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ అధికారులతో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతకాలంగా నల్లా బిల్లు బకాయిలు చెల్లించడం లేదని అధికారులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ మాట్లాడుతూ.. నల్లా బిల్లుల బకాయిలు కొంతకాలంగా కట్టని వారితో కాలనీల వారీగా సమీక్ష నిర్వహించి నల్లా బిల్లుల బకాయిలు అధికంగా ఉన్నవారికి విడతలవారీగా చెల్లించేలా చర్యలు తీసుకుంటానన్నారు. నల్లా వినియోగదారులను ఎలాంటి ఇబ్బంది పెట్టకూడదని, నల్లా కనెక్షన్ తొలగించకూడదని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు సుధాకర్, రవీందర్, మహేష్, రాఘవులు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే



నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని నగరాల, పట్టణాల్లో 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే కొనసాగుతోంది. గత నెల 24వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 44 పట్టణాలు, నగరాల పరిధిలోని 3380 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం ఫీడర్ల సర్వే పూర్తయింది. సంస్థ రూపొందించిన టీజీఏఐఎంఎస్ (టీజీఎస్‌పీడీసీఎల్ జీఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ మెయిన్‌టెనెన్స్ సిస్టం) యాప్‌లో సబ్ స్టేషన్స్, పోల్ లొకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ స్ట్రక్చర్, రింగ్ మెయిన్ యూనిట్, ఆటో రీక్లోజర్, లైన్ ఏబీ జీఐఎస్ మాపింగ్ చేయడంతో పాటు, పోల్ పరిస్థితి (సిమెంట్/ ఐరన్/ రైల్వే ట్రాక్ పోల్), డీటీఆర్ స్ట్రక్చర్ ఎలా ఉంది, విద్యుత్ తీగల పరిస్థితి, పోల్స్ మధ్య గ్యాప్ వంటి విషయాలను వాటి అక్షాంశాలు / రేఖా అంశాలతో (జీఐఎస్) పాటు ఆప్‌లో నిక్షిప్తం చేస్తారు. ఈ సమగ్ర సర్వే వల్ల సంస్థకు చెందిన యావత్ మౌలిక వసతుల సమాచారం యాప్‌లో నిక్షిప్తం అవుతుంది. ఈ సమాచారం ఆధారంగా సెక్షన్‌ల వారీగా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఖచ్చిత అంచనాలు నమోదవుతాయి. మరమ్మతులు, నిర్వహణ సులభతరం అవుతుంది. దీని వల్ల క్షేత్ర స్థాయిలో జరిగే పనుల్లో పారదర్శకత వల్ల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు సంస్థ అభివృద్ధికి సైతం దోహదం చేస్తుందని సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లోని చార్మినార్, గుల్జార్ హౌస్, పత్థర్ గట్టి, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని కేబుల్ బ్రిడ్జి, అంబెద్కర్ యూనివర్సిటీ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో ముషారఫ్ ఫరూఖీ పాల్గొని టీజీఏఐఎంఎస్ ఆప్ పని విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ డాక్టర్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు పి.ఆనంద్, కె.నరసింహ స్వామి, సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో నీరు వృథా

నవతెలంగాణ-కాప్రా


వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కాప్రా డివిజన్‌లోని సాయిబాబా నగర్ కాలనీలో ఓవర్ రెడ్ ట్యాంకు నిండిపోయి పరిసర ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరుతోంది. ప్రజలకు తాగడానికి నీరు లేక ఇబ్బందు లకు గురవుతుంటే నీటిని వృథాగా వదిలేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ట్యాంక్ నిండిన తర్వాత బంధు చేయాల్సిన సిబ్బంది అందుబాటు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో నీరు వృథాగా పోతున్నదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నాడు ఓ మేధావి. ఇటువంటి సమాజంలో డబ్బు కోసం ఎంతకైనా దిగజారుతున్న వ్యక్తులను మనం చూస్తున్నాం. వ్యసనాలకు బానిసలై అవసరాలు తీర్చుకునేందుకు వావివరసలను మర్చిపోతున్నారు. కట్టుకున్న భార్యను, కడుపున పుట్టిన బిడ్డల జీవితాలను ఫణంగా పెడుతున్నారు. అయినా భర్తలో మార్పు కోసం తపించే భార్యలు, తల్లి కండ్లలో ఆనందాన్ని చూడాలనుకునే బిడ్డలు ఉండబట్టే బంధాలు ఇంకా కొనసాగుతున్నాయి. అలాంటి ఓ కథనమే ఈ వారం ఐద్వా అదాలత్‌లో చదువుదాం...

అతను మారాలని..?

ఐద్వా అదాలత్
సెల్: 9490098024



45 ఏండ్ల పల్లవి తన కూతురు రుచికను తీసుకొని మా ఆఫీస్‌కు వచ్చింది. పల్లవి కంటే ఆమె సమస్య గురించి రుచికనే ఎక్కువగా మాట్లాడింది. వారి సమస్య అలా ఉంది మరీ. పల్లవికి రఘుతో పెండ్లి జరిగి 25 ఏండ్లు అవుతుంది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. మొదటి పాప రుచిక నర్సింగ్ చేస్తుంది. రెండో పాప రాగిణి డిగ్రీ చదువుతోంది. అయితే ఆమె భర్తకు పెండ్లికి ముందు నుండే తాగే అలవాటు వుంది. పెండ్లి చేస్తే మారతాడని అతని తల్లిదండ్రులు అనుకున్నారు. కానీ అతనిలో ఎలాంటి మార్పూ లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేదు. ఇద్దరు పిల్లలు పుట్టినా బాధ్యత లేకుండా తిరుగుతుంటాడు.

పల్లవికి తండ్రి లేడు. తల్లి మాత్రమే ఉంది. ఆమెను బాధ పెట్టడం ఇష్టం లేక ఎంత కష్టం వచ్చినా రఘుతోనే కలిసి ఉంటుంది. రఘు వాళ్ళ నాన్న ఆర్‌ఎంపీ డాక్టర్. ఆయన 'నా కొడుకుతో పెండ్లి చేసి పల్లవికి నేను అన్యాయం చేశాను. ఎలాగైనా ఆమె తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలి' అనుకున్నాడు. ఇద్దరు పిల్లల్ని అత్త చూసుకునేది. పల్లవి మళ్లీ చదవడం ప్రారంభించింది. మామగారే ఫీజు కట్టేవారు. అలా పల్లవి మామ ప్రోత్సాహంతో లాబ్ టెక్నీషన్ కోర్సు చేసి ఉద్యోగం సంపాదించింది. పిల్లల్ని అత్త ఎంతో ప్రేమగా చూసుకునేది. రఘు గురించి ఆలోచించకుండా పల్లవి జీవితం హాయిగా సాగిపోతుంది. ఇలాంటి సమయంలో అంతా మారిపోయింది. పిల్లల్ని ఎంతో ప్రేమగా చూసుకునే అత్త చనిపోయింది.

తల్లి చనిపోయిన బాధ కూడా లేకుండా రఘు మాత్రం తాగుతూనే ఉన్నాడు. పైగా అప్పులు చేయడం మొదలుపెట్టాడు. పల్లవి ఉద్యోగం చేసే దగ్గరకు వెళ్ళి డబ్బులు అడిగేవాడు. ఇవ్వనంటే కొట్టేవాడు. భర్తను వదిలి వెళ్లిపోతే సమాజం ఏమనుకుంటుందో అనే భయం ఆమెలో ఉండేది. అలాగే తనను చదివించి ఉద్యోగం వచ్చేలా చేసిన మామను వదిలి పెట్టి వెళ్ళడం కూడా ఆమెకు కరెక్టు అనిపించలేదు. అలా కొన్ని రోజులు గడిచిపోయాయి.

> ఆమె ఎవరితో మాట్లాడినా వారితో సంబంధం అంటగడుతుంటాడు. అంతే కాదు అందులో కొంత మంది ఫోన్ నెంబర్లు తీసుకొని పల్లవి పేరుతో చాట్ చేయడం ప్రారంభించాడు.

తర్వాత ఆయన కూడా చనిపోయాడు. అయితే చనిపోయే ముందు 'రఘును ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్లొద్దు' అని పల్లవి దగ్గర మాట తీసుకున్నాడు. దాంతో ఇప్పటి వరకు అతను ఎన్ని వేషాలు వేసినా భరిస్తూ వచ్చింది. కానీ ఆమె ఉద్యోగం మాత్రం చాలా ఆస్పత్రుల్లో మారాల్సి వచ్చింది.

ఆమె ఎవరితో మాట్లాడినా వారితో సంబంధం అంటగడుతుంటాడు. అంతే కాదు అందులో కొంత మంది ఫోన్ నెంబర్లు తీసుకొని పల్లవి పేరుతో చాట్ చేయడం ప్రారంభించాడు. పల్లవి అడుగుతున్నట్టు అడిగి డబ్బులు తీసుకునేవాడు. ఇలా మూడేండ్ల నుండి దాదాపు పది మంది దగ్గర డబ్బులు తీసుకున్నాడు. అలాగే ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నాడు. వాటిని తిరిగి కట్టడు. డబ్బులు చెల్లించకపోవడంతో ఒక యాప్ వారు పల్లవి ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యంగా మెసేజ్ పెట్టారు. అవి చూసి రఘు, పల్లవి పేరుతో చాట్ చేస్తున్న వారిలో ఇద్దరు ఆమె ఇంటికి వచ్చారు.

వచ్చీ 'నేను నీకు అడిగినప్పుడల్లా డబ్బులు ఇస్తూనే ఉన్నాను. అయినా ఏం అవసరం వచ్చిందని ఇలాంటి పనులు చేస్తున్నావు. మేము నీ దగ్గరు వస్తామంటే ఒప్పుకోకుండా మూడేండ్ల నుండి చాటింగ్‌తో కాలం గడుపుతున్నావు. మరి వాళ్ళలో నీకు ఏం నచ్చింది' అని నిలదీశారు. అప్పుడు గానీ పల్లవికి అసలు విషయం అర్థం కాలేదు. తనకు తెలియకుండా రఘు వాళ్ళతో చాటింగ్ చేస్తున్నాడని. భర్త కదా అని గుడ్డిగా నమ్మినందుకు ఇలా చేశాడని కుంగిపోయింది. 'ఇలా ఎందుకు చేశావు' అని అడిగితే 'తాగడానికి డబ్బులు అడిగితే నువ్వు ఇవ్వడం లేదు, అందుకే నీలా చాటింగ్ చేసి వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకుంటున్నా. నీకు వాళ్ళతో సంబంధం లేకపోతే అడిగిన వెంటనే డబ్బులు ఎందుకు ఇస్తారు' అని పిల్లల ముందే అసభ్యంగా మాట్లాడాడు.

ఇలాంటి పరిస్థితుల్లో కూతురు రుచిక ఇదంతా భరించలేక తల్లిని తీసుకొని ఐద్వా అదాలత్‌కు వచ్చింది. అతన్ని పిలిచి మాట్లాడినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. పైగా తల్లికి సపోర్ట్ చేస్తున్న రుచికను టార్గెట్ చేశాడు. ఇన్ని రోజులు పల్లవి పేరుతో చాటింగ్ చేసే అతను ఇప్పుడు కన్న కూతురని కూడా చూడకుండా రుచిక పేరుతో చాట్ చేయడం మొదలుపెట్టాడు.

ఏం చేసినా అతనిలో మార్పు రాకపోవడంతో ఇక పల్లవి భరించలేక పోయింది. ఇంకా ఇంకా దిగజారి పోతున్న అతనితో కలిసి వుండడం కష్టమనే నిర్ణయానికి వచ్చింది. అయినా మామకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు తన చివరి ప్రయత్నంగా ఐద్వా సహకారంతో రీహాబిటేషన్ సెంటర్‌లో చేర్పించింది. ప్రస్తుతం అక్కడ అతనికి కౌన్సెలింగ్ ఇస్తూ చికిత్స చేస్తున్నారు. ఇప్పటికైనా భర్తలో మార్పు వస్తుందేమో అనే ఆశతో ఎదురుచూస్తోంది.

> ఏం చేసినా అతనిలో మార్పు రాకపోవడంతో ఇక పల్లవి భరించలేకపోయింది. ఇంకా ఇంకా దిగజారిపోతున్న అతనితో కలిసి వుండడం కష్టమనే నిర్ణయానికి వచ్చింది.

- వై వరలక్ష్మి, 9948794051

డెంగ్యూ ముప్పు.. తప్పించుకుందాం ఇలా..

డెంగ్యూ సోకినపుడు విపరీతమైన జ్వరం ఉంటుంది. అంతే కాదు భరించలేనంత తలనొప్పి, కళ్ళల్లో మంట, కనురెప్పల చుట్టూ నొప్పి, ఒళ్ళు నొప్పులు, మంటతో కూడిన కీళ్ల నొప్పులు, అనారోగ్యానికి గురైన కొద్ది రోజుల్లో దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఇలా చేద్దాం...

వర్షాకాలం వచ్చే వ్యాధుల్లో ప్రధానమైన వాటిల్లో డెంగ్యూ ఒకటి. ఇది సాధారణంగా 8-10 రోజుల పాటు వేధించే వ్యాధి. ఏడిస్ జాతికి చెందిన దోమలు కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. అయితే చాలా వరకు డెంగ్యూ



లక్షణాలు సాధారణ జ్వరాన్ని పోలి ఉండడంతో మొదట్లో గుర్తించడం కష్టంగా ఉంటుంది. అయితే నిర్లక్ష్యంగా వుంటే కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయానికి దారి తీస్తుంది.

వ్యాధి లక్షణాలు

డెంగ్యూ సోకినపుడు విపరీతమైన జ్వరం ఉంటుంది. అంతే కాదు నిరంతరం తలనొప్పి, కళ్ళల్లో నొప్పి, కనురెప్పల చుట్టూ నొప్పి, ఒళ్ళు నొప్పులు, మంటతో కూడిన కీళ్ల నొప్పులు, అనారోగ్యానికి గురైన కొద్ది రోజులలో దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే విపరీతంగా వాంతులు, చిగుళ్లలో రక్తస్రావం, కడుపునొప్పి విపరీతమైన అలసట వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

ఇలా జాగ్రత్తపడాలి..

సాధారణంగా దోమలన్నీ ఎక్కువగా చీకటి పడ్డ తర్వాత విజృంభిస్తాయి. కానీ డెంగ్యూ వ్యాధిని కలిగించే ఏడిస్ దోమలు పగటిపూట కుడతాయి. ఇవి మురుగు నీటిలో పెరుగుతాయి కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. రాత్రి పూట నీటి ఉపరితలంపై గుడ్లను పెడుతుంటాయి. డెంగ్యూ వైరస్ సోకిన రోగిని కుట్టిన తర్వాత దోమ ఆ వైరస్‌ను తీసుకెళ్లి ఆరోగ్యంగా ఉన్న మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. కాబట్టి దోమల నుంచి శరీరాన్ని కాపాడుకోవాలని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు. ■

జూన్ 25 రాజ్యాంగ హత్యాదినం

న్యూఢిల్లీ : 1975లో ఎమర్జెన్సీ విధించిన జూన్ 25ను ఇక నుంచి ప్రతీ ఏటా 'సంవిధాన్ హత్యా ది వస్'(రాజ్యాంగ హత్యాదినం) గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రతీ ఏటా జూన్ 25న 'సంవిధాన్ హత్యా దివస్' పాటించడం ద్వారా 1975 ఎమెర్జెన్సీలో అమానవీయమైన బాధలు అనుభవించిన అందరి భారీ సహకారాన్ని స్మరించుకున్నట్టు అవుతుంది' అని తెలిపారు. అలాగే, "సంవిధాన్ హత్యా దివస్'ను పాటించడం ద్వారా ప్రతీ భారతీయుడిలోనూ వ్యక్తిగత స్వేచ్ఛను, ప్రజాస్వామ్య రక్షణ యొక్క శాశ్వతమైన జ్వాలను సజీవంగా ఉంచడానికి సహాయపడుతుంది. తద్వారా కాంగ్రెస్ వంటి శక్తులు ఇలాంటి ఘోరాలను పునరావృతం చేయకుండా నిరోధించినట్లవుతుంది' అని అన్నారు. ఈ నిర్ణయంపై విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా అమిత్ షా పోస్టు చేశారు. ఇందులో ఎలాంటి ఇంగ్లీషు అనువాదం లేకుండా ఇంగ్లీష్ అక్షరాల్లో 'సంవిధాన్ హత్యా దివస్' అనే హిందీ పదానే ఉపయోగించారు. ఈ నిర్ణయం గురించి ప్రధానమంత్రి మోడీ స్పందిస్తూ 'భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కితే ఏం జరుగుతుందో ఈ రోజు గుర్తు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఈ నిర్ణయాన్ని 'మీడియాలో హెడ్‌లైన్స్ కోసం చేస్తున్న మోసపూరిత వ్యాయామం'గా విమర్శించింది.

న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్‌పై అధ్యయనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులో అమెరికాకు వెళ్లనున్నారు. అందుకోసం ఆయన తన పాస్‌పోర్టును శుక్రవారం సాయంత్రం రెన్యూవల్ చేయించుకున్నారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో కలిసి సీఎం యూఎస్‌లో పర్యటించనున్నారు. అక్కడి న్యూయార్క్‌లోగల టైమ్ స్క్వేర్‌పై వారితో కలిసి అధ్యయనం చేయనున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలైన నెక్లెస్ రోడ్, లుంబినీవనం, లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఆకాశ హార్మ్యాలు నిర్మించాలని భావించింది. వాటిని వ్యాపార, వాణిజ్య సముదాయాలుగా మార్చి విదేశీ బహుళ జాతి కంపెనీలకు అద్దెకు ఇవ్వాలనేది నాటి సీఎం కేసీఆర్ ఆలోచనంటూ వార్తలొచ్చాయి. తద్వారా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం లభిస్తుందంటూ ఆనాటి బీఆర్ఎస్ సర్కారు చెప్పుకుంది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఈలోగా బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఇప్పుడు హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల్లోగానీ, హైదరాబాద్‌లోని మరేదైనా ప్రాంతంలోగానీ న్యూయార్క్ టైమ్‌స్క్వేర్ తరహాలో పెద్ద పెద్ద టవర్లను నిర్మించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఆ క్రమంలోనే సీఎం అమెరికా వెళ్లనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

16న కలెక్టర్ల సమావేశం
9 అంశాలతో అజెండా ఖరారు
ప్రభుత్వ పథకాలపై దిశానిర్దేశం చేయనున్న సీఎం

ఈనెల 16న కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. ధరణి, ప్రజాపాలన, ఖరీఫ్ సాగు మొదలగు 9 అంశాలపై ఈ సమావేశంలోవారికి సీఎం దిశా నిర్దేశం చేయనున్నారు. కొందరు కలెక్టర్లు కార్యాలయాలకే పరిమితమవుతుండటంతో, క్షేత్రస్థాయిలో పాలన కుంటుపడిందనే అభిప్రాయంతో సీఎం ఉన్నట్టు సమాచారం. ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఇదే అంశాన్ని నేరుగా ప్రస్తావించారు. కలెక్టర్లు తమ ప్రవర్తన మార్చుకొనేలా చర్యలు చేపట్టాలని ఆదేశించిన విషయం విదితమే. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కీలక భూమిక పోషించే కలెక్టర్ల వ్యవస్థ బలంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేస్తున్న కలెక్టర్ల సదస్సు ప్రధాన్యత సంతరించుకుందని భావిస్తున్నారు.

ఎజెండాలోని 9 అంశాలు

1).ధరణి సమస్యలు. 2).వ్యవసాయం- కాలానుగుణ పరిస్థితులు. 3).ఆరోగ్యం..సీజనల్ వ్యాధులు. 4).వన మహోత్సవం. 5).మహిళా శక్తి. 6).విద్య. 7).శాంతి భద్రతలు-సెక్యూరిటీ సంబంధిత సమస్యలు. 8).డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం. 9). ప్రజా పాలన.

పాతా కొత్తా లేదు..అంతా మనోళ్లే

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్త సీఎం అయ్యే అవకాశముందన్నారు. బీజేపీ ఉత్తర భారతానికే పరిమితం కాదని చెబుతూ దక్షిణ భారతంలోనూ మంచి ఫలితాలను సాధించిందన్నారు. కేరళలో ఖాతా తెరిచామనీ, తమిళనాడులో మెరుగైన ఓటు బ్యాంకు సాధించామని చెప్పారు. కర్నాటక, తెలంగాణలో ఆశించిన సీట్లను దక్కించుకున్నామన్నారు. కాంగ్రెస్ 13 రాష్ట్రాల్లో ఖాతా తెరువలేదనీ, మూడోసారీ వంద సీట్లు రాలేదని విమర్శించారు. ఎన్డీఏ అధికారంలో ఉన్నన్ని రోజులు రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో హిందూ విరోధి ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసానిచ్చారు. దేశంలో ఆర్థికంగా వృద్ధి చెందిన టాప్-5 నగరాల్లో హైదరాబాద్ ఒకటని చెప్పారు.

రాహుల్‌కు దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా ఓయూకి రావాలి : బండి సవాల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల పేరిట యువతను మోసం చేసిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. రాహుల్‌గాంధీకి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రావాలని సవాల్ విసిరారు. తమ పార్టీ చేస్తున్న పోరాటాల వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. దాని ఫలితంగానే రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలు గెలిచామనీ, మిగతా వాటిలోనూ అనుకున్న స్థాయిలో ఓట్‌బ్యాంక్ పెరిగిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారీగా కార్యకర్తలు దృష్టి పెట్టి పనిచేయడం వల్లనే పార్టీ విజయం సాధ్యమైందన్నారు. తమ గెలుపు అయిపోయిందనీ, స్థానిక సంస్థల్లో బూత్ లెవల్ నాయకులను గెలిపించడమే తమ టార్గెట్ అని చెప్పారు. కేసీఆర్ దగ్గరుండీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు ఒక్కటవుతున్న నేపథ్యంలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

8 స్థానాలు గెలిపించిన తెలంగాణ ప్రజలకు సెల్యూట్ : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ స్థానాలు గెలిపించిన తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సెల్యూట్ చేశారు. ఆ గెలుపులో పార్టీ కార్యకర్తల కృషి మరువలేనిదని కొనియాడారు. సీఎం ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో, సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బీజేపీ జెండా ఎగురవేశామన్నారు. రాజ్యాంగం మార్పు, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు కాంగ్రెస్ నేతల మాటలు నమ్మలేదన్నారు. రాష్ట్రంలో తమ ఓటు బ్యాంకు 14 శాతం నుంచి 34 శాతానికి పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా బలోపేతం కోసం కార్యకర్తలు మరింత ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనీ, వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసుల నిర్బంధం పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిస్సిగ్గుగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని ఆరోపించారు. లిక్కర్ దందాతో ఖజానా పెంచి పాలన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. అప్పులు చేయడం, ప్రభుత్వ భూములను అమ్మడం, ట్యాక్సీల పేరిట వసూళ్ల దందా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. 15 అంశాలతో రాజకీయ తీర్మానాన్ని బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ప్రవేశపెట్టి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, కాంగ్రెస్ పార్టీ అవినీతిపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..ఫిర్జాదిగూడలో రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లను కూల్చేయించడాన్ని తప్పుబట్టారు. ప్రతిబిల్లుకూ కమిషన్ ఇస్తే తప్ప విడుదల చేయని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల దగ్గర నుంచి పెద్దఎత్తున వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, డీకే. అరుణ, జి.నగేశ్, అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజాసింగ్, కె.వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వేదికను పంచుకున్నారు.

బలమైన వ్యవస్థగా హైడ్రా

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. పని విభజనకు వీలుగా నగరంలోని జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్దేశించాలని సీఎం సూచించారు. రెండు వేల కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించటం, నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగానికి అప్పగిస్తున్నట్టు సీఎం తెలిపారు. వాటిని కాపాడే విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు. హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్ సరఫరా లైన్లు, డ్రయినేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలందిస్తుందని చెప్పారు. హైడ్రా ఆధునీకరణ, సిబ్బంది విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అపరాధ రుసుము వసూలు బాధ్యతను బదలాయించాలని ఆదేశించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాష్టీకం

లక్నో: యోగి పాలనలో మైనార్టీలపై ఆగడాలు ఆగటంలేదు. ముస్లింలు..దళితులపై అంతులేని అరాచకాలు జరుగుతున్నా..అక్కడి సర్కార్ పట్టించుకోవటంలేదు. దీంతో అగ్రవర్ణాలు రెచ్చిపోతున్నాయి. తాజాగా ముగ్గురు వ్యక్తులు దళిత యువకుడ్ని కొట్టారు. అతడితో బలవంతంగా మూత్రం తాగించారు. ఆ యువకుడి కుటుంబం దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 15 ఏండ్ల దళిత యువకుడు, అతడి కుటుంబం గ్రామంలో డీజే నిర్వహిస్తోంది. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో సౌండ్, ఆడియో సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తారు.

కాగా, ఆ యువకుడు ఒక ఫంక్షన్‌లో డీజే ఏర్పాటు చేశాడు. అయితే జనరేటర్‌లో ఇంధనం లేకపోవడంతో డీజే నిలిపివేశాడు. అదనంగా డబ్బులు డిమాండ్ చేయడంతో ముగ్గురు వ్యక్తులు అతడితో ఘర్షణకు దిగారు. కార్యక్రమం తర్వాత ఇంటికి వెళ్తున్న యువకుడ్ని వారు అడ్డుకుని కొట్టారు. బాటిల్‌లో మూత్రం పోసి బలవంతంగా అతడితో తాగించారు. దీనిని వీడియో రికార్డ్ చేసి సర్క్యులేట్ చేశారు.మరోవైపు ఇంటికి చేరుకున్న ఆ యువకుడు ఈ విషయాన్ని తన కుటుంబానికి తెలిపాడు. అతడి బంధువులు, సోదరుడు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపిన పోలీసులు కిషన్ తివారీ, దిలీప్ మిశ్రా, సత్యం తివారీని గురువారం అరెస్ట్ చేశారు. దిలీప్ మిశ్రా మద్యం బాటిల్‌లో మూత్ర విసర్జన చేసినట్లు పోలీసులు తెలిపారు. సత్యం, కిషన్ కలిసి ఆ యువకుడి నోటి వద్ద బాటిల్ ఉంచి బలవంతంగా మూత్రాన్ని తాగించారని చెప్పారు. వీడియో క్లిప్ చూసిన తర్వాత కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నైనీకి సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్, సింగరేణి సీఎమ్‌డీ బలరాంతో కలిసి ఒడిస్సాకు వెళ్లి అక్కడి సీఎంతో భేటీ అయ్యారు. 2015లో ఒడిస్సాలోని అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినా, ఇప్పటికీ అక్కడ ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటాన్ని ఆయన ప్రస్తావించారు. పలు అనుమతులకు సంబంధించిన సొమ్మును సింగరేణి కాలరీస్ సంస్థ ఇప్పటికే చెల్లించేసిందనీ, అయినా పాలనాపరమైన అడ్డంకులు ఏర్పడుతున్నాయనీ, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనికి ఒడిస్సా సీఎం మోహన్ చరణ్ సానుకూలంగా స్పందించారు. క్షేత్రస్థాయిలో అవసరమైన ఆదేశాలన్నీ ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం నైనీ బొగ్గు బ్లాకుల ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. అక్కడి స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరాతో పాటు ప్రజలతోనూ భేటీ అయ్యారు. నైనీ బొగ్గు గనికి సమీపంలోనే 1,600 మెగావాట్ల (2ఇ800) విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కూడా సింగరేణి ప్రతిపాదనలు చేసిందనీ, అవసరమైన అనుమతులన్నీ రాగానే ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. బొగ్గుగనిలో ఉత్పత్తి ప్రారంభమైతే స్థానిక యువతరానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా దాదాపు రూ.500 కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు.

ఇవీ సమస్యలు

నైనీ బొగ్గుగనిలో ఉత్పత్తి ప్రారంభానికి ఉన్న అవరోధాలను వివరిస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. దానిలో ప్రధానంగా సింగరేణికి కేటాయించిన అటవీ భూమి నుంచి చెట్ల గణన, వెలికితీత పనుల్ని వేగవంతం చేయాలని కోరారు. నిర్వాసితులైన కుటుంబాల కోసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల ఖరారు, స్థానిక పరిపాలనా అనుమతులు, పోలీసు శాఖ సహకారాన్ని అభ్యర్థించారు. అలాగే బొగ్గు రవాణాకు అనువుగా అక్కడి రోడ్లు, భవనాల శాఖ ద్వారా చెండిపాడు-జరపాడు రహదారి నిర్మాణం, విస్తరణను కోరారు. దీనికోసం సింగరేణి కాలరీస్ సంస్థ ఇప్పటికే రూ.35.23 కోట్లను డిపాజిట్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. అక్కడ హెచ్‌టీ లైన్ల నిర్మాణం కోసం ఇప్పటికే రూ. 9.25 కోట్లు డిపాజిట్ చేశామని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా వీటన్నింటినీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్ అండ్ పా) ఎస్వీకే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం స్కాం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. లిక్కర్ స్కామ్ కేసులో తనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు పూర్తిస్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యులను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ తీర్పు ఇచ్చింది. మొత్తం ఐదు షరతులతో సుప్రీంకోర్టు బెయిల్ విధించింది. సీఎం కార్యాలయాన్ని సందర్శించడానికి వీల్లేదని, గవర్నర్ అనుమతి లేకుండా అధికారిక ఫైళ్లపై సంతకం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. బెయిల్ కోసం రూ.50,000 వ్యక్తిగత పూచికత్తు చెల్లించాలని పేర్కొంది. ఇక ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సాక్షులలో ఎవరితోనూ మాట్లాడకూడదు లేదా కేసుతో సంబంధించిన ఫైల్స్ జోలికి వెళ్లొద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా ఈ మధ్యంతర బెయిల్‌ను పొడిగించవచ్చు లేదా ఎక్కువ మంది సభ్యులతో కూడిన బెంచ్ రీకాల్ చేయవచ్చునని సుప్రీంకోర్ట్ పేర్కొంది.

సీబీఐ కేసులో కస్టడీ పొడిగింపు

అయితే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కేజ్రీవాల్ జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. ఇదే కేసులో కేజ్రీవాల్ ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది.

ఇప్పుడే ముగిస్తారా?

- సిరీస్ విజయంపై భారత్ గురి
- భారత్, జింబాబ్వే నాల్గో టీ20 నేడు

సాయంత్రం 4.30 నుంచి సోనీస్పోర్ట్స్‌లో..

ఐసీసీ టీ20 ప్రపంచకప్ చాంపియన్ టీమ్ ఇండియా.. జింబాబ్వేపై పొట్టి సిరీస్‌పై కన్నేసింది. ఐదు మ్యాచుల సిరీస్‌ను నేడు నాల్గో మ్యాచ్‌లోనే ముగించాలని ఎదురుచూస్తుంది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న శుభ్‌మన్ గిల్ సేన.. 3-1తో టీ20 సిరీస్ సాధించాలని అనుకుంటుంది. తుది జట్టు కూర్పు గిల్‌కు సవాల్‌గా మారనుండగా.. భారత్, జింబాబ్వే నాల్గో టీ20 పోరు నేడు.



నవతెలంగాణ-హరారే

టీ20 సిరీస్ సొంతం చేసుకోవటమే లక్ష్యంగా నేడు జింబాబ్వేతో నాల్గో మ్యాచ్‌కు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. కానీ ఇదే సమయంలో శుభ్‌మన్ గిల్ నాయకుడిగా కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అందరికీ తుది జట్టులో చోటు ఉండాలనే తాపత్రయంలో మూడో టీ20లో జట్టు సమతూకం దెబ్బతిన్నది. నేడు అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా.. బ్యాటర్లు, ఆల్‌రౌండర్లు, బౌలర్ల ఎంపికలో వివేకం చూపించాల్సి ఉంటుంది. మరోవైపు జింబాబ్వే సైతం మరోసారి సంచలనం చేయాలని ఉవ్విళ్లూరుతోంది.

మార్పులు అవసరమే!

తొలి మ్యాచ్‌లో ఓటమి నుంచి గిల్ సేన వేగంగా పుంజుకుంది. వరుసగా రెండు మ్యాచుల్లో విజయాలు నమోదు చేసింది. యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, శివం దూబె తుది జట్టులో రావటం జట్టును బలోపేతం చేసింది. కానీ ఇదే సమయంలో బ్యాటింగ్ లైనప్ ఓపెనర్ల మయంగా మారింది. యశస్వి జైస్వాల్, గిల్, రుతురాజ్, అభిషేక్ శర్మలు టాప్-4లో బ్యాటింగ్ చేశారు. సంజు శాంసన్, రింకూ సింగ్ వరుసగా నం.5, నం.6 స్థానాల్లో ఆడారు. దీంతో బౌలింగ్ లైనప్‌పై ఒత్తిడి పెరిగింది. అభిషేక్ శర్మ, శివం దూబె పరుగుల నియంత్రణ పాటించలేదు. దీంతో ఏడు ఓవర్లలో 39/5తో నిలిచిన జింబాబ్వే ఏకంగా 20 ఓవర్లలో 159/6తో మెరుగ్గా ముగించింది. డెత్ ఓవర్లలో బౌలర్లు మెరిసినా.. నేడు తుది జట్టులో మరో బౌలర్ అవసరం. టాప్-4లో ఓ బ్యాటర్‌పై వేటు వేసి.. అదనపు బౌలర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం లేకపోలేదు. అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్‌లతో పాటు రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్ అంచనాలను అందుకున్నారు. భారత్ నేడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

పుంజుకుంటారా?

ఆతిథ్య జింబాబ్వే మరో విజయంపై కన్నేసింది. ఆ జట్టులో బ్యాటింగ్ లైనప్ నిలకడగా రాణించటం లేదు. టాప్‌లో మెరిస్తే.. మిడిల్‌లో చేతులెత్తేస్తున్నారు. మిడిల్‌లో రాణిస్తే.. టాప్ నిరాశపరుస్తుంది. బ్యాటర్లు సమిష్టిగా ఆడితే మరో విజయం సాధించగలమనే నమ్మకం ఆ జట్టులో ఉంది. భారత స్పిన్నర్లు రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్ ఓవర్లను కాచుకుని.. ఇతర బౌలర్లపై ఎదురుదాడి చేసేందుకు ఆ జట్టు ప్రణాళిక రచిస్తోంది. కెప్టెన్ సికిందర్ రజా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. బ్రియాన్ బెనెట్, మేయర్స్, కాంప్‌బెల్ సహా క్లైవ్ రాణిస్తున్నారు. బౌలర్లు సైతం కలిసికట్టుగా ఒత్తిడి పెంచితే.. భారత్‌ను స్వల్ప స్కోరుకు పరిమితం చేయవచ్చని జింబాబ్వే భావిస్తోంది.

ఆటగాళ్ల రొటేషన్?!

భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్‌ను కాస్త కఠినంగా రూపొందించారు. తొలి రెండు మ్యాచులను వరుస రోజుల్లో షెడ్యూల్ చేయగా.. చివరి రెండు మ్యాచులను వరుసగా శని, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. దీంతో ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి అందించటం కోసం టీమ్ ఇండియా రొటేషన్ పాలసీ అమలు చేసే అవకాశం ఉంది. నేడు ఆడిన ఆటగాళ్లకు చివరి మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వాలనే ఆలోచన డ్రెస్సింగ్‌రూమ్‌లో కనిపిస్తుంది.

పిచ్, వాతావరణం

హరారే స్పోర్ట్స్ క్లబ్ పిచ్ విలక్షణంగా స్పందిస్తుంది. ఆరంభంలో పేస్, బంతి మెత్తబడిన తర్వాత స్పిన్‌కు అనుకూలిస్తుంది. బ్యాటర్లు పిచ్‌ను అర్థం చేసుకోకుండా ఎదురుదాడి చేస్తే.. మూల్యం చెల్లించుకోక తప్పదు. భారత్‌కు స్పిన్నర్లు రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్ ఓవర్లు కీలకం కానున్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

తుది జట్లు (అంచనా)

భారత్ : యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్, సంజు శాంసన్, రింకూ సింగ్, శివం దూబె, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్.

జింబాబ్వే : వెస్లీ, మారుమని, బ్రియాన్ బెనెట్, డయాన్ మేయర్స్, సికందర్ రజా (కెప్టెన్), జొనాథన్ కాంప్‌బెల్, క్లైవ్ మదాండె, వెల్లింగ్టన్ మసకద్జ, బ్లెస్సింగ్ ముజరబాని, రిచర్డ్, చతార.



పేస్ దిగ్గజం వీడ్కోలు

తొలి టెస్టులో విండీస్‌పై ఇంగ్లాండ్ గెలుపు

లార్డ్స్ : పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ ఆటకు వీడ్కోలు పలికాడు. టెస్టు క్రికెట్ కెరీర్‌లో 704 వికెట్ల ఘనతతో అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. కెరీర్ ఆఖరు మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై అండర్సన్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ గస్ అటిక్సన్ 12 వికెట్ల ప్రదర్శనతో తొలి టెస్టులో వెస్టిండీస్ చిత్తుగా ఓడింది. విండీస్ వరుసగా 121, 136 పరుగులకు కుప్పకూలగా.. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 371 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది.

ఆల్‌టైమ్ లెజెండ్ : 42 ఏండ్ల జేమ్స్ అండర్సన్ కెరీర్‌ను అత్యున్నతంగా ముగించాడు. ఆఖరు మ్యాచ్‌లోనూ బంతితో నిప్పులు చెరిగాడు. కెరీర్ 704 వికెట్లతో ఆల్‌టైమ్ లెజెండ్‌గా ఆట నుంచి నిష్క్రమించాడు. 2003 లార్డ్స్ టెస్టులో జింబాబ్వేపై అంతర్జాతీయ అరంగేట్రం చేసిన జేమ్స్ అండర్సన్.. అదే మైదానంలో 2024లో వెస్టిండీస్‌పై లాంఛనం ముగించాడు. 188 టెస్టులు ఆడిన జేమ్స్ అండర్సన్ 26.45 సగటు, 2.79 ఎకానమీ, 56.8 స్ట్రయికరేట్‌తో 704 వికెట్లు పడగొట్టాడు. ఓ ఇన్నింగ్స్‌లో 7/42, ఓ మ్యాచ్‌లో 11/71 అండర్సన్ అత్యుత్తమ గణాంకాలు. 32 సార్లు నాలుగు వికెట్లు, 32 సార్లు ఐదు వికెట్లు సహా 3 సార్లు పది వికెట్ల ప్రదర్శన అండర్సన్ సొంతం. ఆఖరు మ్యాచ్‌లో గార్డ్ ఆఫ్ హానర్ దక్కించుకున్న అండర్సన్.. మైదానంలో జట్టును ముందుండి నడిపించాడు. దిగ్గజం అండర్సన్‌కు ఇంగ్లీశ్ అభిమానులు లార్డ్స్‌లో భావోద్వేగ వీడ్కోలు పలికారు.

వైఎంసీఏ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా యూజీన్ జార్జ్



హైదరాబాద్ : సీనియర్ కోచ్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్సల్టెంట్ డా. యూజీన్ జార్జ్ వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. బాస్కెట్‌బాల్‌లో సీనియర్ కోచ్‌గా, జాతీయ చాంపియన్‌షిప్స్ టైటిల్స్ సాధించిన మాజీ ఆటగాడిగా జార్జ్ సుపరిచితులు. ఇక నుంచి వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ స్పోర్ట్స్, గేమ్స్ అభివృద్ధిని జార్జ్ పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

రాయల్ వీటోను ఉపయోగిస్తున్న మాక్రాన్

ఫ్రాన్స్ వామపక్షాల విమర్శలు



పారిస్ : గత వారాంతంలో ఫ్రాన్స్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా సీట్లు గెలిచిన వామపక్ష కూటమి నుండి ప్రధానిని నియమించేందుకు తిరస్కరించిన తర్వాత అధ్యక్షుడు మాక్రాన్ రాయల్ వీటోను ఉపయోగిస్తున్నారని వామపక్ష పార్టీలు విమర్శించాయి. అత్యధికంగా సీట్లు గెలిచిన కూటమికి అధికారం ఇవ్వకుండా తన అధికారాలతో అడ్డుకోవడమే ఈ రాయల్ వీటో. కొత్త ప్రధానిని ప్రకటించడానికి ముందుగా నేషనల్ అసెంబ్లీలో 'రిపబ్లికన్' (ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన) మెజారిటీని సాధించాల్సిందిగా దేశ రాజకీయ పార్టీలను మాక్రాన్ కోరారు. ఈ ఎన్నికల్లో ఎవరూ గెలవలేదు. ప్రభుత్వ సంస్థలకు, చట్టబద్ధ పాలనకు, పార్లమెంటరీ నిబంధనలకు, యురోపియన్ అనుకూల దృక్పథానికి, ఫ్రెంచ్ స్వాతంత్ర్య రక్షణకు కట్టుబడి వుండాలని అందుకు అవసరమైన మెజారిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన పార్టీలకు పిలుపిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. ఈ సూత్రాలన్నింటికీ కట్టుబడి వుండాలని అప్పుడే ప్రధాని నియామకంపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ రాలేదు. 577 సీట్లు గల నేషనల్ అసెంబ్లీలో వామపక్ష పార్టీల కూటమికి 193సీట్లు లభించాయి. మాక్రాన్ పార్టీకి 164 సీట్లు రాగా, మితవాద లీపెన్ పార్టీకి 143సీట్లు లభించాయి.మాక్రాన్ తీరుపై సోషలిస్టు పార్టీ చీఫ్ ఆలీవర్ ఫార్ స్పందిస్తూ, ఫ్రెంచి ప్రజల తీర్పును, ఓటును గౌరవించడంలో అధ్యక్షుడు విఫలమయ్యారని విమర్శించారు. మరో రాడికల్ నేత జేన్‌లూస్ మెలెంకన్ మాట్లాడుతూ మాక్రాన్‌పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాయల్ వీటో తిరిగి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2022 ఎన్నికల్లో మాక్రాన్ కూటమి 174సీట్లు గెలిచినా అధికార పగ్గాలు చేపట్టిన మాక్రాన్ ఇప్పుడు ఎన్‌పిఎఫ్ 193సీట్లు గెలిచినా దాన్ని ఆమోదించడానికి తిరస్కరిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని ఫ్రాన్స్‌లోనే అతిపెద్ద కార్మిక సంఘ సమాఖ్య అధ్యక్షురాలు సోఫీ బినెట్ విమర్శించారు.

బైడెన్ తడబాట్లు

- జెలెన్‌స్కీను 'ప్రెసిడెంట్ పుతిన్'గా పరిచయం
- కమలా హారిస్‌ను 'వైస్ ప్రెసిడెంట్ ట్రంప్'గా..

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇప్పటికే తన జ్ఞాపకశక్తి, వయస్సుపై అనేక అనుమానాలు ఎదుర్కొంటుంటున్న అధ్యక్షులు, డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ మరోసారి వరసగా తడబాట్లుకు గురయ్యారు.తనపై అనుమానాలను మరింతగా పెంచుకుంటున్నారు. గురువారం ఒకే రోజున ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీను 'ప్రెసిడెంట్ పుతిన్'గా పరిచయం చేయడం, తరువాత మరొక కార్యక్రమంలో అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్‌ను వైస్‌ప్రెసిడెంట్ ట్రంప్‌గా పేర్కొనడంతో బైడెన్‌పై సందేహాలు మరింతగా బలపడ్డాయి. ఈ నెల 11న వాషింగ్టన్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశ ముగింపు కార్యక్రమం సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీను 'ప్రెసిడెంట్ పుతిన్'గా పరిచయం చేయడంతో అక్కడ ఉన్న వారంతా నోరెళ్లబెట్టారు. తరువాత జరిగిన న్యూస్ కాన్ఫరెన్స్‌లో వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్‌ను 'వైస్‌ప్రెసిడెంట్ ట్రంప్'గా బైడెన్ పేర్కొన్నారు. దీంతో బైడెన్ అభ్యర్థిత్వంపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బైడెన్ అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకోవాలని మరో ముగ్గురు డెమోక్రాటిక్ చట్ట సభ్యులు డిమాండ్ చేశారు.



శివ రాజ్‌కుమార్


రామ్‌చరణ్ సినిమాలో పవర్‌ఫుల్ రోల్

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర గ్లోబల్ సక్సెస్ రామ్ చరణ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఫేమ్ తెచ్చింది. 'ఉప్పెన'తో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు సానా. ఈయన దర్శకత్వంలో రామ్‌చరణ్ తన 16వ సినిమా చేయనున్నారు. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంతో వెంకట సతీష్ కిలారు గ్రాండ్‌గా ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో పలు భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ ఈ సినిమాలో నటిస్తున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెరీ పవర్ ఫుల్ రోల్ పోషించడానికి ఆయన సైన్ చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు ప్రత్యేక సందర్భంగా మేకర్స్ తెలిపారు. ఈ న్యూస్‌తో అటు రామ్‌చరణ్, ఇటు శివ రాజ్‌కుమార్ అభిమానులు ఫుల్ ఖుషీలో ఉన్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందిన 'ఉప్పెన' చిత్రంతో దర్శకుడు బుచ్చిబాబు సాన అత్యద్భుతమైన సక్సెస్ అందుకున్నారు. ఆయనతో రామ్‌చరణ్ సినిమా చేస్తున్నారనగానే సర్వత్రా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేందుకు మేకర్స్ రంగం సిద్ధం చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది. ఇందులో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, డీవోపీ: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా.

నవచిత్రం

శివం భజే రిలీజ్‌కి రెడీ



అశ్విన్ బాబు

ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన గంగా ఎంటర్టైన్మెంట్స్ 'శివం భజే' చిత్రం ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానుందని నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి శుక్రవారం తెలిపారు.

అప్సర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ న్యూ ఏజ్ డివైన్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంలో హీరో - హీరోయిన్లుగా అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవంశీ నటించారు. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, మురళీ శర్మ, తనికెళ్ళ భరణి, సాయి ధీన, అయ్యప్ప శర్మ, హైపర్ ఆది, బ్రహ్మాజీ, తులసి, దేవి ప్రసాద్ వంటి నటులు ముఖ్యమైన పాత్రలు పోషించారు.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 'వైవిధ్యమైన కథతో, సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాం. ఫస్ట్ లుక్‌కి, టీజర్‌కి అద్భుతమైన స్పందన రావడంతో చిత్ర విజయంపై మాకున్న విశ్వాసం మరింత పెరిగింది. మా హీరో అశ్విన్ బాబు, దర్శకుడు అప్సర్, అర్బాజ్ ఖాన్, సాయి ధీనా, హైపర్ ఆది, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి వంటి ఆర్టిస్టులు, ఇండస్ట్రీ మేటి సాంకేతిక నిపుణుల సహకారంతో మా మొదటి చిత్రం అనుకున్నట్టుగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి' అని తెలిపారు.

'అన్ని వర్గాలు, వయసుల ప్రేక్షకులని అలరించడానికి మా సినిమా సిద్ధంగా ఉంది. ఇప్పటికే మా చిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలో మంచి అంచనాలున్నాయి' అని దర్శకుడు అప్సర్ చెప్పారు.

హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ, 'మా టీజర్‌కి వచ్చిన అనూహ్య స్పందనకి మా అందరి విశ్వాసం అమాంతం పెరిగిపోయింది. దర్శకుడు అప్సర్ వైవిధ్యమైన కథకి తగ్గట్టుగా కావాల్సిన సాంకేతిక విలువలు, నిపుణులని ఖర్చుకి వెనకాడకుండా మా నిర్మాత మహేశ్వర రెడ్డి సహకారం అందించడం, ప్రతీ ఒక్కరు తమ కెరీర్ బెస్ట్ ఇవ్వడంతో ఈ చిత్రం మేము ఊహించిన దానికంటే అద్భుతంగా వచ్చింది' అని అన్నారు.

లవ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్

సున్ చెలియా..



నభా నటేష్, ప్రియదర్శి

రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జోనర్‌లతో వచ్చే సినిమాలు ప్రేక్షకుల అనుభూతిని బూస్ట్ చేయడానికి చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లు అవసరం. ఈ జోనర్ చిత్రాలు ఇంపాక్ట్ క్రియేట్ చేయడంలో మ్యూజిక్ కీలక పాత్ర పోషిస్తుంది.

'డార్లింగ్' సినిమా విడుదలకు ముందే మ్యూజికల్ హిట్‌గా మారింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ కె నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలోని మొదటి రెండు పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి.


తాజాగా మేకర్స్ శుక్రవారం థర్డ్ సింగిల్ 'సున్ చెలియా..'ను రిలీజ్ చేశారు. మొదటి రెండు పాటలు ప్రియదర్శి, నభా నటేష్‌ల సోలో నెంబర్‌లు కాగా, మూడవ పాట ఇద్దరూ కలసి అలరించిన డ్యూయెట్. వివేక్ సాగర్ ఈ పాటని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న లవ్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా చాలా బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేశారు. అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో ఈ పాట మెస్మరైజ్ చేస్తోంది. వివేక్ మ్యూజిక్ సాంగ్ మూడ్‌కి పర్ఫెక్ట్. కాసర్ల శ్యామ్ లిరిక్స్ లవ్లీగా ఉండగా, అనురాగ్ కులకర్ణి వోకల్స్ ఎక్స్ప్రెసివ్‌గా ఉన్నాయి. ఈ పాట లీడ్ పెయిర్ ప్రియదర్శి, నభా నటేష్‌ల లవ్లీ జర్నీని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ పాటలో వీరిద్దరూ స్పార్కింగ్ కెమిస్ట్రీని షేర్ చేసుకున్నారు. ఈ పాట ఇన్‌స్టంట్ ఇంప్రెషన్‌ని క్రియేట్ చేస్తోంది. థియేట్రికల్ రిలీజ్‌కి ముందే ఇది చాలా పాపులర్ అవుతుంది. ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, డీవోపీ: నరేష్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ, డైలాగ్స్: హేమంత్, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సీతారామ్ వై, లిరిక్స్: కాసర్ల శ్యామ్, కొరియోగ్రాఫర్: విజయ్ పోలాకి, ఈశ్వర్ పెంటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ : ప్రకాష్ రెడ్డి పన్నాల, వంశీ సంగెం, లైన్ ప్రొడ్యూసర్: మంచి వెంకట్.

చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో

కపుల్ ఫ్రెండ్లీ

యూవీ క్రియేషన్స్ సమర్పణలో సంతోష్ శోభన్ హీరోగా యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తున్న నూతన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. శుక్రవారం హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ స్పెషల్ గ్లింప్స్‌తో పాటు ఈ సినిమా టైటిల్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో మిస్ ఇండియా మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది.

లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అజయ్ కుమార్.పి. కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ టైటిల్ లుక్‌లో చెన్నై సెంట్రల్ స్టేషన్ దగ్గరలోని ఓ రెసిడెన్షియల్ ఏరియాను చూపించారు. చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఇంట్రెస్టింగ్ మూవీగా ఈ సినిమా ఉండబోతోందని గ్లింప్స్ ద్వారా మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ - మైఖేల్, ఎడిటర్ - గణేష్ శివ, సినిమాటోగ్రఫీ - దినేష్ పురుషోత్తమన్, మ్యూజిక్ - ఆదిత్య రవీంద్రన్, రచన దర్శకత్వం - అశ్విన్ చంద్రశేఖర్.



సంతోష్ శోభన్

మరో భిన్న ప్రేమకథ..

నిర్మాత ఎస్‌కేఎన్, నిర్మాత, దర్శకుడు సాయి రాజేశ్ సంయుక్త నిర్మాణంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సంతోష్ శోభన్, సోషల్ మీడియా ఫేమ్ అలేఖ్య హారిక హీరో, హీరోయిన్లుగా ప్రొడక్షన్ నెం.4 సినిమా తెరకెక్కుతోంది. సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు.

ఈ పోస్టర్ పై కొన్ని 'ప్రేమ కథలు జీవితకాలం వెంటాడుతాయి..' అనే హార్ట్ టచింగ్ క్యాప్షన్ ఆకట్టుకుంటోంది. సంతోష్ శోభన్ లుక్ ఇంటెన్స్ గా ఉంది. ఈ చిత్రానికి సుమన్ పాతూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

కమిటీ కుర్రోళ్ళ సందడి మొదలైంది..



నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాకు యదు వంశీ దర్శకుడు.

పక్కా ప్లానింగ్‌తో మేకర్స్ అనుకున్న సమయానికి కంటే ముందే సినిమా షూటింగ్ పూర్తి చేయటం విశేషం. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా శుక్రవారం ఈ చిత్రం నుంచి జాతర పాటను రిలీజ్ చేశారు. 'సందడి సందడి..' అంటూ సాగే ఈ పాటను సింహాచలం మన్నెల రచించగా, అనుదీప్ దేవ్, రేణూ కుమార్, శ్రీనివాస్ దరిమిశెట్టి ఆలపించారు. అనుదీప్ దేవ్ మంచి ఊపునిచ్చే బాణీని అందించారు. ఈ లిరికల్ వీడియోలోని విజువల్స్, జాతర సన్నివేశాలు, కుర్రాళ్ల ధూంధాం స్టెప్పులు బాగున్నాయి. ఆగస్టులో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు.

సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు,త్రినాద్ వర్మ ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి, శ్యామ్ కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్ట, అక్షయ్ శ్రీనివాస్, రాధ్య, తేజస్వి రావు, టీనా శ్రావ్య విషిక, సాయి కుమార్, గోపరాజు రమణ, బలగం జయరాం, శ్రీ లక్ష్మి, కంచెరపాలెం కిషోర్, కిట్టయ్య, రమణ భార్గవ్, జబర్దస్త్ సత్తిపండు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు - పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక, రచన, దర్శకత్వం - యదు వంశీ, సినిమాటోగ్రఫీ - రాజు ఎడురోలు, మ్యూజిక్ డైరెక్టర్ - అనుదీప్ దేవ్, ప్రొడక్షన్ డిజైనర్ - ప్రణయ్ నైని, ఎడిటర్ - అన్వర్ అలీ, డైలాగ్స్ - వెంకట సుభాష్ చీర్ల, కొండల రావు అడ్డగళ్ల, ఫైట్స్ - విజయ్, నృత్యం - జె.డి మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - మన్యం రమేష్, సౌండ్ డిజైనర్: సాయి మణిందర్ రెడ్డి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.